www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం

'జగనన్న గోరుముద్ద' పేరు మార్చిన కూటమి ప్రభుత్వం

కలాం స్ఫూర్తితో విద్యా పథకాలకు కొత్త పేర్లు

ఎక్స్‌లో మంత్రి లోకేశ్

11

ఆదివారం | 28-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 103 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 7.28 తదుపరి నవమి; నక్షత్రం: అశ్విని ఉ. 11.48 తదుపరి భరణి; వర్జ్యం: ఉ. 8.00-9.31, రా. 9.02-10.35; దుర్ముహూర్తం: సా. 5.03-5.54; అమృతఘడియలు: శేషం ఉ. 6.28; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగన్ ధ్వంస రచన.. అబద్ధాలే ఆలంబన!



జగన్ రెడ్డి వద్ద అంతులేని ధన బలం ఉంది. అతడికి కావాల్సింది అధికారం! 'అధికారం కోసం ధనం - ధనం కోసం అధికారం' అన్న సూత్రాన్ని జగన్ రెడ్డి బలంగా నమ్ముతారు. అందుకే శాసనసభకు హాజరై అతను టైం వేస్ట్ చేసుకోరు. తాడేపల్లి ప్యాలెస్‌లోనో, బెంగళూరు ప్యాలెస్‌లోనో, మరోచోట నిర్మించుకున్న ప్యాలెస్‌లోనో సతీసమేతంగా సేదదీరుతూ విధ్వంస రచన చేస్తుంటారు.

అబద్ధాలే పునాదిగా జగన్ రాజకీయాలు ఉంటాయి. ఇప్పుడు తాజా ఎన్నికల్లో తమకు అపూర్వ విజయం దక్కడంతో జగన్మోహన్ రెడ్డి పనైపోయిందని చంద్రబాబు అండ్ కో సంబరపడినంత సేపు పట్టలేదు... అతగాడు తనలోని మరో కోణం ప్రదర్శించడం మొదలుపెట్టారు.

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందో లేదో... రాష్ట్రంలో అరాచకం ప్రబలిందని, రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెట్టడం జగన్ రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెల రోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలో ప్రథమం కావొచ్చు. ఇదే జగన్ రెడ్డి ప్రత్యేకత!

జగన్ రెడ్డి రాజకీయాలకు అబద్ధాలు ఒక్కటే ఆలంబన కాదు, శవాలు కూడా కావాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన రాజకీయాలకోసం శవాలు ఎక్కడ దొరుకుతాయా అని జగన్ ఎదురుచూస్తుంటారు. తాజాగా వినుకొండలో రషీద్ శవం అతనికి లభించింది. వెంటనే వికృత రాజకీయాలకు తెరలేపారు.


కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో

పదేళ్లలో
ఏపీ అగ్రగామి



- అభివృద్ధికి అవసరమైన వనరులు రాష్ట్రంలో పుష్కలం
- పీ-4 విధానం అమలుతో పేదరిక నిర్మూలన సాధ్యం
- నదుల అనుసంధానంపై రోడ్‌మ్యాప్ రూపొందించాలి
- అధిక జనాభా దేశ బలహీనత కాదు.. అదే మన బలం
- మన దేశానికి ఉన్న అతిపెద్ద వనరు యువత
- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

శనివారం ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): రానున్న పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో అగ్రగామిగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జల వనరులు, ఖనిజ వనరులు, సువిశాలమైన కోస్తా తీరం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, సారవంతమైన భూమి వంటి అభివృద్ధికి అవసరమైన వనరులు ఏపీలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో అందరికంటే ముందు చంద్రబాబు మాట్లాడారు. దాదాపు ఏడు నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో

మిగతా 11వ పేజీలో...

పోలవరానికి 12,500 కోట్లు త్వరగా ఇవ్వండి

- కేంద్ర కేబినెట్‌తో ఆమోదింపజేయండి.. జలశక్తి మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి
- కొత్త డయాఫ్రం వాల్‌పై ప్రతిపాదనలు కేంద్రం ముందు ఉంచాం
- ప్రాజెక్టు పూర్తి చేయడంపై రాష్ట్ర మంత్రివర్గ నోట్‌ను అందజేశాం
- తొలి దశ, మలిదశ లేవు.. మొత్తం పూర్తిచేయడమే మా ముందున్న లక్ష్యం
- 3 నెలల్లో పనులపై నిర్ణయం తీసుకోవాలి.. లేదంటే మరో సీజన్ కోల్పోతాం
- జగన్ పాలనలో రాష్ట్రం దిగజారింది.. కేంద్ర నిధులను దారి మళ్లించింది
- తీవ్రంగా నష్టపోయినందునే పునర్నిర్మాణానికి సాయం కోరుతున్నాం
- విభజన చట్టంలో ఉన్నవే చేశారు.. మాకు కొత్తగా చేసిందేమీ లేదు: సీఎం

11

రాష్ట్రాల స్థాయిలో నదుల గ్రిడ్

- జల వనరుల సమర్థ వినియోగానికి ఏర్పాటు చేయాలి
- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీ పడండి!
- రాష్ట్రాల సహకారంతోనే 2047 నాటికి వికసిత్ భారత్
- నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు 12



12

బెంగళూరు ఎయిర్‌పోర్టులో..
మోహిత్‌రెడ్డి అరెస్టు!

- కుమారులిద్దరితో దుబాయ్ బయల్దేరిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి
- పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో మోహిత్‌పై లుకౌట్ నోటీసులు
- ఎయిర్‌పోర్టులో అడ్డుకున్న ఇమిగ్రేషన్ అధికారులు
- ఏపీ పోలీసులకు సమాచారం
- డీఎస్పీ సారథ్యంలో బెంగళూరు వెళ్లిన బృందం
- నేడు తిరుపతికి తీసుకొచ్చి కోర్టులో హాజరు!



2

మీ కపట నాటకానికి మా సంఘీభావమా!

సిద్ధమన్నారుగా.. 11 మంది బలం సరిపోలేదా?

జగన్‌ను నిలదీసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



మంటల్లో తగలబడుతున్న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం (ఫైల్)

కుట్రతోనే నిప్పు

- షార్ట్ సర్క్యూట్ కారణం కాదు.. బయటి వ్యక్తుల ప్రమేయం లేదు
- భూ అక్రమాలు బయటకు రాకూడదనే దుశ్చర్య
- అల్మరాలో దాచిన 7 లీటర్ల ఇంజన్ ఆయిల్
- 21వ తేదీ రాత్రి 11-11:30 గంటల మధ్య ఘటన
- 10వ తేదీ నుంచే పనిచేయని సీసీ కెమెరాలు
- మాజీ ఆర్‌డీఓ మురళి, పెద్దిరెడ్డి పీఏ, అనుచరుల పాత్ర
- వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- 22(ఏ) నుంచి వేలాది ఎకరాలు అడ్డగోలుగా తొలగింపు
- 'మదనపల్లె' ఫైళ్ల దహనంపై సిసోడియా ప్రాథమిక నివేదిక

11

పోలీసుల అదుపులో మాధవరెడ్డి సన్నిహితులు!

- రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి, మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్
- మిథున్‌రెడ్డి పీఆర్వోకు పిలుపు.. మరికొందరి కోసం గాలింపు

రూ.200 కోట్లతో స్కిల్ టెక్నాలజీ కేంద్రాలు

- త్వరలో కార్యాచరణ: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం, జూలై 27: రూ.200కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ టెక్నాలజీ కేంద్రాలు ఏర్పాటు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శనివారం విజయనగరం జిల్లా గజపతినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 10 స్కిల్ డెవలప్‌మెంట్ టెక్నాలజీ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఒక్కో కేంద్రానికి రూ.20 కోట్లు వెచ్చిస్తామని అన్నారు. అలాగే డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో గ్రామాల్లో చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలను భాగస్వామ్యులను చేస్తామన్నారు. వైఎస్ జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు.

నేడు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు

విశాఖపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం సాయంత్రానికి ఉత్తర ఒడిశా పరిసరాలకు చేరుకుని బలహీనపడింది. దీనిపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కొనసాగుతోంది. దీని ప్రభావంతో శనివారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రుతుపవనద్రోణి ఉత్తరాది వైపు పయనించే అవకాశం ఉన్నందున రానున్న రెండు రోజుల్లో వర్షాలు తగ్గుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరకోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

100 మిలియన్ టన్నులు!

- స్టీల్ ఉత్పత్తిలో విశాఖ ఉక్కు కర్మాగారం రికార్డు

విశాఖపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్- ఆర్ఐఎన్ఎల్)లో సేలబుల్ స్టీల్ ఉత్పత్తి 100 మిలియన్ టన్నులు దాటింది. ఇది ఒక రికార్డు. కర్మాగారంలో 1990లో ఉత్పత్తి మొదలైంది. ఏడాదికి 3.1 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో మొదలై ఆ తర్వాత 7.3 మిలియన్ టన్నులకు రూ.25 వేల కోట్లతో విస్తరించారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్(బీఎఫ్)ల ద్వారా రోజుకు 22 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి జరగాల్సి ఉండగా ముడిపదార్థాల కొరతతో రెండేళ్లు బీఎఫ్-3 మూతపడింది. గతేడాది డిసెంబరు 27న జిందాల్ ఆర్థిక సాయంతో బీఎఫ్-3ని ప్రారంభించి పూర్తిస్థాయి ఉత్పత్తికి ప్రయత్నం చేశారు. అయితే కేవలం 45 రోజులు మాత్రమే మూడు బీఎఫ్‌లను నడిచాయి. ఆర్థిక సమస్యలతో ముడిసరకు సమకూర్చుకోలేక బీఎఫ్-1ను ఫిబ్రవరిలో మూసేశారు. ఈ జూలైలో సగటున రోజుకు రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 14వేల టన్నుల ఉత్పత్తి చేయాల్సి ఉండగా 12,170 టన్నులకే పరిమితమయ్యారు. వాస్తవానికి సేలబుల్ స్టీల్ 100 మిలియన్ టన్నుల మార్క్‌ను నాలుగేళ్ల క్రితమే అధిగమించాల్సి ఉంది. బీఎఫ్‌లకు అవసరమైనంత ముడి పదార్థాలు (ఐరన్ ఓర్, కోకింగ్ కోల్), విడిభాగాలు అందించలేకపోవడంతో చాలా ఆలస్యమైంది.

అప్పుల సాకుతో ప్రజలపై భారం వద్దు: సీపీఎం

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 27: 'అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలు చూస్తే రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందనే భావన కలుగుతుంది. అప్పులు ఉన్నాయనే సాకుతో ప్రజలపై భారాలు వేయకుండా కేంద్రం నుంచే నిధులు రాబట్టుకోవాలి' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఒంగోలులో మీడియాతో ఆయన మాట్లాడారు. 'ఆర్థిక లోటు భర్తీకి ఏం చేస్తారనేది స్పష్టత లేదు. అమరావతికి రూ.15 వేల కోట్ల సాయంపైనా స్పష్టత లేదు. గ్రాంటా? రుణమా? అనేది తేల్చకుండా బీజేపీ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

గనుల శాఖలో జగన్ మనుషులు

- శ్వేతపత్రంలో అక్రమాలు కనుమరుగు
- వైస్ ప్రెసిడెంట్ నుంచి జనరల్ మేనేజర్ వరకు అంతా వైసీపీ మాస్టర్ మైండ్స్
- శ్వేతపత్రంలో రాకుండా ఓ అధికారి పాత్ర

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖలో మాజీ సీఎం జగన్ మనుషులు తిష్ట వేశారు. గత ప్రభుత్వంలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు అధికారులు పదవుల్లో కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ చక్రం తిప్పుతున్నారు. జగన్ అక్రమాలు, అన్యాయాలు, ఆర్థిక దోపిడీని బయట పెట్టేందుకు సర్కారు సకల ప్రయత్నాలు చేస్తుంటే.. వైసీపీ మాస్టర్ మైండ్స్ ఆ ప్రయత్నాలను డైవర్ట్ చేస్తున్నారు. జగన్ పాలనలో గనుల శాఖలో 20 వేల కోట్ల అవినీతి జరిగిందని కూటమి సర్కారు ఇటీవల శ్వేతపత్రం విడుదల చేసిన సంగతి తెలిసిందే. కానీ అందులో ప్రస్తావనకు రాని ఆర్థిక నేరాలు, అక్రమాలు ఎన్నో ఉన్నాయి. వాటిని కప్పిపెట్టింది జగన్ టీమే. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 2నెలలు కావొస్తున్నా గనుల శాఖలో ప్రక్షాళన జరగలేదు. జగన్ టీమ్‌తోనే ఆయన పాలనలో జరిగిన అక్రమాలు బయట పెట్టించాలనుకుంటే అది అయ్యేపనేనా? గనుల శాఖ, ఏపీఎండీసీలో వైస్ ప్రెసిడెంట్ నుంచి జనరల్ మేనేజర్ వరకు.. కొనుగోళ్లు, మార్కెటింగ్, బెరైటీస్, బొగ్గు, ఇసుక, బిల్లుల చెల్లింపు తదితర విభాగాల్లో జనరల్ మేనేజర్ నుంచి సూపరింటెండెంట్ వరకు.. పీఏల నుంచి పీఎస్‌ల వరకు జగన్ టీమే ఉన్నారు. వీరంతా గనులశాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఏరికోరి తెచ్చిపెట్టుకున్న నమ్మకమైన అస్మదీయులు. ఇంతమంది ఉండగా అక్రమాలు, అన్యాయాలు ఎలా బయటకొస్తాయి? కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించలేదు. దీంతో గతంలో జరిగిన అక్రమాలు కప్పిపెట్టే ప్రయత్నం జోరుగా సాగుతోంది. జగన్ మనుషులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడంతో పాటు తప్పుడు సమాచారం చేరవేస్తున్నారు. అసెంబ్లీలో సైతం తప్పుడు వివరాలు అందించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం మేల్కొనకపోతే గుండుసుది లాంటి ఆధారం కూడా కనిపెట్టలేదని సీనియర్ అధికారులు చెబుతున్నారు.

అంతా వీరభద్ర మాయ

గనులశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గర ఓఎస్డీగా వీరభద్రరావు అనే గనుల శాఖ డీడీ పనిచేశారు. పెద్దిరెడ్డి కేంద్రంగా జరిగిన అనేక అక్రమాల్లో ఆయన ప్రమేయం ఉందని ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయి. మినరల్స్‌కు ఎల్ఓఐ (లెటర్ ఆఫ్ ఇంటెంట్)ల జారీ, ఫ్యాక్టరీలపై విజిలెన్స్ దాడులు, కేసుల విచారణలో అంతా తానై పెద్దిరెడ్డిని నడిపించారని బాధిత కంపెనీలు, శాఖ ఉద్యోగులు బాహాటంగా చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన తిరిగి గనుల శాఖ డైరెక్టరేట్‌కు చేరారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై విచారణ లేదు. ఏం జరిగిందో ఆరా తీసిన ఉదంతం కూడా లేదు. గనుల శాఖ అధికారులు ఆయనకు పిలిచి మరీ పెద్దపీట వేశారు. పెద్దిరెడ్డికి ఓఎస్డీగా పనిచేసిన అధికారి అంటే అధికారులకు ఎంత ప్రేమో? త్వరలో ఆయన రిటైర్ కాబోతున్నారు. ఎలాంటి విచారణ ఎదుర్కోకుండానే పదవీ విరమణ చేసేలా అధికారులు ఆయనకు సహకరిస్తున్నారు.

నిజాలకు పాతర!

గనుల అక్రమాలపై సర్కారు విడుదల చేసిన శ్వేతపత్రంలో బొగ్గు, బీచ్‌శాండ్ టెండర్లలో జరిగిన గోల్‌మాల్ గురించి ప్రస్తావించలేదు. ఇందుకు కారణం రామన్‌నారాయణన్ అని తెలుస్తోంది. ఆ అంశాలను చేర్చాలంటే ముందుగా ఈయన డేటా ఇవ్వాలి. బొగ్గు టెండర్లలో ఎలాంటి మోసం జరిగింది? అదానీకే టెండర్ దక్కేలా ఎలాంటి కుట్రలు చేశారు? ఇందులో ఎవ రి పాత్ర ఏమిటో వివరించాల్సి వస్తుంది. అప్పుడు ఆయన కేంద్ర బిందువుగా మారుతారు. అది ఇష్టంలేకే ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. నిజానికి ఒక్క బొగ్గు అమ్మకంలోనే ఎండీసీకి 10వేలకోట్ల పైనే నష్టం జరిగిందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. బెరైటీస్ విషయంలో మంత్రి కొల్లు రవీంద్రను కూడా తప్పుదోవ పట్టించేలా నివేదికలు ఇప్పించారని ఫిర్యాదులు ఉన్నాయి. 2016-24 కాలంలో బెరైటీస్ టెండర్ అనేక కంపెనీలకు దక్కింది. కానీ కేవలం ఒక కంపెనీకే 75 లక్షల టన్నుల బెరైటీస్ వెళ్లినట్టుగా మంత్రితో సభలో సమాధానం చెప్పించినట్లు తెలిసింది. నిజానికి ఎండీసీ చరిత్రలోనే 75 లక్షల టన్నుల బెరైటీస్‌ను ఒక కంపెనీకి అమ్మలేదు. మహా అయితే ఐదారు లక్షల టన్నులు అమ్మి ఉంటారు. అలాంటిది మంత్రితో సభలో ఈ విధంగా చెప్పించడం చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా కొణిజేడు-మర్లపాడులో ఐరన్ ఓర్ టెండర్లు పిలిచారు. అది జేఎస్‌డబ్ల్యూ కంపెనీకే దక్కేలా మంత్రాంగం నడిపారు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం వచ్చి ఆ టెండర్‌ను రద్దు చేయాలనుకుంటే సంస్థపై తీవ్రమైన ఆర్థిక భారం పడేలా టెండర్ క్లాజులు చేర్చినట్లు బయటకొచ్చింది. ఒప్పందానికి విరుద్ధంగా ఐరన్ ఓర్ టెండర్‌ను రద్దు చేస్తే, సర్కారే ఆ కంపెనీకి 120శాతం అదనపు పరిహారం చెల్లించే క్లాజును తీసుకొచ్చారని వెలుగుచూసింది. అంటే.. జగన్ సర్కారు నాటి టెండర్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసే సాహసం చేయకుండా ఈ కుట్రలకు పాల్పడ్డారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా వైస్ ప్రెసిడెంట్‌ల పనితీరు, వారివల్ల జరిగిన మేలు, నష్టంపై అంచనా వేసే పరిస్థితి కనిపించడం లేదు. వారు లేకపోతే కంపెనీనే లేదన్నట్లుగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు.

జగన్ వీరభక్త రామా.. ఇదేంపని?

జగన్ ప్రభుత్వంలో గనుల శాఖను వైసీపీ అస్మదీయులు, కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు పునరావాస కేంద్రంగా మార్చారు. అడ్డగోలు నిబంధనలతో టెండరు తయారు చేసి అదానీకి కట్టబెట్టారు. బీచ్‌శాండ్‌ను వారికే వెళ్లేలా ప్రయత్నిస్తే హైకోర్టు అడ్డుకుంది. ఇసుక, బెరైటీస్, ఇతర ఖనిజాల వేలం, సీనరేజీ వసూళ్ల టెండర్లలో జరగని అక్రమాలు లేవు. ఇవన్నీ ఓ ప్రణాళిక ప్రకారం జరిగేలా జగన్, వెంకటరెడ్డి సొంత టీమ్‌ను పెట్టుకున్నారు. ఏపీఎండీసీలో డైరెక్టర్ తర్వాత అత్యంత కీలకమైన పోస్టు వైస్ ప్రెసిడెంట్. ఈ విభాగంలో రెండు పోస్టులు సృష్టించారు. అదానీ, ట్రైమెక్స్‌లో పనిచేసిన రామన్‌నారాయణన్ అనే వ్యక్తిని ఓ పోస్టులో నియమించారు. ఆయనకు బొగ్గు, బీచ్‌శాండ్ సబ్జెక్టులు ఇచ్చారు. 3.5లక్షల జీతం, ఇతర అలవెన్సులు కల్పించారు. ప్రతిఫలంగా జగన్, వెంకటరెడ్డి చెప్పిన కీలకమైన పనులు ఆయన చేసిపెట్టారు. బొగ్గు అమ్మకం టెండర్లలో సెక్యూరిటీ డిపాజిట్‌కు బదులు పెర్ఫార్మెన్స్ డిపాజిట్ విధానం నిబంధన తీసుకొచ్చారు. ఫలితంగా ఎండీసీనే వడ్డీతో సహా అదానీకి సొమ్ము చెల్లించింది. బీచ్‌శాండ్ టెండర్లు అదానీకి కట్టబెట్టే ప్రయత్నం చేశారు. 89శాతం అదానీకి, 11 శాతం ఎండీసీకి ఆదాయం వచ్చేలా టెండర్ డాక్యుమెంట్ తయారు చేశారు. హైకోర్టు జోక్యంతో ఆ టెండర్ నిలిచిపోయింది. బెరైటీస్ సరఫరా విషయంలో ఆ సంస్థతో ఎండీసీ కుదుర్చుకున్న ఒప్పందం ముగిసిన తర్వాత కూడా సరుకు సరఫరా చేశారు. తాము పాత రేటునే చెల్లిస్తామని ఆ కంపెనీ చెప్పింది. అప్పుడు ఆయన ఏం చేయాలి? ఆ సంస్థ నుంచి కొత్త ఒప్పందం ప్రకారం, కొత్త ధర వసూలు చేయాలి. మాట వినకుంటే బ్యాంక్ గ్యారెంటీలు, రవాణా పర్మిట్లు నిలిపివేయాలి. అలా చేయకుండా కేసును ఆర్బిట్రేషన్‌కు సిఫారసు చేశారు. అది ఇప్పటి వరకు పరిష్కారం కాలేదు.

ఆర్థిక వ్యవస్థ ఆయన చేతుల్లోనే


ఎండీసీలో ఫైనాన్స్ విభాగానికి జనరల్ మేనేజర్‌గా నాగేశ్వరరెడ్డి ఉన్నారు. ఆయన సోదరుడు ధర్మారెడ్డి టీటీడీ ఈఓగా ఉన్న సమయంలో ఈయన డిప్యుటేషన్‌పై వచ్చారు. స్థాయికి మించిన పోస్టు దక్కించుకున్నారు. ఇసుక, బెరైటీస్, సర్వే రాళ్ల కొనుగోళ్లలో బిల్లుల చెల్లింపు వ్యవహారంలో ఆయనతో పాటు ఆర్థిక విభాగంలో పనిచేసిన నలుగురిపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశించలేదు. ఇంకా నాగేశ్వరరెడ్డి జీఎంగా కొనసాగుతున్నారు.

లోకం తీరు



శ్రీశైలానికి భారీగా వరద

- మరో మూడు రోజుల్లో గేట్లెత్తే చాన్స్



సుంకేశుల నుంచి శ్రీశైలం వైపు తుంగభద్ర జలాలు

కర్నూలు/శ్రీశైలం(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి శ్రీశైల జలాశయానికి భారీగా వరద ప్రవహిస్తోంది. శనివారం జూరాల నుంచి 3,12,544 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 99,736 క్యూసెక్కులు మొత్తం 4,12,280 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి 2,97,886 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైల జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 866.40 అడుగులకు చేరింది. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 127.5950 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 18,480 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులు ఉప్పొంగుతున్నాయి. తుంగభద్ర డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1,633 అడుగులకుగాను ప్రస్తుతం 1,631.68 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 100.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మొత్తం 33 గేట్లు ఎత్తి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలోకి రోజుకు సగటున 30 టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. వరద ఇలాగే కొనసాగితే మరో మూడు రోజుల్లో శ్రీశైలం గేట్లు ఎత్తే అవకాశం ఉందని డ్యాం ఇంజనీర్లు చెబుతున్నారు.

శ్వేత పత్రమా.. సాకు పత్రమా!

- హైదరాబాద్‌లో బుగ్గన ప్రెస్‌మీట్



మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రవేశపెట్టిన శ్వేతపత్రంపై వైసీపీ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి హైదరాబాద్‌లో స్పందించారు. శనివారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టింది శ్వేత పత్రమా? సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని చెప్పే సాకు పత్రమా? చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తారని ప్రజలు ఎన్నుకుంటే మొదటి ఓవర్లోనే డకౌట్ అయ్యారని విమర్శించారు. వైట్ పేపర్ ఇచ్చి పథకాలు అమలు చేయలేమని చేతులు దులుపుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసిందంటూ గవర్నర్‌తోనూ అబద్ధం చెప్పించారన్న బుగ్గన... అప్పులపై ఒక్కో మంత్రి ఒక్కోలా మాట్లాడుతున్నారని అన్నారు. ఏపీలో సమావేశం పెట్టకుండా హైదరాబాద్‌లో ఎందుకు పెట్టారని ఓ విలేకరు అడిగిన ప్రశ్నకు... 'ఆస్పత్రికి కోసం వచ్చాం. విజయవాడకు వెళ్లి పెట్టేందుకు ఆలస్యమవుతుందనే కారణంగా ఇక్కడ సమావేశం పెట్టాను' అని బుగ్గన వివరణ ఇచ్చారు.

చంద్రబాబును మందలించండి

- బడ్జెట్‌లో అప్పులపై వక్రీకరణ
- గవర్నర్ నజీర్‌కు వైసీపీ అధ్యక్షుడు జగన్ లేఖ



అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు ప్రకటించిన శ్వేతపత్రం అబద్ధాలమయమని, అదో తప్పుడు పత్రమని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విమర్శించారు. తన జమానాలో అప్పులు రూ.7.48 లక్షల కోట్లేనని, కానీ 14 లక్షల కోట్లంటూ చంద్రబాబు ప్రచారం చేశారని, గవర్నర్ ప్రసంగంలో రూ.10లక్షల కోట్లంటూ పేర్కొన్నారని తెలిపారు. ఈ మేరకు శనివారం గవర్నర్ నజీర్‌కు లేఖ రాశారు. అసెంబ్లీ ప్రసంగంలో గవర్నర్‌తో అబద్ధాలు ధర్మమేనా? అంటూ.... అబద్ధాలు చెప్పించిన చంద్రబాబును మందలించాలని లేఖలో కోరారు. 2019 మేలో తాను అధికారంలోనికి వచ్చేనాటికి ఖజానాలో రూ.100 కోట్లే ఉన్నాయని, అయినా రూ.2.27 లక్షల కోట్లతో 2019-20 పూర్తి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టానని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారపగ్గాలు చేపట్టేనాటికి ఖజానాలో ఏడెనిమిది వేల కోట్ల రూపాయలు ఉన్నా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఏమిటని జగన్ సందేహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడితే గత ప్రభుత్వం చేసిన అప్పులపై వాస్తవాలు భయటపడతాయని చంద్రబాబు భయపడుతున్నారని పేర్కొన్నారు. ఏ నెలలో ఏ పథకం అమలు చేస్తామో క్యాలెండర్‌ను విడుదల చేస్తూ అర్హులందరికీ పథకాలు అందించామని తెలిపారు. ధర్మం వైపు నిలబడాలని గవర్నర్ నజీర్‌కు తన లేఖలో జగన్ కోరారు.

జనం ఛీకొట్టినా.. జగన్ అవే అబద్ధాలు

- ఖజానాలో 7 వేలకోట్లు వదిలి వెళ్లారట
- జూన్ 4వ తేదీ నాటికి ఖజానా నిల్
- పైగా రిజర్వ్ బ్యాంకుకు 4,200 కోట్లు బాకీ
- అదేరోజు ఆర్బీఐ నుంచి 4,000 కోట్ల అప్పు
- ఇవన్నీ మర్చిపోయి అసత్య ప్రచారాలు

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా జగన్ అబద్ధాలు చెప్పడం మానలేదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్షంపై విషం చిమ్ముతూ, లేనిపోని గొప్పలు చెప్పుకొన్నారు. అనుకూల మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేయించారు. ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా ఆయనలో మార్పు రాలేదు. శుక్రవారం ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఓ అబద్ధాన్ని జనాల్లోకి వదిలారు. తాను గద్దె దిగేనాటికి అంటే జూన్ 4వ తేదీన రాష్ట్ర ఖజానాలో రూ.7,000 కోట్లు వదిలిపెట్టి వెళ్లానంటూ జగన్ చెప్పారు. ఇది శుద్ధ అబద్ధం. జూన్ 4వ తేదీన ప్రభుత్వ ఖజానాలో చిల్లిగవ్వ లేదు. అయితే తాను ఖజానాలో రూ.7,000 కోట్లు వదిలిపెట్టి వెళ్లినప్పటికీ సీఎం చంద్రబాబు బడ్జెట్ పెట్టే ధైర్యం చేయడం లేదంటూ జగన్ విమర్శించారు. వాస్తవానికి జూన్ 4వ తేదీ నాటికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్‌కు రూ.4,200 కోట్లు బాకీ ఉంది. ఇందులో రూ.3,200 కోట్లు ఎస్‌డీఎఫ్, వేజ్ అండ్ మీన్స్ అప్పు కాగా, రూ.1000 కోట్లు ఓడీ అప్పు. జీతాలు, పెన్షన్లు, సామాజిక పెన్షన్ల కోసం అప్పు తీసుకున్నారు. జూన్ 4వ తేదీ జగన్‌కు అప్పుల వారమైన మంగళవారం రిజర్వ్ బ్యాంక్ నుంచి రూ.4,000 కోట్ల అప్పు తెచ్చారు. వీటితో ఆర్బీఐ నుంచి వాడుకున్న రూ.4,200 కోట్ల అప్పును జమ చేసి మళ్లీ అప్పులు తెచ్చారు. వాటితో మిగతా జీతాలు, పెన్షన్లు, వైసీపీ కోసం, జగన్ కోసం వాదించుకున్న లాయర్లకు బిల్లులు చెల్లించుకున్నారు. 2019లో చంద్రబాబు గద్దె దిగేనాటికి ఖజానా అప్పుల్లో లేకపోగా రూ.100 కోట్ల డబ్బు నిల్వ ఉంది. అయినా.. తాము రూ.2.27 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టామని జగన్ గొప్పగా చెప్పుకొన్నారు. సమర్థ ఆర్థిక నిర్వహణకు బడ్జెట్ కాదు, ఖర్చులే కొలమానం. ఎక్కడ, ఎందుకు, దేనికోసం ఎంత ఖర్చు చేశారనేదే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇందులో జగన్ జీరో. బడ్జెట్ పెట్టిన మరుసటి రోజు నుంచి గత ఐదేళ్లూ అదనపు నిధులంటూ వందల కొద్దీ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్దకు క్యూ కట్టేవి. వాటిని ఓకే చేసేది జగన్ ప్రభుత్వం. అలాంటప్పుడు బడ్జెట్ ప్రవేశపెట్టి ఏం లాభం. రాష్ట్రానికి తిరిగి పైసా ఆదాయం కూడా సమకూర్చలేని విభాగాల్లో మాత్రమే జగన్ గత ఐదేళ్లు ఖర్చులు చేశారు. ఆ అడ్డగోలు ఖర్చుల ఫలితమే రాష్ట్రం ఆర్థికంగా, అభివృద్ధి పరంగా 30 ఏళ్లు వెనక్కెళ్లిపోయింది.

విధ్వంసాన్ని చక్కదిద్దేందుకు...

గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి అన్ని మార్గాల్లో వచ్చిన ఆదాయం రూ.1.74 లక్షల కోట్లు. ఇంకో రూ.70,000 కోట్లు అప్పులు తెచ్చుకునే వెసులుబాటు కూడా ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.2.27 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టవచ్చు. అయినప్పటికీ గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని చక్కదిద్దడం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. సరైన రంగాల్లో, సరైన విధంగా ఖర్చులు చేయడమే దానికి పరిష్కారం.

ఉగ్ర గోదారి!



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

- అధికారుల అంచనాలకు అందని వరద
- భద్రాచలం వద్ద మూడో హెచ్చరిక జారీ
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- సముద్రంలోకి 13 లక్షల క్యూసెక్కుల నీరు
- వణుకుతున్న లంక గ్రామాల ప్రజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. అధికారుల అంచనాలకు కూడా అందని విధంగా నదిలో ప్రవాహం పెరుగుతోంది. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రం మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇది మరింత పెరుగుతుందనే అంచనాతో అధికారులు ఉన్నారు. సాయంత్రం 5గంటలకు భద్రాచలం వద్ద 53.30 అడుగుల నీటిమట్టం ఉంది. ఇక ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 6 గంటలకు నీటిమట్టం 14 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి 13,14,870 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద వరద పెరగడంతో పోలవరం ఎగువ భాగంలోని విలీన మండలాలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. ఇప్పటికే రాజమహేంద్రవరం లంకలు నీట మునిగాయి. గోదావరి పాయలు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనూ లంకలను ముంచెత్తుతూ పరుగులు తీస్తున్నాయి. కాజ్‌వేల మీదకు వరద నీరు చేరి, లంక గ్రామాల మధ్య రాకపోకలు కూడా నిలిచిపోయాయి. సుమారు 10 రోజులుగా వరద కష్టాలు వీడటం లేదు. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరికి వరద ఉధృతి మరింత పెరుగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కేంద్ర జలసంఘం అంచనా ప్రకారం మరో మూడు రోజులు వరద ప్రవాహం కొనసాగి, తర్వాత తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. వరద మరింత పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి వరద పెరగడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 12 మండలాల పరిధిలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. జిల్లాలోని గౌతమి, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు శనివారం సాయంత్రం నుంచి వర్షపు జల్లులు కురుస్తుండడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం 24.027 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి వస్తున్న 11,87,497 క్యూసెక్కుల నీటిని 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన మార్గంలోని కడెమ్మ వంతెనపై రెండడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడికాల్వకు 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు తెలిపారు.

ఉధృతంగా శబరి ..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో గోదావరి, శబరి, సీలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 42 అడుగులకు చేరింది. సీలేరు జల విద్యుత్ కేంద్రానికి చెందిన డొంకరాయి రిజర్వాయరు నుంచి నాలుగు గేట్ల ద్వారా 13,124 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో వరద గంటగంటకూ పెరుగుతోంది. ముంపు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 30వ నెంబరు, 326వ నెంబరు జాతీయ రహదారులపై వరద నీరు భారీగా చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. 525 గ్రామాలు ప్రభావితమయ్యాయని, మరో 230 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. 43,234 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 2,728 హెక్టార్ల లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. 21వేల మందిని 82 పునరావాస కేంద్రాలకు తరలించినట్టు తెలిపారు.

మీ కపట నాటకానికి మా సంఘీభావమా..!

- సిద్ధమన్నారుగా... 11 మంది బలం సరిపోలేదా?
- వైఎస్ జగన్‌ను నిలదీసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్... మీ ధర్నాకు కాంగ్రెస్ పార్టీ ఎందుకు సంఘీభావం ప్రకటించాలి? సిద్ధం అన్నవాళ్లకు 11 మంది బలం సరిపోలేదా... ఇప్పుడు కలసి పోరాడుదాం అంటున్నారు?' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. 'ఢిల్లీలో నా ధర్నాకు ఎందుకు రాలేదో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కష్టాల్లో ఉంటే షర్మిల అడ్డుపడుతారు' అంటూ ఎక్స్ వేదికగా జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆమె శనివారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'అసలు మీకు సంఘీభావం ఎందుకు ప్రకటించాలి? మీ పార్టీ ఉనికి కోసం కపట నాటకం ఆడినందుకా? వ్యక్తిగత హత్యకు రాజకీయ రంగు పులిమినందుకా? మీ నిరసనలో నిజం లేదని, స్వలాభం తప్ప రాష్ట్రానికి ప్రయోజనం శూన్యమని తెలిసే కాంగ్రెస్ పార్టీ దూరంగా ఉంది. ఐదేళ్ల బీజేపీతో అక్రమ సంబంధం పెట్టుకుని, విభజన హక్కులను, ప్రత్యేక హోదాను ఆ పార్టీకి తాకట్టుపెట్టారు. ఆఖరుకు మణిపూర్ ఘటనపై నోరెత్తని మీకు... ఉన్నట్లుండి అక్కడి పరిస్థితులు గుర్తుకు రావడం విడ్డూరం. క్రిస్టియన్ అయికూడా క్రైస్తవులను ఊచకోతకు గురిచేసినా నోరు మెదపకుండా విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానంలో బీజేపీకి మద్దతు ఇచ్చారు కదా? వైఎస్ఆర్ వ్యతిరేకించిన మతతత్వ బీజేపీకి జై కొట్టారు కదా? మణిపూర్ ఘటనపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం చేస్తుంటే మీనుంచి సంఘీభావం వచ్చిందా?' అంటూ షర్మిల నిలదీశారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా బీజేపీతో అక్రమ సంబంధం ఎందుకు కొనసాగించారో, ప్రత్యేక హోదా, పోలవరం కోసం ధర్నాలు ఎందుకు చెయ్యలేదో, పూర్తి మద్యపాన నిషేధం, వైఎస్ఆర్ జలయజ్ఞం ఎందుకు చేయలేదో ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. చెప్ప లేకపోతే ముక్కు నేలకు రాసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వైసీపీ తరహాలో వ్యవహరించబోమన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదాను కూడా ఊడబీకితే, దానికోసం కోర్టు గుమ్మాలు తట్టే బ్యాచ్ వైసీపీ అని ఎద్దేవా చేశారు.జగన్‌లా వెన్నుపోటు రాజకీయాలు చేయబోమన్నారు.

వరద బాధితులకు అందిన సాయం

- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మంత్రుల పర్యటన
- బాధితులకు నగదు, సరుకులు అందజేసిన అచ్చెన్న తదితరులు



బాధితులకు సాయం అందిస్తున్న మంత్రులు అచ్చెన్న, నిమ్మల, కొలుసు, అనిత

కుక్కునూరు, జూలై 27: వరద బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, పార్థసారథి భరోసా ఇచ్చారు. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్‌లతో కలిసి మంత్రులు పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడారు. అన్ని సౌకర్యాలూ అందుతున్నాయా? అని ప్రశ్నించారు. అధికారులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు వ్యక్తిగత పరిహారం, పునరావాస పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు తరలించడానికి ప్రభుత్వం ప్రణాళిక చేసిందన్నారు. బాధిత ప్రతి కుటుంబానికి రూ.మూడు వేలు, బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్నామన్నారు.

మళ్లీ టెండర్లా.. నామినేషన్‌పైనా?

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణ బాధ్యతెవరికి?
అనుభవం లేని 'మేఘా'కు అప్పగిస్తారా?
తిరిగి జర్మన్ బావర్‌నే తీసుకొస్తారా?

- రేపు సీఎం సమీక్షలో స్పష్టత వచ్చే చాన్సు!
- నిపుణుల నివేదిక 5న అందే అవకాశం

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో దెబ్బతిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్త వాల్ నిర్మాణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. మళ్లీ టెండర్లు పిలుస్తారా.. ప్రధాన కాంట్రాక్టు సంస్థ మేఘా ఇంజనీరింగ్‌కే నామినేషన్ విధానంలో అప్పగిస్తారా అనే సందేహాలు నెలకొన్నాయి. రూ.990 కోట్లతో కొత్త వాల్ నిర్మించాలని కేంద్ర జలసంఘం సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దెబ్బతిన్న వాల్‌కు మరమ్మతు చేయడం కంటే కొత్తది కట్టడమే ఉత్తమమని జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా ఇప్పటికే స్పష్టం చేశారు. ప్రాజెక్టులో దెబ్బతిన్న డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల్లో సీపేజీలను అధ్యయనం చేసేందుకు వచ్చిన అమెరికా, కెనడా నిపుణులతోనూ ఇదే చెప్పారు. వారు ఈ నెలాఖరులోపు ప్రాథమిక నివేదిక ఇవ్వాల్సి ఉంది. అయితే ఇద్దరు అమెరికాలో, ఇంకో ఇద్దరు కెనడాలో ఉంటుండంతో ఆన్‌లైన్‌లో ఒకే సమయంలో కాన్ఫరెన్సు నిర్వహించేందుకు వీలు కావడంలేదని రాష్ట్ర జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. వచ్చేనెల 5న ప్రాథమిక నివేదికను అందజేస్తారని జల సంఘానికి సమాచారం అందినట్లు తెలిపాయి. ఈ నివేదికలో ప్రధానంగా కాఫర్ డ్యాంల సీపేజీ నివారణకు, కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణంలో అనుసరించాల్సిన సాంకేతిక పరిజ్ఞానం, పాత వాల్‌కు ఎంత దూరంలో నిర్మించాలో స్పష్టత ఇస్తారని పేర్కొన్నాయి. గతంలో డయాఫ్రం వాల్‌ను నిర్మించినప్పుడు.. అప్పటి పోలవరం నిర్మాణ సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ తమకు అనుభవం లేదని తెలిపింది. దీంతో ఈ వాల్ నిర్మాణంలో అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన జర్మనీకి చెందిన 'బావర్' సంస్థను ఎంపిక చేసి.. దానితో ప్రత్యేకంగా ఒప్పందం చేసుకుంది. ఒప్పందం మేరకు ఏడాదిన్నర కాలంలోనే బావర్ ఈ వాల్‌ను రూ.460 కోట్లతో నిర్మించింది. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరిగాయని కేంద్ర జల సంఘం, ఇతర సంస్థలు సర్టిఫికెట్ ఇచ్చాయి. 2020లో 23 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా.. వాల్ పూర్తిగా దెబ్బతినకుండా నిలిచింది. వాస్తవానికి ఇప్పటి వాల్‌కు అక్కడక్కడా కొన్ని మరమ్మతులు చేస్తే సరిపోతుందని అంతర్జాతీయ నిపుణులు స్పష్టం చేశారు. వోహ్రా మాత్రం అనవసరంగా రిస్క్ తీసుకోవడం కంటే కొత్తది నిర్మించడమే శ్రేయస్కరమని అన్నారు. దీంతో కేంద్ర జలశక్తి శాఖ కూడా కొత్త వాల్ నిర్మాణానికే మొగ్గు చూపుతోంది.

ఈ నేపథ్యంలో దీని నిర్మాణం, డిజైన్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను.. ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ, వోహ్రాలను రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనలో కోరారు. అలాగే దీనికి కొత్తగా టెండర్లు పిలవాలా.. లేక అనుభవం లేని మేఘాకే నామినేషన్‌పై అప్పగించాలా అనే విషయంలోనూ స్పష్టత కోరారు. ఇప్పటివరకు అటు నుంచి స్పందన లేదు. సోమవారం (29న) ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరంపై సమీక్ష జరుపనున్నారు. ఆ సందర్భంగా స్పష్టత వచ్చే వీలుందని అంటున్నారు.

29న ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కౌన్సెలింగ్

పెదకాకాని, జూలై 27: గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సెల్ఫ్ సపోర్టు కేటగిరిలో ఎంబీఏ జనరల్, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 29న కౌన్సెలింగ్ జరుగుతుందని అడ్మిషన్ల డైరెక్టర్ అనిత శనివారం తెలిపారు. యూనివర్సిటీ నిర్వహించిన ఐసెట్‌లో ర్యాంకులు సాధించిన వారికి ఎంబీఏలో 10, ఎంసీఏలో 10 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే సమాచారం పొందిన వారు కౌన్సెలింగ్ తేదీన ఉదయం 9.30 గంటలకల్లా వర్సిటీలోని పీజీ ప్రవేశాల కార్యాలయానికి ఒరిజినల్ టీసీ, ప్రొవిజినల్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలను వెంట తీసుకురావాలన్నారు.

టీటీడీ అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి బాధ్యతల స్వీకారం


శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న వెంకయ్య చౌదరి

తిరుమల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా జేఈవో వీరబ్రహ్మం శ్రీవారి జ్ఞాపిక అందజేశారు. అనంతరం వెంకయ్య చౌదరి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ..శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు సౌకర్యాలను ఇంకా మెరుగుపరుస్తామని తెలిపారు. దర్శనం, వసతి, పరిశుభ్రత, అన్నప్రసాదాల పంపిణీ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రతి విభాగంపై సమీక్షలు నిర్వహించి గుర్తించిన లోటుపాట్లను సవరిస్తామన్నారు. దేవుని సన్నిధిలో పని చేసే అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శింగరకొండలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



అద్దంకి, జూలై 27 : హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే.శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమూర్తికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వచనం చేశారు.


సదస్సులో మాట్లాడుతున్న కృష్ణబాబు

వచ్చే నెల నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్

- వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ రెండో వార్షిక సదస్సును శనివారం విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలో నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి, వైద్యం అందించడం కీలకమన్నారు. ఆగస్టు నుంచి రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నామని, ఇంటింటికీ వెళ్లి ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ నిర్వహించనున్నారన్నారు. తద్వారా సకాలంలో వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని 16 మెడికల్ కాలేజీల్లో అంకాలజీ విభాగాలను ఏర్పాటుచేశామని, వాటిని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.

టెట్ దరఖాస్తులకు ఆఖరు తేదీ ఆగస్టు 3

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 3లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు సూచించారు. ఇక గడువు పొడిగింపు జరగదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 2న టెట్ నోటిఫికేషన్ వెలువడగా, ఇంతవరకు 3,20,333 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. అక్టోబరు 3 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

ట్రిపుల్ ఐటీల్లో తొలివిడత 3,396 మందికి అడ్మిషన్లు

వేంపల్లె, జూలై 27: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ శనివారంతో ముగిసిందని కన్వీనర్ అమరేంద్రకుమార్ సండ్ర తెలిపారు. 4,140మంది విద్యార్థులకు నాలుగు ట్రిపుల్ ఐటీల నుంచి కాల్‌లెటర్లు పంపగా 3,396మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. 744సీట్లు మిగిలాయి. ఆగస్టు మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జగన్ ధ్వంస రచన.. అబద్ధాలే ఆలంబన!

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఎత్తుగడలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. సంప్రదాయ రాజకీయాలకు అలవాటు పడినవారు అతడిని అర్థం చేసుకోవడం కష్టం. ఇటీవలిదాకా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆపసోపాలు పడటం చూశాం. 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అప్పట్లో జగన్‌రెడ్డిని తేలికగా తీసుకోవడంతో 2019 ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డారు. అబద్ధాలే పునాదిగా జగన్ రాజకీయాలు ఉంటాయి. ఇప్పుడు తాజా ఎన్నికల్లో తమకు అపూర్వ విజయం దక్కడంతో జగన్మోహన్‌రెడ్డి పనైపోయిందని చంద్రబాబు అండ్ కో సంబరపడినంత సేపు పట్టలేదు... అతగాడు తనలోని మరో కోణం ప్రదర్శించడం మొదలుపెట్టారు. ఎన్నికల ఫలితాలు చూశాక తనకు హిమాలయాలకు వెళ్లిపోవాలనిపించిందని జగన్ వ్యాఖ్యానించడంతో నిజమే కాబోలు

> జగన్‌రెడ్డి ఇండియా కూటమిలో చేరబోతున్నారా? అన్న చర్చలో వాస్తవం నేతి బీరకాయలోని నెయ్యి చందంగా ఉంటుంది. జగన్‌రెడ్డి అనే వ్యక్తి పులి కాదు పిల్లి అని అనేక సందర్భాలలో రుజువైంది. గతంలో బెయిలు కోసం సోనియాగాంధీ వద్ద సాగిలపడిన విషయం మరచిపోవద్దు. ఇప్పుడు ప్రధాని మోదీని ధిక్కరించిన బలమైన నాయకులకు కూడా ఏ గతి పట్టిందో తెలిసి కూడా జగన్‌రెడ్డి వంటి వారు మోదీని ధిక్కరించే సాహసం చేస్తారని అనుకోలేం. సీబీఐ, ఈడీ కేసులలో విచారణ వేగవంతమైతే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? మరోవైపు రాష్ట్రంలో అధికారం వెలగబెట్టినప్పుడు చేసిన అరాచకాలు, అవినీతిపై కేసులు కట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించే సాహసం జగన్‌రెడ్డి చేసే అవకాశం లేదు. ఆయనకు ప్రస్తుతం కేసుల నుంచి రక్షణ కావాలి. లేని పక్షంలో రాష్ట్రంలో రాజకీయంగా ఊపిరి పోసుకొనే విషయం అటుంచితే అతడి రాజకీయ జీవితమే కొడిగట్టే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన రాజకీయ విన్యాసాలను అర్థం చేసుకోవాలి.

అని నమ్మారు. 'తాజా ఫలితాలు చూశాక జగన్‌రెడ్డి కోలుకుంటారని అనుకుంటున్నారా?' అని తెలుగుదేశం ముఖ్యుడొకరు ప్రశ్నించగా, 'చూస్తూ ఉండండి. మీకే తెలుస్తుంది' అని నేను బదులిచ్చాను. 2014 ఎన్నికల తర్వాత తానే ముఖ్యమంత్రినని బలంగా నమ్మిన జగన్‌రెడ్డి, ఆ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా బెదరలేదు. అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అప్పట్లో అతడిని అర్థం చేసుకోలేకపోయిన చంద్రబాబు అండ్ కో తేలికగా తీసుకున్నారు. ఆ తర్వాత గానీ జగన్మోహన్‌రెడ్డి అనే రాజకీయ భూతం తమనే కాదు... రాష్ట్రాన్ని కూడా వెంటాడుతూనే ఉంటుందని ఊహించలేకపోయారు.

నెలనాళ్లకే నానాయాగీ

చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందో లేదో... రాష్ట్రంలో అరాచకం ప్రబలిందని, రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెట్టడం జగన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెల రోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం కావొచ్చు. ఇదే జగన్‌రెడ్డి ప్రత్యేకత! క్రిమినాలజీలో ఆరితేరిన జగన్‌రెడ్డి రాజకీయాలు విలక్షణంగానే ఉంటాయి. గతంలో ఫ్యాక్షనిస్టులు తమ ప్రత్యర్థులకు స్పాట్ పెట్టాలనుకున్నప్పుడు ఎలిబీ కోసం ఏదో ఒక ఆస్పత్రిలో చికిత్స పేరిట చేరిపోయేవారు. ఆ తర్వాత ఎవరో ఒకరు హత్యకు గురయ్యేవారు. ఇప్పుడు ఈ ఆధునిక పాలెగాడైన జగన్మోహన్‌రెడ్డి తనపై గతంలోనే నమోదైన కేసులతో పాటు ఇకపై నమోదయ్యే కేసుల నుంచి రక్షణ కోసం ఢిల్లీ స్థాయిలో ధర్నా పేరిట స్కెచ్ వేసుకున్నారు. ఈ నేపథ్యంలో అతగాడు అలవోకగా అబద్ధాలు ప్రచారం చేస్తుంటారు. 30 మంది కమ్మ సామాజిక వర్గానికి చెందిన సీఐలకు డీఎస్పీలుగా ప్రమోషన్ ఇచ్చి కుల పక్షపాతానికి పాల్పడ్డారని గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రచారం చేశారు. సదరు అబద్ధం ప్రజల్లోకి బలంగా వెళ్లడంతో 2019 ఎన్నికలు కమ్మ వ్యతిరేకత ప్రాతిపదికన జరిగాయి. ఇప్పుడు ఢిల్లీ వేదికగా నెల రోజుల చంద్రబాబు పాలనలో 36 మంది హత్యకు గురయ్యారని జగన్ అలవోకగా అబద్ధాలు చెప్పారు. క్షేత్ర స్థాయి వాస్తవాలు తెలియని ఢిల్లీ రాజకీయ నేతలు గానీ, మీడియా ప్రతినిధులు గానీ ఇందులో నిజానిజాల గురించి తెలుసుకొనే ప్రయత్నం చేయరు కదా! జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్నవారు ఇలాంటి అబద్ధాలు చెప్పకపోయినా నోరు విప్పితే చాలు... కేసులు పెట్టడం చూశాం. నిజాలు ప్రచురించిన పత్రికలపై సీఐడీ ద్వారా కేసులు పెట్టించారు. ఇప్పుడు నెల రోజుల్లో 36 మంది హత్యకు గురయ్యారని, వందల మందిపై హత్యాయత్నం జరిగిందని జగన్‌రెడ్డి అదురూ బెదురూ లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు అండ్ కో... శుక్రవారం శాసనసభలో బదులిస్తూ, అదే నిజమైతే ఎఫ్ఐఆర్‌లు బయటపెట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ హత్యలు మాత్రమే కాదు, వ్యక్తిగత కక్షలతో కూడిన హత్యలను కూడా కలుపుకొన్నా 36 హత్యలే జరగలేదు. అలాంటప్పుడు జగన్‌రెడ్డి వేసిన బాటలో చంద్రబాబు ప్రభుత్వం కూడా కేసులు పెట్టవచ్చు కదా? చంద్రబాబులో అంత తెంపరితనం ఉండదన్న నమ్మకం జగన్‌రెడ్డిలో ఉన్నట్టుంది. అందుకే వినుకొండలో ఇద్దరు రౌడీల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారితీయగా... దాన్ని బూచిగా చూపి ఢిల్లీ వరకు వెళ్లారు.

శవం... రాజకీయం...

జగన్‌రెడ్డి రాజకీయాలకు అబద్ధాలు ఒక్కటే ఆలంబన కాదు, శవాలు కూడా కావాలి. 2019 ఎన్నికలకు ముందు జరిగిన వైఎస్ వివేకానంద రెడ్డి హత్యను రాజకీయ ప్రయోజనాల కోసం గరిష్ఠంగా వాడుకున్నారు. నేరాలు, హత్యలు చేసిన తన వాళ్లను మంచివాళ్లుగా చెప్పుకోవడం ఆయనకు అలవాటు. వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూడా మంచివాడుగానే కితాబు ఇస్తూ వచ్చారు. తనకు గానీ, తన వాళ్లకు గానీ ప్రమేయం ఉన్న సందర్భాలలో అదెలా జరిగిందో దేవుడికే ఎరుక అని చెప్పి తప్పించుకోవడం కూడా జగన్‌రెడ్డికి అలవాటే. వివేకానంద రెడ్డి హత్య జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పాత్ర అందులో ఉందని ప్రచారం చేసిన జగన్‌రెడ్డి... తాను ముఖ్యమంత్రి అయ్యాక హత్య చేసింది ఎవరో దేవుడికే తెలియాలని సింపుల్‌గా తేల్చేశారు. తాజా ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత కూడా ఓటమికి కారణం దేవుడికే తెలియాలని తేల్చిపారేశారు. నిన్నగాక మొన్న మదనపల్లెలో సబ్ కలెక్టర్ కార్యాలయం దహనం కేసులో కూడా అదెలా జరిగిందో దేవుడికే తెలియాలని చెబుతున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చాలా మంచివాళ్లని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. జగన్‌రెడ్డి మాటలు వింటూ ఉంటే 'అందరూ శ్రీవైష్ణవులే– బుట్టలోని రొయ్యలు మాత్రం మాయమయ్యాయి' అన్న సామెత గుర్తుకొస్తుంది. జగన్‌రెడ్డి చేతులు పిసుక్కుంటూ పిచ్చి చూపులు చూడటాన్ని ట్రోల్ చేస్తూ తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా సిబ్బంది, తెలుగు తమ్ముళ్లు ఆనంద పడిపోతుంటారు కానీ... ఆ పిసుక్కోవడం వెనుక ఉండే వికృతమైన ఆలోచనలను పసిగట్టడంలో విఫలమవుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన రాజకీయాలకోసం శవాలు ఎక్కడ దొరుకుతాయా అని జగన్ ఎదురుచూస్తుంటారు. తాజాగా వినుకొండలో రషీద్ శవం అతనికి లభించింది. వెంటనే వికృత రాజకీయాలకు తెరలేపారు. ఈ సందర్భంగా 'సె□ర్' సినిమాలో ఎస్‌జే సూర్య క్యారెక్టర్ గుర్తుకు రాకుండా ఉండదు. ఆ సినిమాలో ఎవరైనా చనిపోతే విలన్ పాత్రధారి అలౌకిక ఆనందం పొందుతాడు.



ఎవరిది అరాచకం?

జగన్‌రెడ్డి విషయానికి వస్తే... అతను అప్పుడప్పుడూ నిజాలు చెబుతుంటాడు. అయితే, అవి ఏ కాలానికి సంబంధించినవన్నదే ప్రశ్న! రాష్ట్రంలో అరాచకాలు, విధ్వంసాలు ప్రబలాయని, ప్రశ్నించే వారిని వేధిస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని జగన్‌రెడ్డి తాజాగా చెప్పుకొచ్చారు. ఇవన్నీ నిజమేగానీ, అలా జరిగింది తన పాలనలోనే అన్న నిజాన్ని మాత్రం జగన్ అంగీకరించరు. తన పాలనలో అరాచకం ప్రబలిందని నమ్మడం వల్లనే ప్రజలు తనను పదకొండు సీట్లకు పరిమితం చేశారని కూడా ఆయన ఒప్పుకోరు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని గొప్పగా చెప్పుకొన్న జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా అదే దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని, చేసిన పాపాలకు తగిన శిక్ష విధించాడని మాత్రం ఒప్పుకోరు. ప్రజలు తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా ఇవ్వలేదని గుర్తించి, కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం మాత్రం ఆయన చేయరు. అలా చేస్తే అతను జగన్మోహన్‌రెడ్డి ఎందుకవుతారు? తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకు కూడా హాజరు కానని అతగాడు తాజాగా సెలవిచ్చారు. ప్రజలే ఇవ్వని హోదా కోసం హైకోర్టును ఆశ్రయించడం జగన్‌రెడ్డికే చెల్లింది. జగన్‌రెడ్డి శాసనసభకు హాజరైనా, అవకపోయినా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. చంద్రబాబు శాసనసభకు హాజరు కాకూడదని నిర్ణయించుకోవడం వెనుక బలమైన కారణం ఉందని కొందరైనా అంగీకరిస్తారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే శాసనసభకే రానని చెప్పడమే జగన్‌రెడ్డి ప్రత్యేకత. సంప్రదాయ రాజకీయాలకు అలవాటుపడిన వారి అభిప్రాయాలకు ఆయన విలువ ఇవ్వరు. అతడి ఆలోచనల వెనుక అంతరంగం అంతుబట్టదు. అన్నీ తెలిసేసరికి రాజకీయ ప్రత్యర్థులకు జరగాల్సిన నష్టం జరుగుతుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్ విధ్వంసాన్నే నమ్ముకున్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా విధ్వంసాన్నే నమ్ముకుంటున్నారు.

> జగన్‌రెడ్డి అప్పుడప్పుడూ నిజాలు చెబుతుంటాడు. అయితే, అవి ఏ కాలానికి సంబంధించినవన్నదే ప్రశ్న! రాష్ట్రంలో అరాచకాలు, విధ్వంసాలు ప్రబలాయని, ప్రశ్నించే వారిని వేధిస్తున్నారని, పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని జగన్‌రెడ్డి తాజాగా చెప్పుకొచ్చారు. ఇవన్నీ నిజమేగానీ, అలా జరిగింది తన పాలనలోనే అన్న నిజాన్ని మాత్రం జగన్ అంగీకరించరు. తన పాలనలో అరాచకం ప్రబలిందని నమ్మడం వల్లనే ప్రజలు తనను పదకొండు సీట్లకు పరిమితం చేశారని కూడా ఆయన ఒప్పుకోరు. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని గొప్పగా చెప్పుకొన్న జగన్‌రెడ్డి ఇప్పుడు కూడా అదే దేవుడు గొప్ప స్క్రిప్ట్ రాశాడని, చేసిన పాపాలకు తగిన శిక్ష విధించాడని మాత్రం ఒప్పుకోరు. ప్రజలు తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా ఇవ్వలేదని గుర్తించి, కోల్పోయిన ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం మాత్రం ఆయన చేయరు. అలా చేస్తే అతను జగన్మోహన్‌రెడ్డి ఎందుకవుతారు?

ధనం... అధికారం...

జగన్‌రెడ్డి వద్ద అంతులేని ధన బలం ఉంది. అతడికి కావాల్సింది అధికారం! 'అధికారం కోసం ధనం – ధనం కోసం అధికారం' అన్న సూత్రాన్ని జగన్‌రెడ్డి బలంగా నమ్ముతారు. అందుకే శాసనసభకు హాజరై అతను టైం వేస్ట్ చేసుకోరు. ప్రజా సమస్యలపై గొంతు విప్పడానికే ప్రతిపక్షం ఉంటుందన్న పాత చింతకాయ పచ్చడి సిద్ధాంతాలను జగన్ నమ్మరు. తాడేపల్లి ప్యాలెస్‌లోనో, బెంగళూరు ప్యాలెస్‌లోనో, మరోచోట నిర్మించుకున్న ప్యాలెస్‌లోనో సతీసమేతంగా సేదదీరుతూ విధ్వంస రచన చేస్తుంటారు. అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రతిపక్షాలను అణచివేసేందుకు విధ్వంస రచనకే అధిక సమయం కేటాయించిన విషయం మరచిపోకూడదు. రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తినా జగన్‌కు పట్టదు. జగన్ తరహా రాజకీయాలు ఒంటబట్టించుకోని షర్మిల మాత్రం సంప్రదాయ రాజకీయాలను నమ్ముకున్నట్టున్నారు. అందుకే వరద నీటిలో దిగి ఫొటోలు దిగారు. ఇలాంటివి చిల్లర రాజకీయాలుగా జగన్ భావిస్తారు. 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేయడమెలా? అన్న దానిపైనే ఇప్పుడు ఆయన ఫోకస్ ఉంటోంది. ఇందుకోసం అతను ఎటువంటి విధ్వంస రచన చేస్తారో వేచిచూడాలి.

చంద్రబాబు తెలుసుకోవాలి...

తాను పది ఎన్నికలు చూశానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొంటున్నారు కానీ, జగన్‌రెడ్డి వంటి వారిని ఇప్పుడే చూస్తున్నానని అనుక్షణం గుర్తు చేసుకోవాలన్నది మరచిపోతున్నారు. రాజకీయాలలో తన సమకాలీనుడైన వైఎస్ రాజశేఖరరెడ్డితో తలపడినప్పుడు చంద్రబాబుకు ఇన్ని ఇబ్బందులు ఎదురుకాలేదు. గత ఐదేళ్లు చంద్రబాబు రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం. కార్యకర్త నుంచి చంద్రబాబు వరకు ప్రతి ఒక్కరినీ వేధించిన చరిత్ర జగన్‌రెడ్డిది. రాష్ట్రాభివృద్ధి ఎంత ముఖ్యమో, జగన్‌రెడ్డి వంటి వారిని రాజకీయంగా మళ్లీ కోలుకోకుండా దెబ్బతీయడం కూడా అంతే ముఖ్యమని చంద్రబాబు తక్షణం గ్రహించాలి. అతగాడికి రాజకీయ భవిష్యత్తు లేదన్న నమ్మకం కుదిరితేనే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరైనా ముందుకొస్తారు. జగన్‌రెడ్డికి రాజకీయ భవిష్యత్తు ముఖ్యం– రాష్ట్రాభివృద్ధిని ఆయన పట్టించుకోరు. ఈ క్రమంలో ఆయన ఎంతకైనా తెగిస్తారు. కేవలం వంద కోట్ల లిక్కర్ కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ కవిత జైలు జీవితం గడుపుతున్నారు. జగన్‌రెడ్డి తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని 36 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని సీబీఐ తన చార్జిషీట్లలో పేర్కొంది. అయినా అదురూ బెదురూ లేకుండా క్రిమినల్ రాజకీయాలనే జగన్ నమ్ముకున్నారంటే అతను ఎలాంటివాడో అర్థం చేసుకోవాలి. మా ఓటర్లు వేరు అని చెప్పుకొనే జగన్‌రెడ్డి తన రాజకీయాలు వేరుగా ఉంటాయని కూడా చెప్పకనే చెబుతున్నారు. అర్థం చేసుకోలేకపోవడం అవతలివారి అవివేకం అవుతుంది. తాజా ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా పాతాళానికి తొక్కినా రాజకీయంగా మళ్లీ ఊపిరి పోసుకోవడానికే జగన్ ప్రయత్నం చేస్తారు. అందుకోసం శవాల వేట కొనసాగుతూనే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పడి నెలన్నర కాకముందే రాష్ట్రపతి పాలన కోరడం మనకు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. ఈ డిమాండ్ చేయడం వెనుక ఎటువంటి వికృత ఆలోచనలు, వ్యూహాలు ఉన్నాయో గుర్తించే ప్రయత్నం చేయకపోతే చంద్రబాబు ప్రభుత్వం ఆత్మరక్షణలో పడుతుంది. కొలంబియాకు కంటి మీద కునుకు లేకుండా చేసిన మాఫియా డాన్ ఎస్కోబార్‌తో జగన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు పోల్చారు. ఎస్కోబార్ కేవలం డ్రగ్స్ స్మగ్లింగ్ మీదే ఆధారపడ్డాడు. అధికారం చేపట్టలేదు. కానీ... జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. కాలం కలిసొస్తే రాజకీయంగా ఊపిరిపోసుకొని మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నది జగన్‌రెడ్డి లక్ష్యం. ఇందుకోసం ఆయన ఎంతకైనా తెగిస్తారు. అప్రమత్తంగా ఉండటమా లేదా అన్నది చంద్రబాబు అండ్ కో తేల్చుకోవాలి. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న చంద్రబాబు సంకల్పం వాంఛనీయమే కానీ, రాజకీయం కూడా అంతే ముఖ్యం. జగన్ విషయంలో ఏ మాత్రం ఏమరుపాటు ప్రదర్శించినా రాజకీయ భూతం మళ్లీ జూలు విదిలిస్తుంది.

> ప్రత్యేక హోదా బదులుగా 2019కి పూర్వం కేంద్రం ఇవ్వజూపిన ప్రత్యేక ప్యాకేజీ ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది. ఈ ప్యాకేజీ కింద లభించే సహాయాన్ని కేంద్రమే భరిస్తుంది. ఈ వాస్తవాన్ని ప్రజలు అర్థం చేసుకోకుండా అబద్ధాల మత్తులో ప్రజలను ముంచెత్తేందుకు జగన్ అండ్ కో శక్తివంచన లేకుండా ప్రయత్నాలు మొదలెట్టారు.

కేంద్రం అండపైనా అక్కసే...

కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌లతో చర్చలు జరిపి రాష్ట్రానికి కేంద్రం సహాయంపై ఒక అవగాహన కుదుర్చుకొని వచ్చారు. ఫలితంగా రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్ర సంస్థల ద్వారా పదిహేను వేల కోట్ల రూపాయల సహాయం లభించబోతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల ఈ విషయాన్ని కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించగానే అది అప్పు మాత్రమేనని, గ్రాంట్ కాదని జగన్ అండ్ కో విష ప్రచారం మొదలెట్టింది. తాను ముఖ్యమంత్రిగా ఢిల్లీ వెళ్లినప్పుడు ఎప్పుడైనా రాష్ట్రం గురించి అడిగిన దాఖలాలు చూపించే సాహసం జగన్ చేయలేరు. అయినా ఇప్పుడు అది అప్పు మాత్రమే అని ఎగతాళి చేయడాన్నిబట్టి జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేక హోదా బదులుగా 2019కి పూర్వం కేంద్రం ఇవ్వజూపిన ప్రత్యేక ప్యాకేజీ ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది. ఈ ప్యాకేజీ కింద లభించే సహాయాన్ని కేంద్రమే భరిస్తుంది. ఈ వాస్తవాన్ని ప్రజలు అర్థం చేసుకోకుండా అబద్ధాల మత్తులో ప్రజలను ముంచెత్తేందుకు జగన్ అండ్ కో శక్తివంచన లేకుండా ప్రయత్నాలు మొదలెట్టారు. కారణాలు ఏమైనా శిథిలమైన రాష్ట్రాన్ని ఆదుకోవడానికి మోదీ ప్రభుత్వం ఇప్పుడు సంసిద్ధంగా ఉంది. ఈ అవకాశాన్ని చంద్రబాబు ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. ప్రత్యేక హోదా వంటి కాలం చెల్లిన నినాదాలను ఎవరు చేసినా పట్టించుకోకూడదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటిన తర్వాత ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలని కోరడం రాజకీయమే అవుతుంది. కేంద్ర సహకారం లేకపోతే రాష్ట్రం నిలదొక్కుకోలేదు. ప్రజలు ఈ వాస్తవాన్ని గుర్తించలేని పక్షంలో ఆంధ్రప్రదేశ్‌కు మోక్షం ఉండదు. గతంలో జగన్ ట్రాప్‌లో పడి ప్రత్యేక ప్యాకేజీని చంద్రబాబు వదులుకోవడం వల్ల జరిగిన నష్టాన్ని ప్రజలు గ్రహించాలి. జగన్‌రెడ్డి ఎత్తుగడలు ఎన్నో రూపాల్లో ఉంటున్నాయి. వాటిల్లో ప్రజాహితం మచ్చుకైనా ఉండదు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన చెప్పిన మాటలు, చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను పదే పదే ప్రదర్శిస్తే చాలు. అతని వద్ద సమాధానం ఉండదు. ప్రజలు కూడా అర్థం చేసుకుంటారు.

పులి కాదు.. పిల్లి

జగన్‌రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో కొంత మంది ఇండియా కూటమి నాయకులు పాల్గొనడంతో ఆయన ఇండియా కూటమిలో చేరతారా? అన్న చర్చ మొదలైంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు కూడా ఢిల్లీ కేంద్రంగా రాజకీయాలు చేసే నాయకులను ఆహ్వానించేవారు. ఢిల్లీ రాజకీయాల గురించి అవగాహన ఉన్న వారికి ఇవన్నీ తెలుసు. వచ్చే వారు ఎందుకు వస్తారో అందరికీ తెలుసు. జాతీయ మీడియాలో చోటు లభించాలంటే ఏం చేయాలో కూడా అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి ఇండియా కూటమిలో చేరబోతున్నారా? అన్న చర్చలో వాస్తవం నేతి బీరకాయలోని నెయ్యి చందంగా ఉంటుంది. జగన్‌రెడ్డి అనే వ్యక్తి పులి కాదు పిల్లి అని అనేక సందర్భాలలో రుజువైంది. గతంలో బెయిలు కోసం సోనియాగాంధీ వద్ద సాగిలపడిన విషయం మరచిపోవద్దు. ఇప్పుడు ప్రధాని మోదీని ధిక్కరించిన బలమైన నాయకులకు కూడా ఏ గతి పట్టిందో తెలిసి కూడా జగన్‌రెడ్డి వంటి వారు మోదీని ధిక్కరించే సాహసం చేస్తారని అనుకోలేం. తన గారాల పట్టి కవితను విడిపించుకోవడం కోసం తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుషులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకపోవడాన్ని చూస్తున్నాం.

> చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటిందో లేదో... రాష్ట్రంలో అరాచకం ప్రబలిందని, రాష్ట్రపతి పాలన విధించాలని ఢిల్లీ వెళ్లి గగ్గోలు పెట్టడం జగన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైంది. దాదాపు 57 శాతం ఓట్లు, 93 శాతం సీట్లు వచ్చిన ప్రభుత్వాన్ని నెల రోజులకే రద్దు చేయాలని కోరడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం కావొచ్చు. ఇదే జగన్‌రెడ్డి ప్రత్యేకత! క్రిమినాలజీలో ఆరితేరిన జగన్‌రెడ్డి రాజకీయాలు విలక్షణంగానే ఉంటాయి. గతంలో ఫ్యాక్షనిస్టులు తమ ప్రత్యర్థులకు స్పాట్ పెట్టాలనుకున్నప్పుడు ఎలిబీ కోసం ఏదో ఒక ఆస్పత్రిలో చికిత్స పేరిట చేరిపోయేవారు. ఆ తర్వాత ఎవరో ఒకరు హత్యకు గురయ్యేవారు. ఇప్పుడు ఈ ఆధునిక పాలెగాడైన జగన్మోహన్ రెడ్డి తనపై గతంలోనే నమోదైన కేసులతో పాటు ఇకపై నమోదయ్యే కేసుల నుంచి రక్షణ కోసం ఢిల్లీ స్థాయిలో ధర్నా పేరిట స్కెచ్ వేసుకున్నారు. ఈ నేపథ్యంలో అతగాడు అలవోకగా అబద్ధాలు ప్రచారం చేస్తుంటారు.

కవితకు బెయిల్ వచ్చేలా సహకరిస్తే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి కూడా కేసీఆర్ సిద్ధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి మోదీని ధిక్కరించి ఇండియా కూటమిలో చేరతారా? చేరితే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? సీబీఐ, ఈడీ కేసులలో విచారణ వేగవంతమైతే ఏం జరుగుతుందో జగన్‌కు తెలియదా? మరోవైపు రాష్ట్రంలో అధికారం వెలగబెట్టినప్పుడు చేసిన అరాచకాలు, అవినీతిపై కేసులు కట్టడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వాన్ని ఎదిరించే సాహసం జగన్‌రెడ్డి చేసే అవకాశం లేదు. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు జగన్ రాజకీయాలు సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ఉంటాయి. కేంద్రంతో సఖ్యత సాధ్యం కాని పక్షంలో రాజ్యసభలోని తన సభ్యులను బీజేపీలోకి పంపడానికి కూడా మొహమాటపడరు. ఆయనకు ప్రస్తుతం కేసుల నుంచి రక్షణ కావాలి. లేని పక్షంలో రాష్ట్రంలో రాజకీయంగా ఊపిరి పోసుకొనే విషయం అటుంచితే అతడి రాజకీయ జీవితమే కొడిగట్టే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన రాజకీయ విన్యాసాలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు... తాను మాత్రం బాగుండాలన్నదే జగన్‌రెడ్డి ఏకైక లక్ష్యం. అందుకోసం ఆయన ఏమైనా చేస్తారు. ఎంతకైనా దిగజారుతారు. "తన పెళ్లి లోకకళ్యాణమని, తన చావు జగత్ప్రళయమని" అనుకునే బాపతు జగన్. అధికారంలో ఉన్నంత కాలం తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును పెద్దగా ప్రస్తావించని జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారం కోల్పోయాక రాజశేఖరరెడ్డి పాలనను ప్రజలకు గుర్తు చేసే ప్రయత్నాలను మళ్లీ మొదలుపెట్టడం గమనార్హం. ఈ మహానుభావుడికి ఆంధ్రజ్యోతి, ఈనాడు వంటి సంస్థలు దుర్మార్గంగా కనపడటంలో

నిరుద్యోగ సమస్యకి చిట్కాల పరిష్కారమా?

తాజా బడ్జెట్టులో, నిరుద్యోగుల కోసం, లక్షా 7 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టు కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది! ఎందుకూ? రకరకాల పరిశ్రమలలో, ప్రైవేటు రంగంలో, దాదాపు 50 లక్షల కొత్త ఉద్యోగాలు దొరికేలా! 'ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింద'ని పత్రికలు కూడా ప్రకటించాయి! కానీ, ఆ రకపు కేటాయింపులు, 'నిరుద్యోగం' అనే రాకాసి వ్యాధిని ఏ మాత్రం తగ్గించవని బైట వున్న లెక్కలు చెపుతున్నాయి. ఇప్పటికే, పని చేసే సామర్థ్యం వుండీ, పని దొరకనీ, 28 కోట్ల మంది నిరుద్యోగులు వున్నారని ఆ లెక్కలే చెబుతున్నాయి. అంతేకాదు. ఇంకా, ప్రతీ సంవత్సరం, 2 కోట్ల 40 లక్షల మంది, అప్పటికి పెరిగిన యువతీ యువకులు, ఉద్యోగాల కోసం కొత్తగా తయారవుతున్నారు. ఇటువంటి స్థితిలో, ప్రభుత్వం, అది ఏ పార్టీ ప్రభుత్వం అయినా, ప్రకటించే బడ్జెట్టు కేటాయింపులు ఏ మాత్రమూ సరిపోయేవి కావు.

ఈ నిరుద్యోగ సమస్య గురించి, ప్రభుత్వమూ పారిశ్రామికవేత్తలూ, ఆర్థికవేత్తలూ, చేస్తున్న రకరకాల సూచనల్ని చూద్దాం. ముందుగా ఒక ఉదాహరణ! దేశంలోని అన్ని ప్రాంతాలనీ కలిపే రహదారుల్ని నిర్మిస్తే, కొన్ని లక్షలమందికి పని దొరుకుతుందనేది ఒక సూచన! కానీ, జరుగుతున్నది ఏమిటి? ఒకప్పుడు, ఒక్క రహదారి నిర్మాణానికి కొన్ని 'వందల మంది' అవసరం అయితే, ఇప్పుడు కొన్ని 'పదుల మందే' చాలునని ఇప్పటి లెక్క! ఎందుకంటే, భారీ యంత్రాలనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు కాబట్టి! నేలని బాగా లోతుగా తవ్వే యంత్రాలూ (జె.సి.బి.లు); రోడ్డు వెయ్యడానికి కావలసిన సిమెంటునీ, ఇసకనీ కలిపి తయారుచేసే కాంక్రీట్ మిక్సర్లూ; రోడ్డుని చదును చేసే రోడ్డు రోలర్లూ; నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చే పెద్ద పెద్ద ట్రక్కులూ వంటివెన్నో భారీ యంత్రాలను ఉపయోగించడం వల్ల, కార్మికుల్ని తక్కువగా ఉపయోగిస్తున్నారు. ఒక పెద్ద వెడల్పు రహదారిలో, ఒక కిలోమీటరు రోడ్డు వెయ్యడానికి 20 మందిని మాత్రమే, 40 రోజుల్లో మాత్రమే పనిలో పెడతారని ఇప్పటి లెక్క! కాబట్టి, భారీ యంత్రాలను ఉపయోగించి, కార్మికులకు పనులే లేకుండా చేసే 'ప్రధానమంత్రీ గ్రామ్ సడక్ యోజన' అని ఎన్ని గొప్ప పేర్ల పథకాలు పెట్టినా, వాటిలో ఏ పథకమూ నిరుద్యోగం సమస్యని పెంచుతుందేగానీ తగ్గించదు.

ఇప్పుడు బడ్జెట్టులో ఒక కొత్త పథకం పెట్టారు. కొత్తగా ఉద్యోగాలు ఇచ్చే పరిశ్రమల వారికి, డబ్బు రూపంలో కొంత ప్రోత్సాహకాలు అందించే పథకం. కొత్తగా ఉద్యోగాల్లో చేరినవారికి, ఒక నెల జీతాన్ని ప్రభుత్వమే మూడు వాయిదాల్లో ఇవ్వడం. ఎప్పటికప్పుడు సాంకేతికత (టెక్నాలజీ) మెరుగవుతూ వుంటుంది కాబట్టి, దానికి తగిన నైపుణ్యాన్ని నేర్చుకునే సమయంలో, ఆ నిరుద్యోగులకి కొంత డబ్బు

> ఎన్ని పథకాలు పెట్టినా, ఇప్పుడు వున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో నిరుద్యోగం అనేది సమాజానికి పుట్టుకతో ప్రారంభమైన రాచపుండు! దీనికి పరిష్కారం, యంత్రాలు అనే 'ఉత్పత్తి సాధనాల' రూపంలో వున్న పెట్టుబడిని, శ్రమలు చేసే కార్మిక వర్గం స్వాధీనం చేసుకోవడమే.



(సె□ండ్) ఇవ్వడం. నైపుణ్యాలు నేర్చుకున్న తర్వాత కూడా వారందరికీ ఉద్యోగాలు గ్యారంటీగా దొరుకుతాయో లేదో స్పష్టత లేదు. ఇక, ప్రతి ఏటా కొత్తగా ఉద్యోగాలు కావలిసిన '2 కోట్ల 40 లక్షల' మంది యువజనుల మాటేమిటి?

ఎన్ని పథకాలు పెట్టినా, ఇప్పుడు వున్న పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థలో నిరుద్యోగం అనేది సమాజానికి పుట్టుకతో ప్రారంభమైన రాచపుండు! దీనికి చిట్కా వైద్యాలెలా పని చేస్తాయి? 'లాభమే' లక్ష్యంగా గల ఈ ఆర్థిక విధానంలో, ఆ లాభాల్ని సంపాదించడానికి, పరిశ్రమల వాళ్ళు అనుసరించే ఒక ప్రధానమైన పద్ధతి, 'ఉత్పాదకత' కోసం సాంకేతికతల్ని పెంచుకుంటూ పోవడం! సాంకేతికత అంటే, భారీ యంత్రాలనూ, ఆటోమేటిక్ యంత్రాలనూ నడుపుతూ తక్కువ మంది కార్మికులు, తక్కువ ఖర్చుతో, పెద్ద మొత్తంలో, 'సరుకుల్ని' ఉత్పత్తి చేసేలా చూడడం! ఈ మధ్య, 'కృత్రిమ మేధతో' ('ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్') అంటే కంప్యూటరు సైన్స్‌ని ఉపయోగించి, మనుషులకున్న తెలివితో పోలుస్తూ, యంత్రాల్ని ఉపయోగించడం! ఈ మార్గంలో, కోట్ల కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు ఏర్పరిచే మార్గాలోచనే లేకుండా ఆ సంఖ్యని తగ్గించడానికి ప్రయత్నాలు ఎక్కువయ్యాయి!

ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే, అసలు యంత్రాలే వద్దని కాదు. మానవుల మేధాశ్రమల వల్లా, శారీరక శ్రమల వల్లా తయారైన యంత్రాలు, మార్క్సు 'కాపిటల్'లో చెప్పినట్టు, మానవుల "పని భారాన్ని తగ్గిస్తాయి. కానీ, పెట్టుబడి వాటిని ఉపయోగించినప్పుడు, అవి శ్రమ తీవ్రతను పెంచుతాయి." పెట్టుబడిదారుల సంపద పెంచి, కార్మికుల్ని 'పరమ దరిద్రులుగా' ('పాపర్స్'గా) చేస్తాయి. పెట్టుబడి అన్నప్పుడు అది చిన్నస్థాయిదైనా, మధ్యస్థాయిదైనా, భారీ స్థాయిదైనా, సాధారణంగా పెట్టుబడిదారులు ఏదో స్థాయిలో యంత్రాలను ఉపయోగించడం, తక్కువమంది కార్మికులతో ఎక్కువ పనిచేయిస్తూ పరిశ్రమలు నడపడానికే! దాని ఫలితమే, నిరుద్యోగం రెట్లు మరింతగా పెరగడం.

అది ఎలా జరుగుతుందో చూద్దాం: ఒక తివాచీల ఫ్యాక్టరీ, సంవత్సరానికి 6 కోట్ల పెట్టుబడితో పనిచేస్తోంది అనుకుందాం. యంత్రాలూ, ముడిపదార్థాలూ వగైరాల కోసం 3 కోట్లు. జీతాల కోసం 3 కోట్లు. ఈ జీతాలతో సంవత్సరానికి 100 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక మనిషికి సంవత్సర జీతం: 3 లక్షలు. ఇలా ఉండగా, కార్మికుల అవసరాన్ని సగానికి తగ్గించే కొత్త యంత్రం వచ్చినప్పుడు? జీతాలలోనించే 1 కోటీ, 50 లక్షల్ని తగ్గించి, దాన్ని తీసి, కొత్త యంత్రం కోసం అదనంగా పెట్టారు. కొత్త యంత్రం వల్ల 50 మంది కార్మికులు, అవసరం లేకుండా, అదనం ఐపోయారు. మిగిలిన 50 మంది కార్మికులతోనే గతంలో జరిగిన పని అంతా జరుగుతుంది.

ఆ పెట్టుబడి, గతంలో: యంత్రాలూ, వగైరాలకు– 3 కోట్లూ + జీతాలకు 3 కోట్లూగా ఉంటే, అదే ఇప్పుడు: యంత్రాలకు 4 కోట్ల, 50 లక్షలుగా పెరిగి + కార్మికుల జీతాలకు 3 కోట్ల నించి, 1 కోటీ, 50 లక్షలుగా తగ్గిపోయింది! ఆ పెట్టుబడితో గతంలో: 100 మంది కార్మికులు పనిలో ఉంటే, దానితో ఇప్పుడు 50 మంది మాత్రమే పనిలో ఉన్నారు. ఇంకో 50 మంది నిరుద్యోగులయ్యారు.

దీనికి పరిష్కారం, యంత్రాలు అనే 'ఉత్పత్తి సాధనాల' రూపంలో వున్న పెట్టుబడిని, శ్రమలు చేసే కార్మిక వర్గం స్వాధీనం చేసుకోవడమే! ఇది జరగాలంటే, చాలా పనులు జరగాలి. అన్నిటికంటే ముందు జరగవలిసింది: "పాలక వర్గాల రాజకీయ అధికారానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం సంస్థాపరంగా పురోగమించి వుండకపోతే, ఆ అధికారానికి వ్యతిరేకంగా నిరంతర ప్రచారం ద్వారానూ, పాలకవర్గాల విధానాల పట్ల శతృపూరిత వైఖరిని ప్రదర్శించడం ద్వారానూ, కార్మికవర్గానికి శిక్షణ ఇచ్చి తీరాలి. లేకపోతే, కార్మికవర్గం పాలకవర్గాల చేతిలో ఆట వస్తువుగా వుండిపోతుంది." (మార్క్స్, 23–11–1871).

ఈ పని చెయ్యవలిసింది ఎవరు? కార్మికవర్గ రాజకీయ పార్టీల వారు. మరి వారు ఈ పని చేస్తున్నారా?

■ రంగనాయకమ్మ



మోతాదుకు మించి..

నగరంలో శ్రుతిమించుతున్న బుల్లెట్ సైలెన్సర్ల శబ్దాలు

డుగ్.. డుగ్.. డుగ్‌మని సౌండ్ చేసుకుంటూ రివ్వున దూసుకుపోయేవి ఒకరకం బుల్లెట్లైతే.. భారీ బాంబులను పేలిన శబ్దాలతో భయపెట్టేవి మరోరకం బుల్లెట్లు.. నేటి కుర్రకారుకు ఇది స్టేటస్ సింబల్ అయితే, వాహనదారులు, పాదచారులకు మాత్రం గుండెల్లో దడపుట్టించే భారీ ధ్వనికాలుష్యం. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు చర్యలు తీసుకుంటున్నా.. సదరు సైలెన్సర్లను తుక్కు చేస్తున్నా.. ఈ విష సంస్కృతి మాత్రం నగరంలో నానాటికీ పెరుగుతూనే ఉంది.

- పాదచారులు, వాహనదారులను భయపెడుతూ విన్యాసాలు
- సైలెన్సర్లు మార్చేసి భారీ శబ్దాలు వచ్చేవి అమరిక
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని సర్వీసింగ్ సెంటర్లు
- యువత చేష్టలతో వణికిపోతున్న నగరవాసులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : స్టేటస్ సింబల్‌గా మారిన బుల్లెట్ బైకులపై యువకులు చేస్తున్న విన్యాసాలు గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. బుల్లెట్లకు భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని వాహనచోదకులు, పాదచారులను భయపెడుతున్నారు. జనావాసాల మధ్య, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాంబులు పేలిన శబ్దాలు చేస్తున్నారు. నగరంలో ఈ పేలుడు ఓ ఫ్యాషన్‌గా మారింది. ఇప్పటికే ధ్వనికాలుష్యంతో ఇబ్బందిపడుతున్న ప్రజలకు బుల్లెట్ల మోత చెవులు చిల్లులు పడేలా చేస్తోంది.

మోడల్‌కు తగ్గట్టుగా మార్పులు

బుల్లెట్‌లో ఏడెనిమిది రకాలున్నాయి. క్లాసిక్ 350, హంటర్ 350, బుల్లెట్ 350, హిమాలయ, థండర్ స్ట్రామ్, జీటీ 650 మోడళ్లు ఉన్నాయి. వాటిలో క్లాసిక్, హంటర్, బుల్లెట్ మోడళ్లను ఎక్కువగా కొంటున్నారు. వీటి ధర సుమారు రూ.2.48 లక్షల వరకు ఉంటుంది. ఇవికాకుండా 2016-2019 మోడళ్ల బుల్లెట్లు కొన్ని ఉన్నాయి. వాటికి హ్యాండిల్ కుడివైపున ఇంజన్ ఆన్-ఆఫ్ స్విచ్ ఉంటుంది. బుల్లెట్‌ను స్టార్ట్ చేసిన తర్వాత ఎక్స్‌లేటర్ ఇచ్చి వేగం పెంచుతున్నారు. ఆ సమయంలో ఈ బటన్‌ను ఆన్-ఆఫ్ చేస్తున్నారు. ఇలా పదేపదే చేయడంతో బాంబు పేలిన శబ్దాలు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లోకి బీఎ6 మోడల్ బుల్లెట్లు వస్తున్నాయి. వాటికి ఆన్-ఆఫ్ స్విచ్‌ను గుండ్రంగా ఇస్తున్నారు. ఇంజన్ స్టార్ట్ కావాలంటే దీనికి ఉండే కొనను పైకి నెట్టాలి. ఆగిపోవాలంటే.. కిందకు జరపాలి. పాత బుల్లెట్ల మాదిరిగా ఆన్-ఆఫ్ చేసినా బాంబు పేలిన శబ్దం మాత్రం రాదు. దీంతో కుర్రకారు ఆన్-ఆఫ్ స్విచ్‌లను మార్చేస్తోంది. దీంతో పాటు కంపెనీ ఇన్‌బిల్ట్‌గా ఇచ్చిన సైలెన్సర్లను తీయించేస్తున్నారు. రూ.3 వేల నుంచి రూ.12 వేల విలువ కలిగిన ఎగ్జాస్టర్ సైలెన్సర్లను కొంటున్నారు. నగరంలో ఉన్న బుల్లెట్ సర్వీసింగ్ సెంటర్లలో వాటిని అమర్చుకుంటున్నారు. ఇలా చేసినందుకు సర్వీసింగ్ సెంటర్లు రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నాయి. కొత్తగా మార్కెట్లోకి వస్తున్న బీఎస్6 మోడల్ బుల్లెట్లలో ఏబీఎస్ (ఆటోమెటిక్ బ్రేక్ సిస్టం) ఉంటుంది. ఇంజన్ ఆన్-ఆఫ్ బటన్, ఎగ్జాస్టర్ సైలెన్సర్లను అమర్చుకోవాలంటే ఈ ఏబీఎస్‌ను తొలగిస్తున్నారు.



భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను తుక్కు చేయిస్తున్న పోలీసులు

హెచ్చరికలతోనే సరి

ట్రాఫిక్ పోలీసులు కొద్దిరోజుల క్రితం 297 బుల్లెట్లకు ఉన్న భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఇలా చేయడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకుముందు కూడా ఇలాంటి చర్యలు తీసుకున్నారు. ఇలా చేసిన కొన్ని రోజులు మాత్రం కుర్రాళ్లు సైలెంట్‌గా ఉంటున్నారు. ఆ తర్వాత పరిస్థితి మళ్లీ మామూలుగానే ఉంటోంది. ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చేసే విద్యార్థులు బుల్లెట్లను ఒక స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. తల్లిదండ్రులను ఏదోలా ఒప్పించుకుని ఖరీదైన బుల్లెట్లను కొంటున్నారు. తర్వాత వాటి నామరూపాలు మార్చేస్తున్నారు. షోరూంల్లో నుంచి బుల్లెట్లను బయటకు తీసుకురాగానే సర్వీసింగ్ సెంటర్లకు తీసుకెళ్తున్నారు. కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లను తీయించేసి భారీ శబ్దాలు చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్నారు. ఇందుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఎగ్జాస్టర్ల ఏర్పాటు నిషేధం. అయినా సర్వీసింగ్ సెంటర్ల నిర్వాహకులు బెంగళూరు, ముంబయి, ఢిల్లీ నుంచి ఎగ్జాస్టర్లను తెప్పించి విచ్చలవిడిగా అమరుస్తున్నారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు సర్వీసింగ్ సెంటర్లను కట్టడి చేయకపోతే సైలెన్సర్లను తొక్కించడానికి ఎన్ని రోలర్లు ఉపయోగించినా ఫలితం ఏముంటుందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు.

• నయనానందకరం భక్తప్రహ్లాద



బిస్మిల్లాఖాన్ జాతీయ యువ పురస్కార గ్రహీత, నాట్యాచార్య చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన భక్తప్రహ్లాద యక్షగాన కూచిపూడి ప్రదర్శన రసజ్ఞులను ఆనంద విహారం చేయించింది. మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో శనివారం జరిగిన ఈ ప్రదర్శనలో కళాకారులు అద్భుత అభినయాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు.


సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు ప్రారంభం

మోపిదేవి ఆలయానికి ఉత్సవ శోభ

- ప్రత్యేక పూజలతో అంకురార్పణ

6లో..

రింగ రింగా..!



ఎమ్మెల్యేల చుట్టూ తహసీల్దార్ల ప్రదక్షిణలు

- బదిలీల్లో గ్రేటర్ విజయవాడ విలీన మండలాలపై దృష్టి
- ఒక్కో పోస్టు కోసం ఆరుగురు చొప్పున పోటీ
- అవాక్కవుతున్న ఎమ్మెల్యేలు
- పోటీగా.. ఆర్ఐ, వీఆర్వోలు కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బదిలీలపై సొంత జిల్లాలకు వస్తున్న తహసీల్దార్లు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఒక్కో మండలానికి అరడజను మంది తక్కువ కాకుండా పోటీ పడుతున్నారు. వచ్చేవారు, వెళ్లేవారితో ఎమ్మెల్యేల కార్యాలయాలు రద్దీగా మారిపోయాయి. తహసీల్దార్ల తాకిడి చూసి ఎమ్మెల్యేలే ఆశ్చర్యపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. మరీ ముఖ్యంగా విజయవాడ గ్రేటర్ విలీన జాబితాలో ఉన్న స్థానాలకు తహసీల్దార్ల నుంచి తీవ్ర పోటీ నెలకొంది.

ఆ స్థానాలకు పోటాపోటీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో విజయవాడ రూరల్ మండలం మొదటి వరుసలో ఉండగా, గన్నవరం మండలం రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత జగ్గయ్యపేట, పెనమలూరు, కంకిపాడు, బాపులపాడు, మైలవరం, గంపలగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, గుడివాడ, పెడన, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాలు ప్రధానంగా ఉన్నాయి. మచిలీపట్నం, అవనిగడ్డ, కంచికచర్ల, పామర్రు మండలాలకు కూడా డిమాండ్ బాగానే ఉంది. విజయవాడ తూర్పు, సెంట్రల్ మండలాలకు పోటీ తీవ్రంగా ఉంది.

ఒక్కో పోస్టు కోసం అరడజను మందికి పైగా తహసీల్దార్లు పోటీ పడుతుండటంతో ఎవరిని ఎంపిక చేసుకోవాలో ఎమ్మెల్యేలకు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యేలతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్ఐలు, వీఆర్వోలు కూడా ఆయా మండలాలకు వెళ్లడానికి పోటీ పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలకు కొత్త సమస్య వచ్చి పడింది. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా దోపిడీ జరిగింది. ఇప్పుడు ప్రజల కోసం పని చేసేవారు రావాలని చాలావరకు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. కానీ ఏరికోరి

సందిగ్ధంలో ఎమ్మెల్యేలు

ఫోకల్ పాయింట్లనే కోరుకోవటం, పోటీ భారీగా ఉండటంతో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలను చవి చూడాల్సి వస్తుందోనని కంగారు పడుతున్నారు. తమకు ఎవరు కావాలో ఎమ్మెల్యేలు ఇప్పటికే నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కలెక్టర్లకు సిఫార్సు లేఖలు పంపినట్టు సమాచారం. కాగా, ఇప్పటికే తహసీల్దార్లకు మండలాల కేటాయింపు కొలిక్కి వచ్చినట్టుగా తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది.

రిజిస్ట్రేషన్ల ఎత్తుగడ

- రిజిస్ట్రేషన్ ఖర్చులో సగానికి సగం తగ్గింపు
- మిగతా వారంతా మొత్తం చెల్లించాల్సిందే..
- నున్నలే అవుట్‌లో గజం 4 వేలకే రిజిస్ట్రేషన్
- బయటివారికేమో రూ.9,500
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి

నున్నలో లెస్ మార్కెట్ విలువల వ్యవహారం

వైసీపీ హయాంలో వెంచర్లకు అడ్డగోలు అనుమతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలం నున్నలో ప్రైవేట్ వెంచర్ల నిర్వాహకులు వేస్తున్న ఎత్తుగడల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం భారీగా తగ్గుతోంది. కిందటి వైసీపీ హయాంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులను పట్టుకుని పలు వెంచర్ల సంస్థలు మార్కెట్ విలువలో మినహాయింపు పొందాయి. కొన్ని వెంచర్లకు మినహాయింపులు రావటంతో తక్కువ ధరకు రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. కానీ, పేదలకు అలాంటి మినహా యింపులేమీ ఇవ్వలేదు. ప్రభుత్వం మారినా వైసీపీ హయాంలో అడ్డదారిలో తెచ్చుకున్న అనుమతులను చూపుతూ ఇప్పటికీ భారీగా రిజిస్ట్రేషన్లు చేయిస్తు న్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు తక్కువగా ఉంటాయన్న ఉద్దేశంతో తమ వ్యాపా రాన్ని పెంచుకునేందుకు పలు వెంచర్ల యాజమానులు ప్రయత్నిస్తున్నారు.

పెద్దలకో రేటు.. పేదలకో రేటు..

నున్న శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉంది. ఇక్కడ గజం రూ.9,500గా రిజిస్ట్రేషన్ ధర ఉంది. కొన్ని వెంచర్ల సంస్థల నిర్వాకం కారణంగా ఇందులో సగం అంటే రూ.4 వేలే ప్రభుత్వ ఖజానాకు వెళ్తోంది. మిగతా సొమ్ము మినహాయింపు పొందటం వల్ల వెంచర్ల నిర్వాహకులకు లాభం చేకూరుతోంది. అలా అని ఈ వినహాయింపు అందరికీ రాలేదు. ఎంపిక చేసిన కొందరికే ఇచ్చారు. ఉదాహరణకు నున్నలో సర్వే నెంబర్ 41/2లో గజం రూ.9,500కే రిజిస్ట్రేషన్ చేశారు. కుందావారి కండ్రికలో సర్వే నెంబర్ 19/1లో గజం రూ.7 వేలకే రిజిస్ట్రేషన్ చేశారు. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ మధ్యలో ఓ వెంచర్ వేశారు. ఈ వెంచర్ యాజమాన్యం కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో మినహాయింపులు తెచ్చుకోవడంతో వారి లే అవుట్‌లో గజం రూ.4 వేలకే రిజిస్ట్రేషన్ చేశారు. లే అవుట్ మినహా మిగిలిన చోట్ల మాత్రం రూ.9,500, రూ.7 వేల చొప్పున వసూలు చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టిపెట్టాలి

మిగిలిన ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లోనూ ఇవే సంస్థలు వెంచర్లు వేశాయి. అక్కడ కూడా మినహాయింపులు పొందాయా లేదా అనేది తేలాల్సి ఉంది. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణం దృష్టిసారించి, అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులను రద్దుచేసి అందరికీ ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది.

అధికారుల తీరు మారాల్సిందే

జడ్పీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు, జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు, కృష్ణా కలెక్టర్

6లో..

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు నిలుపుదల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వన్‌టౌన్, జూలై 27 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అంతర్గత బదిలీలను నిలుపుదల చేశారు. ఈ బదిలీల్లో చోటుచేసుకున్న అవకతవకలను వెలికితీస్తూ 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. వీటిపై సీఎంవో కార్యాలయ అధికారులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనాచౌదరి స్పందించారు. సీఎంవో కార్యాలయ అధికారులు ఎమ్మెల్యే సుజనాచౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ కూడా స్పందించి ఈవోతో మాట్లాడారు. బదిలీలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. దీంతో బదిలీలను తాత్కాలికంగా నిలిపివేశారు.

మా డబ్బు సంగతేంటి..?

ప్రాధాన్యత కలిగిన సీట్లకు తమను పంపాలని కొందరు ఉద్యోగులు ఇప్పటికే కొంత అడ్వాన్సులు చెల్లించారు. బదిలీ ఉత్తర్వులు రద్దు కావడంతో అడ్వాన్సుగా ఇచ్చిన డబ్బు మాటేమిటంటూ మధ్యవర్తిగా ఉన్నవారి వెంటపడుతున్నారు. మీ పోస్టులు మీకే వస్తాయంటూ మధ్యవర్తి ఇంకా సర్దిచెబుతుండటం గమనార్హం

సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో స్వామివారు

మోపిదేవి, జూలై 27: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తికా మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు, అర్చక బృందం గోపూజ చేసి మహోత్సవాలను ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్దు పవన్ కుమార్ శర్మ, వేద పండితుడు కొమ్మూరి ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అభిషేక జలసంగ్రహణం, ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, రుత్విగ్వరణ, పంచగవ్యప్రాసన, అఖండ స్థాపన, వాస్తు మండపారాధన, సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానసములను రుత్వికుల బృందం శాస్త్రోక్తంగా జరిపింది.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి సుజాత



జస్టిస్ సుజాతకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం దర్శించుకున్నారు. ఈవో రామారావు ఆలయమర్యాదలతో వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. పండితులు ఆశీస్సులందించారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణా కలెక్టర్ బాలాజీ

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి

- అధికారులు, ప్రజా ప్రతినిధులతో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 27: కృష్ణాజిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో ఎమ్మెల్యేలు, కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీవో వాణి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయకుమారి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీపీవో నాగేశ్వర నాయక్, సీపీవో గణేష్ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలు ప్రారంభం

మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాస్పత్రి నేత్ర విభాగంలో రూ.కోటి విలువైన ఆధునిక వైద్య పరికరాలను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. మెల్ల కన్ను సమస్యతో బాధపడేవారికి శస్త్రచికిత్స కోసం ఆస్పత్రిలో పరికరాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, కంటి వైద్యుడు భానుమూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నిక్రుష్టపాలకుడు జగన్

- ఏడు శ్వేతపత్రాలు ఆయన అధ్వాన పాలనకు ప్రతిబింబాలు
- విలేకరుల సమావేశంలో నెట్టెం రఘురాం ధ్వజం

జగ్గయ్యపేట, జూలై 27: "శాసనసభను ఎదుర్కోలేని స్థితిలో మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండా పిరికివాడిలా పారిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏడు శ్వేతపత్రాలు జగన్ నిక్రుష్ట, నీచ, అధ్వాన పాలనకు అద్దం పడుతున్నాయి." అని టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం విమర్శించారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో నెట్టెం విలేకరులతో మాట్లాడారు. జగన్ రివర్స్ టెండరింగ్ వల్ల పోలవరం ప్రాజెక్టుకు రూ.45వేల కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. అదనంగా రూ.4900కోట్లు మరమ్మతులకు వెచ్చించాల్సి వచ్చిందని, విద్యుదుత్పత్తి జరగక పరోక్షంగా రూ.3 వేల కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. అమరావతిపై కక్షగట్టి విధ్వంసం చేశారన్నారు. దీంతో రూ.3లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని, ఐదేళ్లలో అనుకున్న విధంగా పూర్తిచేస్తే 7లక్షల మందికి ఉపాధి కలిగేదని అన్నారు. విద్యుత్ పీపీఏలను అనాలోచితంగా రద్దు చేసి అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేసి జగన్ రూ.9వేల కోట్ల నష్టం తెచ్చాడన్నారు. ఇసుకను తన సొంత కంపెనీకి ఇచ్చి లెక్కాపత్రం లేకుండా అనధికార రవాణా చేసి, రాష్ట్రంలో ఆకలికేకలతో భవన నిర్మాణ కార్మికులు అనుబంధ రంగాల వారు అలమటించేలా చేశాడన్నారు. ఇసుకలో రూ.10వేల కోట్లను దోచుకున్నాడన్నారు. జగన్ మనుషులు, మంత్రులు వేల ఎకరాల నిషేధిత భూములను కబ్జా చేశారని, రికార్డులు దొరక్కుండా రెవెన్యూ కార్యాలయాలను దహనం చేశారని ఆరోపించారు. ఎంపీ విజయసాయిరెడ్డి వైజాగ్‌లో చేసిన లీలలను ప్రజలు కథలుగా చెప్పుకొంటున్నారన్నారు. మద్యంలో నగదు రూపంలో జరిగిన రూ.99 వేల కోట్లు లావాదేవీలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియడం లేదన్నారు. రాష్ట్రానికి రూ.9.74లక్షల కోట్లు అప్పు ఉందని, పెండింగ్‌లో రూ.1.30లక్షల కోట్లు ఉన్నాయని, అవికాక మరో లక్ష కోట్లుఉన్నాయని తెలుస్తోందని నెట్టెం అన్నారు. రూ.12.93లక్షల కోట్లు ఆర్థిక విధ్వంసం జరిగిందని నెట్టెం ఆరోపించారు. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రం కోలుకోవటానికి చాలా సమయం పడుతుందన్నారు.

జగన్ పాలనలో రూ.12.93 లక్షల కోట్ల

ఆర్థిక విధ్వంసం: దేవినేని ఉమా

గొల్లపూడి, జూలై 27: ఐదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రూ.12,93,216 కోట్ల ఆర్థిక విధ్వంసం చేశారని మాజీమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజలపై 9,74,556 కోట్ల భారం మోపాడని దుయ్యబట్టారు. అడ్డగోలుగా అప్పులు చేసి ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టాడన్నారు. ప్రజలు 11 సీట్లకు జగన్‌ను పరిమితం చేస్తే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వండని సిగ్గులేకుండా న్యాయస్థానాలకు ఎక్కాడన్నారు. ప్రజలను నమ్మించేందుకు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండి మాట్లాడుతున్నాడన్నారు. మీడియా ముందుకు వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యం జగన్‌కు లేదన్నారు. ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలు చేరేలా టీడీపీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

11 నుంచి తిరుపతి,

విశాఖపట్నం రైళ్ల పునరుద్ధరణ

- రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ హామీ ఇచ్చారన్న ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నుంచి తిరుపతి, విశాఖపట్నానికి ఆగస్టు 11వతేదీ నుంచి రైళ్లను పునరుద్ధరిస్తామని రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ హామీ ఇచ్చారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రైళ్లను పునరుద్ధరించాలని అశ్వినివైష్ణవ్‌ను శనివారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించామని ఆయన పేర్కొన్నారు. మచిలీపట్నం- విజయవాడ మధ్య నడిచే పలు రైళ్లను వడ్లమన్నాడు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిలపాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదనలో ఉన్న వంతెనలు, గేట్లతోపాటు, పది ప్రాంతాల్లో రైల్వేఓవర్, అండర్‌బ్రిడ్జిల పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని మంత్రిని కోరినట్లు ఎంపీ తెలిపారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించి కనీస మౌలికవసతులు, సుందరీకరణ పనులు చేయాలని రైల్వేమంత్రిని కోరినట్లు తెలిపారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం

- రిస్క్ ప్రసవాలు విజయవాడకు రిఫర్
- ఆస్పత్రిలో చేసేందుకు సిద్ధంగా లేని వైద్యులు
- సాయంత్రం ఆరు దాటితే వైద్యసేవలు బంద్
- గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రి తీరిది

గుడివాడ: గుడివాడ చుట్టుపక్కల ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఏరియా ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చారు. ఆస్పత్రి అభివృద్ధి చెంది నూతన భవనాల్లోకి మారింది గానీ వైద్యసేవల్లో వైద్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సాయంత్రం 6గంటలు దాటితే వైద్యసేవలు బంద్ చేస్తారు. గర్భిణులకు రిస్క్ లేని ప్రసవాలకే వైద్యాన్ని అందిస్తారు. ప్రసవ సమయంలో ఏ చిన్న రిస్క్ వచ్చినా దానిని చాలెంజ్‌గా తీసుకుని వైద్య సేవలందించడానికి ఇక్కడి వైద్యులు సిద్ధంగా లేరు. గర్భిణిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబసభ్యులపై సిబ్బంది ఒత్తిడి తెస్తారు. తల్లీబిడ్డల్లో ఒకరికి ప్రమాదమని భయపెడతారు. చివరికి విజయవాడ వెళ్లేటట్టు చేస్తారు. ఇటీవల గుడివాడ మండలం మల్లాయిపాలెం గ్రామానికి చెందిన గర్భిణీకి ఇదే పరిస్థితి ఎదురైంది. ఏడాదిలో 20 రిస్క్ ప్రసవాలు ఆస్పత్రికి వస్తే అన్నింటినీ విజయవాడకు రిఫర్ చేశారు. శుక్రవారం కూడా రిస్క్ ప్రసవం ఆస్పత్రికి వస్తే విజయవాడకు రిఫర్ చేసినట్టు సమాచారం.



గుడివాడ ఏరియా ప్రభుత్వాస్పత్రి (ఫైల్)

అమర్యాదకర ప్రవర్తన

వైద్యం కోసం వచ్చిన రోగుల పట్ల కొందరు వైద్యులు, నర్సులు అమర్యాదగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. వారం క్రితం గుడ్లవల్లేరు మండలానికి చెందిన గర్భిణీకి ఇక్కడ సిజేరియన్ అయ్యింది. 10రోజుల్లోనే బాలింత మృతి చెందింది. దీంతో పసికందు అనాథగా విగిలిపోయింది. బాలింత మృతికి కారణాలు చెప్పేవారు లేరు.

జగన్ ప్రభుత్వ నిర్వాకంతోనే పెదవాగుకు భారీ నష్టం

- తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి శాశ్వత మరమ్మతులు: నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి

అశ్వారావుపేట, జూలై 27: రాష్ట్రాన్ని గత ప్రభుత్వ పాపం వెంటాడుతోందని, పెదవాగు ప్రాజెక్టుకు గండి పడి 12వేల ఎకరాల్లో పంటలు, భారీ ఆస్తి నష్టానికి జగన్ ప్రభుత్వంలో అవలంబించిన నిర్లక్ష్యవైఖరే కారణమని నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం రాష్ట్ర పరిధిలోని వేలేరుపాడు మండలంలో గోదావరి వరద, పెదవాగు నిర్వాసిత ప్రాంతాన్ని పరిశీలించడానికి వెళుతూ మంత్రులు రామానాయుడు, వంగలపూడి అనిత, కె.అచ్చెన్నాయుడు, కె.పార్థసారథి, పోలవరం, దెందులూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్ అశ్వారావుపేటలోని కెమిలాయిడ్స్ గెస్ట్ హౌస్‌లో కొద్దిసేపు ఆగారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మంత్రులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడారు. పెదవాగు ప్రాజెక్టును 2021లోనే గోదావరి బోర్డు స్వాధీనం చేసుకుని శాశ్వత మరమ్మతులకు రూ.80కోట్లు అంచనావేసి అనుమతులిచ్చిందని, అయితే అప్పటి సీఎం జగన్ ఈ ప్రాజెక్టుకు ఒక్కపైసా కూడా కేటాయించకపోవడంవల్ల నేడు ఈ భారీనష్టానికి దారి తీసిందని తెలి పారు. భారీగా పంటలు, పొలాలు నీట మునిగాయని, ఈ ఏడాది 12000 ఎకరాల్లో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఆస్తులు, పశునష్టం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.3.50కోట్లతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి రాష్ట్ర రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలి..ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులు ఎలా చేపట్టాలి..తాత్కాలిక మరమ్మతులతో చేయగలమా..అనేది చర్చిస్తున్నామన్నారు. త్వరలోనే ఓ నిర్ణయం తీసుకొంటామని మంత్రులు తెలిపారు.



పసుమర్తి కామేశ్వరశర్మ (ఫైల్), పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

పసుపర్తి కామేశ్వరశర్మ కన్నుమూత

- గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన ఆధ్యాత్మిక ప్రవచనకర్త

విజయవాడ లీగల్, జూలై 27: ఆధ్యాత్మిక ప్రవచనకర్త, శాస్త్ర, జ్యోతిష్య పండితుడు, విజయవాడ ఎలక్ట్రికల్ డీలర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పసుమర్తి కామేశ్వరశర్మ శనివారం తెల్లవారుజామున అయోధ్యనగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. శర్మకు భార్య రాజేశ్వరి, కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. కామేశ్వరశర్మ సంస్కృతాంధ్ర సాహిత్యాలు, సంగీత జ్యోతిష్యాది శాస్త్రాల్లో నిష్ణాతుడు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రవచనాలు చెప్పేవారు. 2023 ఏప్రిల్ 16న సౌత్‌ఆఫ్రికా తెలుగు అసోసియేషన్, జయహో భారతీయం సంస్థలు 'తెలుగు రత్న' పురస్కారం ఇచ్చి శర్మను సత్కరించాయి. 30 ఏళ్లుగా ఉచితంగా అందరికీ జ్యోతిష్యం చెబుతున్నారు. చివరిగా ఈనెల 20వ తేదీన శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ఆయనకు గురుపూజ చేసి 'సద్గురు' బిరుదుతో సత్కరించింది. ఆయన కుమారుడు అమెరికాలో ఉండడంతో అంత్యేష్టి కర్మలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. శర్మ పార్థివదేహానికి ఎమ్మెల్యే బొండా ఉమా శ్రద్ధాంజలి ఘటించారు. కామేశ్వర శర్మ లేని లోటు తీర్చలేనిదని బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరాంప్రసాద్(రాజా) అన్నారు. కామేశ్వరశర్మ మృతితో మధురవాక్కు మూగబోయిందని సీఎం చంద్రబాబు సెక్రటరీ రాజమౌళి ఆవేదన వ్యక్తంచేశారు. రాశిఫలాలు ఆయనంత మధురంగా చెప్పడం తానెక్కడా చూడలేదన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.



ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, గొండు శంకర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

సర్పంచ్‌ల పోరాటంతో వైసీపీ అడ్రస్ గల్లంతు

- పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, జూలై 27: "కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత అవసరాలకు వాడుకుంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు విలువ లేకుండా చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ నిధులు వెంటనే విడుదల చేయాలి. చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసిన కారణంగానే ఎన్నికల్లో వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది." అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘంలో సభ్యులుగా ఉండి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు మురళీని శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ నుంచి ఎంపీగా ఎన్నికైన కలిశెట్టి అప్పలనాయుడుకు అభినందనలు తెలిపారు. వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. "నిబద్ధత గల నాయకుడి వద్ద పనిచేస్తే గుర్తింపు దానంతట అదే వస్తుంది. రాజేంద్రప్రసాద్ సంఘంలో పనిచేయడం ద్వారా గ్రామాల సమస్యలపై పూర్తి అవగాహన వచ్చింది. పార్టీ గుర్తించి సీటు ఇచ్చింది" అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎప్పటి నుంచో ఉన్నా పోటీచేసి గెలుపొందడానికి స్ఫూర్తిని రాజేంద్రప్రసాద్ ఇచ్చారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. చాంబర్‌కు, సర్పంచ్‌ల సంఘానికి సహాయ సహకారాలందిస్తామని ఎమ్మెల్యేలిద్దరూ హామీ అన్నారు. చాంబర్ సభ్యులు, సర్పంచ్‌ల సంఘ నేతలు, పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్లిష్టమైన వ్యాధులకు ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు

- కార్డియాలజీ విభాగ వైద్యుడు బి.విజయచైతన్య



మాట్లాడుతున్న డాక్టర్ బి.విజయచైతన్య

ప్రభుత్వాసుపత్రి, జూలై 27: ఆనతికాలంలోనే అతి క్లిష్టమైన వ్యాధులకు సైతం చికిత్స అందించేస్థాయికి విజయవాడ ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి చెందిందని కార్డియాలజీ విభాగంలో ప్రధాన వైద్యుడు బి.విజయచైతన్య తెలిపారు. శనివారం ప్రభుత్వాస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిడమానూరుకు చెందిన గోపాలకృష్ణ(66) ఛాతీనొప్పితో ప్రైవేట్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారని, వైద్యులు యాంజియోగ్రామ్ చేసి, గుండె నరాల్లో 90 శాతం కాల్షియం బ్లాక్స్ ఉన్నాయని నిర్ధారించారని తెలిపారు. వైద్యానికి రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షలు అవుతుందని చెప్పడంతో ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్న గోపాలకృష్ణ ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చారన్నారు. రోటాబ్లేషన్ పద్ధతి కట్టింగ్ బెలూన్ ప్రొసీజర్ అనే ఆధునిక పద్ధతిలో బ్లాక్స్‌ను తొలగించి స్టంట్ వేశామన్నారు. చిలకలూరిపేటకు చెందిన ఎస్.సుధీన్‌బేగంకు ఎడమ చేతివేళ్లు కుళ్లిపోయిన స్థితిలో ఆస్పత్రిలో చేరగా లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని ప్రైవేట్ వైద్యులు తెలిపారని, ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ఆమె రెండునెలలుగా వ్యాధి ముదిరాక చివరికి నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చేరిందన్నారు. ఆమెకు ప్లాస్టిక్ సర్జరీ నిపుణుడు సీటీ పెరిఫెరల్ యాంజియోగ్రాం చేసి ఎడమ ఛాతీభాగం నుంచి భుజంలోకి వచ్చే రక్తనాళంలో లెఫ్ట్‌సబ్‌క్లేవియన్ ఆర్టెరీలో 90 శాతం నుంచి 95 శాతం రక్తనాళంలో అడ్డంగా ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఖర్చుతో సంబంధం లేకుండా ఎన్టీఆర్ వైద్య పథకం ద్వారా ఎడమ చేతి రక్తనాళం పునరుద్ధరించి స్టంట్ వేసి అతిక్లిష్టమైన ప్రక్రియను ఆస్పత్రి వైద్యబృందం విజయవంతంగా చికిత్సను పూర్తిచేసిందన్నారు. సమావేశంలో సేఫ్‌క్యార్ ల్యాబ్ డైరెక్టర్ పర్చూరి సాయికుమార్, వైద్యులు కావ్య శ్రీహరి, నాగేశ్వరరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.



పరిటాల రాతి క్వారీ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

క్వారీ మృతుల కుటుంబాలకు

రూ.50 లక్షల పరిహారమివ్వాలి

కంచికచర్ల రూరల్, జూలై 27: పరిటాల రాతిక్వారీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి ఒక్కొక్కరి కుటుంబానికి రూ.50 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం క్వారీని సీపీఐ జిల్లా బృందం పరిశీలించి, ధర్నా చేసింది. జిల్లాలో భద్రతాప్రమాణాలు పాటించని పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం 99 క్వారీలకు అనుమతి ఇస్తే అనధికారికంగా మరో 50క్వారీలు నడుస్తున్నాయన్నారు. క్వారీలో చనిపోయిన రాందేవ్ బాగేల్ కుటుంబానికి రూ.16,89,150 పరిహారం ఇవ్వాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించి వారాలు దాటినా ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. మృతుల కుటుంబాలను అధికార, ప్రతిపక్షనాయకులు ఎవ్వరూ పరామర్శించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆగస్టు 2న క్వారీ ప్రమాదాలు, కాలుష్యంపై ఇబ్రహీంపట్నం రింగ్‌లో ధర్నా చేస్తామని శంకర్ తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుడ్డి రమేష్, చుండూరు సుబ్బారావు, పరుచూరి రాజేంద్రబాబు, మల్నీడు యలమందలరావు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌సీ వీడ్కోలు సభకు

విరాళాలు కోరడం లేదు

- ఫంక్షన్ పేరుతో వసూళ్లు చేసే వారితో అప్రమత్తంగా ఉండండి
- ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎల్‌డీవీ సంతోష్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ ఆర్వీ కృష్ణారెడ్డి పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా నిర్వహించే వీడ్కోలు సమావేశం కోసం ఇంజనీరింగ్ సభ్యులు, జిల్లా శాఖల నుంచి విరాళాలుగా కానీ, ఇతర రూపాల్లో గానీ ఏమీ కోరటం లేదని ఏపీఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీఎల్‌డీవీ సంతోష్‌రెడ్డి తెలిపారు. 'విరమణ పేరిట సమర్పణ' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. తమ సంఘం పేరుతో ఎవరైనా వసూళ్లు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజనీర్ల సంఘం పేరుతో ఎవరైనా వసూలు చేసి ఉంటే వారికి సంఘానికి సంబంధం లేదన్నారు. సంఘం తరఫున వసూళ్లు చేసే వారిపై జిల్లా శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంఘం తరఫున ఈఎన్‌సీకి ఎలాంటి విలువైన కానుకలు ఇవ్వటం లేదని తెలిపారు.

జగన్‌తో ఢిల్లీలో ధర్నా చేయించింది మోదీనే: చింతా మోహన్

ధర్నాచౌక్, జూలై 27: ప్రధాని మోదీకి వైసీపీ అధ్యక్షుడు జగన్ బిడ్డలాంటోడని, ఆయన అనుమతిచ్చి ఢిల్లీలో జగన్‌తో ధర్నా చేయించారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. జగన్ ఎందుకు ధర్నాచేశావ్? ఓడిపోయినందుకా..సానుభూతి కోసమా? అని ప్రశ్నించారు. ఢిల్లీ ధర్నాతో జగన్ అభాసుపాలయ్యారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అప్పట్లో సీఎం చంద్రబాబును కొట్టాడని జగన్ వ్యాఖ్యానించడం అబద్ధమన్నారు. వారిద్దరు చదువుకునే రోజుల్లో చెరొక గ్రూపునకు నాయకత్వం వహించేవారన్నారు. ఒక్క చాన్స్ అని అడిగిన జగన్‌కు ప్రజలు ఒక్కచాన్స్ ఇచ్చారన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో ఒక్క పైసా గ్రాంట్‌గా నిధులు మంజూరు చేయలేదన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని చెప్పడం బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శన మన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పక్క రాష్ట్రాల్లో నవ్వుకుంటున్నారన్నారు. రాష్ట్ర అప్పులపై వాస్తవాలు తెలిపేందుకు నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. 2024 ఎన్నికల తర్వాత చంద్రబాబు బాహుబలి అయ్యారన్నారు.

అధికారుల తీరు మారాల్సిందే

- జడ్పీ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం:

కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న అధికారుల పనితీరుపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50రోజులపైనే అయిందని, కలెక్టర్ మినహా మిగిలిన అధికారుల తీరు మారలేదని, తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వారు అన్నారు. సమస్యలపై అధికారులతో మాట్లాడితే రూల్ పొజిషన్ చెబుతున్నారే తప్ప, సమస్యలను పరిష్కరించేందుకు ఆసక్తి చూపడం లేదని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.

ఇప్పటికీ కొందరు అధికారులు వైసీపీ నాయకులకు అనుకూలమే

వైసీపీ నాయకులకు మేలుచేయాలని కొందరు అధికారులు గతంలో మచిలీపట్నం నియోజకవర్గంలో దొంగ ఇంటి పట్టాలను విచ్చలవిడిగా మంజూరు చేశారు. దీనిపై ఇప్పటికే విచారణకు ఆదేశించాం. మరికొందరు నేటికీ వైసీపీ నాయకులకు అనుకూలంగానే పనిచేస్తున్నారు. వారు రాష్ట్రంలో ఎక్కడ పనిచేసినా వదలిపెట్టం. కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో భూఆక్రమణలు, ఇతరత్రా అంశాల్లో నిజాలు వెలుగులోకి రాకుండా వైసీపీ నాయకులకు అనుకూలంగా కొందరు రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారు. కలెక్టర్ దృష్టిసారించాలి. - మంత్రి కొల్లు రవీంద్ర

తీరప్రాంతానికి సాగునీరందించాలి



వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటిని సక్రమంగా విడుదల చేయకపోవడంతో అవనిగడ్డ నియోజకవర్గంలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో 5వేల ఎకరాల్లో గతేడాది పంటలు సాగుచేయలేదు. ఈ ఏడాదీ అదే పరిస్థితి ఉండేలా నీటి పారుదలశాఖ అధికారుల వ్యవహారశైలి కనిపిస్తోంది. అవనిగడ్డ నియోజకవర్గంలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌ల నిర్మాణానికి అంచనాలు ఇప్పటికీ రూపొందించకపోతే ఎలా? డ్రెయినేజీలు, పంటకాలువల నిర్వహణ పనులను సక్రమంగా చేయడం లేదు.

- మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే

అధికారులు అందుబాటులో ఉండరు



జిల్లాలో కలెక్టర్ మినహా మిగిలిన అధికారులెవరూ ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండటం లేదు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరితే అధికారులు సరైన విధంగా స్పందించడం లేదు. మల్లవల్లిలో పారిశ్రామికవాడలో పరిశ్రమల అభివృద్ధికి సహరించాలి.

- యార్లగడ్డ వెంకట్రావ్, గన్నవరం ఎమ్మెల్యే

తాగునీటి చెరువులు నింపలేదు



ఇటీవల జిల్లాలో భారీవర్షాలు కురిశాయి. కాలువలకు తాగునీటి అవసరాలకోసం నీటిని విడుదల చేశారు. అయినా తాగునీటి చెరువులు నింపలేదు. ప్రశ్నిస్తే కాలువలద్వారా నీరు రావడంలేదని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారులు ఇంకా వైసీపీ నాయకుల బాటలోనే ప్రయాణం చేయడం బాధాకరం. ఎమ్మెల్యేలకు అధికారులు అందుబాటులో ఉండాలి. గుడివాడ ఏరియా ఆస్పత్రిలో ఇటీవల ఇద్దరు బాలింతలు మరణిస్తే వారు ఏ కారణాలతో మరణించారో వైద్యశాఖ అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

- వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యే

సాగునీరు సక్రమంగా అందించడం లేదు



సాగునీటి విడుదలలో నీటిపారుదలశాఖ అధికారులకు సరైన అంచనాలు లేవు. పామర్రు నియోజకవర్గంలోని పంటపొలాలకు సాగునీటిని అందించాలని కోరితే అధికారులు స్పందించడం లేదు. నియోజకవర్గంలోని ఐనంపూడి డ్రెయిన్‌లో పూడికతీయాలని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులు తీరు మరీ విడ్డూరంగా ఉంది. నిమ్మకూరు పాఠశాలలో లెక్కల మాస్టారును మరో పాఠశాలకు పంపారు. ఈ మాస్టారును ఇక్కడకు పంపాలని విద్యాశాఖ అధికారులకు మూడుసార్లు వినతిపత్రాలుఇచ్చినా, ఏడుసార్లు ఫోన్‌లో మాట్లాడినా ఇంతవరకు ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయలేదు.

- వర్ల కుమార్‌రాజా, పామర్రు ఎమ్మెల్యే

రూల్‌పొజిషన్ చెప్పి తప్పించుకుంటున్నారు



పెడన నియోజకవర్గం మొత్తం వ్యవసాయం, ఆక్వాసాగు ఆధారిత ప్రాంతం. గ్రామాల్లో సమస్యలపై అధికారులతో మాట్లాడితే రూల్ పొజిషన్ చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదు. కాలువ శివారు ప్రాంతంలో ఉన్న పెడన నియోజకవర్గంలోని మండలాలకు సాగునీటిని అందించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు.

-కాగిత కృష్ణప్రసాద్, పెడన ఎమ్మెల్యే

విజయవాడ
● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ
www.andhrajyothy.com

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

తెలుగు మహిళల ఆధ్వర్యంలో గంగానమ్మకు ఆషాఢ సారె



పటమట, జూలై 27 : పటమట 13వ డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు అడ్డకట్టు రామారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు శనివారం ఉదయం పటమట గంగానమ్మకు సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అడ్డుకట్ల పద్మావతి, ముమ్మనేని నీరజ, నాగకీర్తి, నాగ రజని, వి. భవానీ, ఎం. చైతన్య మణి, ఎన్.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

యువతకు ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి

పాయకాపురం, జూలై 27 : పేపర్ బాయ్ నుంచి ప్రెసిడెంట్ వరకు ఎదిగిన ఏపీజే అబ్దుల్ కలాం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం ప్రకాష్‌నగర్ సెంటర్‌లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఖాజా, అలీ, కాలేషా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో ...

భారతీనగర్: ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు శనివారం అరండల్‌పేటలోని వీఎంసీ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయోలా విద్యార్థులు కలాం జీవిత గాథను విద్యార్థులకు వివరించారు. ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఉర్దూ ప్రైమరీ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నాగుల్ మీరా



ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

చంద్రబాబు మొక్కలు నాటితే...జగన్ చెట్లు నరికించాడు

ఎమ్మెల్యే గద్దె



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గద్దె

మాచవరం, జూలై 27 : జన్మభూమి, శ్రమదానం, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేర్లతో చంద్రబాబు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పర్యటనలతో పేరుతో ఆయా ప్రాంతాల్లో పెద్ద పెద్ద వృక్షాలను నరికించేశాడని విమర్శించారు. 6వ డివిజన్ మారుతీనగర్‌లో శనివారం గ్రీన్ ఇండియా మిషన్ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

వన్‌టౌన్: సకల జీవరాశుల మనుగడకు స్వచ్ఛమైన గాలి, నీరు అవసరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ స్కూల్‌లో శనివారం మొక్కను నాటుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటిన తరువాత అవి ఏపుగా పెరిగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 37వ డివిజన్‌లో మండేపూడి చటర్జీ, ప్రధానోపాధ్యాయురాలు పి.నీరజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందజేత



గవర్నర్‌పేట, జూలై 27: సీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని బాలికల జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అందజేశారు. వీటితో పాటు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన రెండు జతల యూనిఫాంలను విద్యార్థులకు అందించారు. ఫస్టియర్ బైపీసీలో 440 మార్కులకు 400 మార్కులు సాధించిన చంద్రశ్రీ అనే విద్యార్థినికి బొండా ఉమా తన సొంత నిధుల నుంచి రూ. 5 వేలు నగదు బహుమతి అందజేశారు. స్థానిక కార్పొరేటర్ బాలస్వామి, తెలుగు యువత జిల్లా కార్యదర్శి కోటి, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నెహ్రూ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వానికి ప్రజాదరణ

నగర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

భవానీపురం, జూలై 27 : నగరంలో జనసేన పార్టీ సభ్యత్వానికి ప్రజాదరణ బేషుగ్గా ఉందని నగర జనసేన ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ తెలిపారు. సితార సెంటర్ వద్ద 45వ డివిజన్‌లో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం శివప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన క్రియాశీల సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల విలువైన ప్రమాద బీమా లభిస్తుందన్నారు. జనసేన నాయకులు మర్రికృష్ణ, తంగా రవి, పెద్దిరెడ్ల సతీష్, మానుకొండ సాయికుమార్, దుర్గారావులు పాల్గొన్నారు.

సాయం చేయడంలో టీడీపీ ముందంజ

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్: టీడీపీ అంటే కేవలం రాజకీయాలు చేయడమే కాదని, అవసరమైన వారికి సాయం అందించడంలో ముందుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. నాల్గవ డివిజన్‌కు చెందిన తుళ్లూరి నాగరాజు ఇటీవల మరణించగా అతని ఇద్దరు పిల్లల స్కూలు ఫీజు నిమిత్తం రూ.10వేలు, ఇటీవల మరణించిన జట్టురమణ కుంటుబానికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గద్దె సొంత నిధులతో శనివారం నాల్గవ డివిజన్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్, పోలా మన్మధరావు, గద్దె రమేష్, మట్ట నాగేశ్వరరావు, పొట్లూరి దర్శిత్ పాల్గొన్నారు.

టీటీలో మౌతి, మిషికల సత్తా



విజయవాడస్పోర్ట్స్, జూలై 27 : సికింద్రాబాద్‌లో ఈ నెల 25, 26 తేదీల్లో 12వ రుక్మిణి భాయ్ స్పోర్ట్స్ అకాడమీ ఇంటర్ స్కూల్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో వన్‌టౌన్ అట్కిన్‌సన్ సెకండరీ స్కూల్‌లో చదువుతున్న అక్కా చెల్లెళ్లు జి. మౌతి, మిషికలు సత్తా చాటారు. వీరిద్దరూ తెలంగాణ, ఏపీ స్టేట్ స్కూల్ టీమ్ జూనియర్ విభాగంలో రన్నరప్‌ను సాధించారు. ఇద్దరు క్రీడాకారులు స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ పి. రజిత, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి



వన్‌టౌన్, జూలై 27: ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి చెప్పారు. వన్‌టౌన్ గాంధీజీ మహిళా కళాశాలలో విద్యార్థులకు శనివారం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యువత తమ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలన్నారు. అనుమానాస్పద లింక్‌లు, మెస్సేజీలకు కనెక్ట్ కావద్దని హెచ్చరించారు. సైబర్ క్రైం సీఐ కే.శ్రీనివాసరావు, కళాశాల ఉపాధ్యక్షుడు కె. పిచ్చయ్య,ప్రిన్సిపాల్ ఎం. రమణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం: పైపుల రోడ్డు వద్ద గల ఓ ప్రైవేట్ కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐ ఎన్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పాయకాపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు

పాయకాపురం, జూలై 27 : పాయకాపురంలోని అక్షర నందన స్కూల్‌లో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాల్గవ అదనపు సీనియర్ న్యాయమూర్తి పి. రాజారామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. బాలల హక్కులు, విద్యా హక్కు చట్టం తదితర అంశాలపై ప్రసంగించారు. న్యాయ సేవల అధికారి పి. రాము, కెఎస్. జయకుమార్, ఎంహెచ్. రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాప్

లబ్బీపేట, జూలై 27: నలంద డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం డేటావ్యాలీ ఐటీ సొల్యూషన్స్ హెచ్‌ఆర్ కె.అనుపమ మాట్లాడుతూ కంప్యూటర్స్ సైన్స్ కోర్సుకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, బీఎస్సీ రెండవ సంవత్సరం విద్యార్థులు 200మంది కంప్యూటర్ అండ్ సైన్స్ హెచ్‌వోడీ పి.భవాని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి, ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస చక్రవర్తి

పటమట, జూలై 27 : కనకదుర్గమ్మ సారె సమర్పించడానికి పార్వతీపురం నుంచి వస్తున్న విశ్వ బ్రాహ్మణుల సంఘం బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన మహిళా కుటుంబాన్ని, గాయపడ్డ వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి కోరారు. కనకదుర్గమ్మకు సారె సమర్పించడానికి వస్తున్న బస్సు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 23 మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి విజయవాడ కొత్త ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి పరామర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పండ్లు, ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళకు రూ.25 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.10లక్షలు, స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యనిర్వాహణాధికారి పెదప్రోలు బ్రహ్మం, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వాతావరణంలో ఉద్గారాలను తగ్గించేందుకు కృషి

●వీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 27 : నగర వాతావరణంలో ఉద్గారాలను తగ్గించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ తగు చర్యలు తీసుకుంటుందని వీఎంసీ అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఏ. మహేష్ తెలిపారు. వీఎంసీతో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేట్ సౌత్ ఏషియా సీ-40 వాతావరణంలో వచ్చే మార్పులపై -నగరం ఎదుర్కొంటున్న సవాళ్లపై శనివారం నూతన కార్యాలయంలో సమావేశం జరిగింది. అదనపు కమిషనర్(ప్రాజెక్టు) కేవీ సత్యవతి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఏపీ రవాణాశాఖ, ఐవోసీఎల్, ఏపీఎస్ఆర్టీసీ, మేఘ గ్యాస్, బీపీసీఎల్, హెచ్‌సీఎల్, హెల్త్‌కేర్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం, జూలై 27 : కేఎల్‌రావు హెడ్‌వాటర్ వర్క్స్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ కుమ్మరిపాలెం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు కుమ్మరిపాలెం సెంటర్, కొట్టేటి కోటయ్య వీధి, నాలుగుస్తంభాల సెంటర్, గుప్తా సెంటర్, సాయిబాబ టెంపుల్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ తెలిపారు.

పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చుకోండి

కమిషనర్ ధ్యానచంద్ర



కేఎల్ రావు పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర

చిట్టినగర్, జూలై 27: పరిసరాల పరిశుభ్రతతోపాటు పారిశుధ్య నిర్వహణను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నగర కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శనివారం 46, 47, 48 డివిజన్లలో పారిశుధ్య పనులతో పాటు పార్కులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తొలుత 48వ డివిజన్ రాయప్ప రాజువీధి కొండప్రాంతంలో పర్యటించి అక్కడ పారిశుధ్య నిర్వహణను పరిశీలించి డ్రెయిన్లలో మురుగునీరు పారుదలకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చెత్త వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలగిస్తుందీ లేనిది స్థానికులను అడిగి తెలుసుకొని, ప్రతిరోజు మ్యాపింగ్ ద్వారా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కేఎల్ రావు పార్కు, స్విమ్మింగ్ పూల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో వాకింగ్ ట్రాక్‌తోపాటు జిమ్, షటిల్ కోర్టు అందుబాటులోకి తీసుకురావాలని వాకర్స్ కోరగా కమిషనర్ స్పందించి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. చిట్టినగర్ గుజ్జారి ఎల్లారావు మార్కెట్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో అదనపు కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ.మహేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, ఈఈ-1 ఏఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సురేష్‌బాబు, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు టీడీపీ కార్పొరేటర్ల సత్కారం

చిట్టినగర్, జూలై 27: నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న హెచ్‌ఎం ధ్యానచంద్రను శనివారం వీఎంసీ కార్యాలయం ఆయన చాంబర్‌లో టీడీపీ ఫ్లోర్‌లీడర్ ఎన్.బాలస్వామి, కార్పొరేటర్లు ముమ్మనేని వెంకట ప్రసాద్, ఉమ్మడి వెంకటేశ్వరరావు, చెన్నుపాటి ఉషారాణి, రామ్మోహన్ రావు, అపర్ణ తదితరులు కలసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.జాయింట్ కలెక్టర్ నిధి మీనా నూతన కమిషనర్ ధ్యానచంద్రను కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.


శాకంబరీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



పటమట, జూలై 27 : నగరంలోని పటమట దత్త పీఠంలో మరకత రాజరాజేశ్వరి అమ్మవారు శనివారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. మరకత రాజరాజేశ్వరి అమ్మవారికి అనేక రకాల కూరగాయలు, పండ్లు, పువ్వులతో శోభాయమానంగా అలకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది.

విజయవాడ	: అలంకార్ 4k	పైకలూరు	: మాగంటి థియేటర్
విజయవాడ	: జె3 రాజ్ యువరాజ్	బంటుమిల్లి	: శ్రీదుర్గా పి.ప్యాలెస్
విజయవాడ	: ఊర్వశి INOX	ఉయ్యూరు	: అంజనాసినీమ్యాక్స్
ఎం.జి.రోడ్డు	: లైలా INOX	పామర్రు	: శ్రీకృష్ణాటాకీస్
లబ్బీపేట	: పివిఆర్ సినిపోలిస్	నూజివీడు	: ద్వారక కాంప్లెక్స్
లబ్బీపేట	: పివిఆర్ సినిమాస్	ఆగిరిపల్లి	: అనుడీలక్స్
బెంజిసర్కిల్	: క్యాపిటల్ సినిమాస్	ఇబ్రహీంపట్నం	: బాలాజీఐకానియా
పటమట	: LEPL INOX	కొండపల్లి	: శివకృష్ణ
అశోక్‌నగర్	: పవర్1 సినిమాస్	కంచికచర్ల	: శ్రీనివాస
వన్‌టౌన్	: శ్రీ సౌమ్య	నందిగామ	: లక్ష్మీప్రసన్న
పాయకాపురం	: తారాస్క్రీన్స్	జగ్గయ్యపేట	: శ్రీఅలంకార్‌సినిమాస్
పాయకాపురం	: రవీంద్రసినిమాస్	మైలవరం	: నారాయణ థియేటర్
కానూరు	: శ్రీ విజయలక్ష్మి	తిరువూరు	: శ్రీకృష్ణాటాకీస్
పోరంకి	: బాలాజీసినివిల్లా	విస్సన్నపేట	: శ్రీరామ్
కంకిపాడు	: శ్రీరామచంద్ర	గంపలగూడెం	: రామమోహన్
ఉయ్యూరు	: దీపక్‌మహల్		
పామర్రు	: గగన్‌మహల్		
కూచిపూడి	: సత్యసాయి		
చల్లపల్లి	: సాగర్		
అవనిగడ్డ	: వెంకటేశ్వర		
మచిలీపట్నం	: రేవతి పి. ప్యాలెస్		
మచిలీపట్నం	: PVR వరం సెంట్రల్‌మాల్		
గుడివాడ	: ABR కాంప్లెక్స్		
గుడివాడ	: జె3సెంథూర		
పెడన	: శ్రీకృష్ణతులసి		
గుడ్లవల్లేరు	: రామకృష్ణ		


studio green
STUDIO GREEN FILMS (P) LTD.
K.E.GNANAVELRAJA & AADHANA GNANAVELRAJA
ALLU SIRISH'S
బడ్డీ
WRITTEN & DIRECTED BY
SAM ANTON
PRODUCED BY
KE GNANAVELRAJA
AADHANA GNANAVELRAJA
IN CINEMAS
AUGUST 2ND
Junglee


కనిపించేదంతా మున్నేత్రుడి మర్మమే
1ST AUG
IN THEATRES
శివం భజే
MAHESWARA REDDY MOOLI
APSAR


VIJAYA BHASKAR KRAFT
ఆగస్టు
2
బ్రహ్మాండమైన
విడుదల
A VIJAYA BHASKAR'S FILM
SREE KAMAL
TANVI AKAANKSHA
ఉషాపరిణయం
Love is Beautiful..!
WRITTEN, PRODUCED & DIRECTED BY
VIJAYA BHASKAR K
DOP SATISH MUTYALA
MUSIC RR DHRUVAN
Pre Release Event
ON SUNDAY
28.7.2024


INFINITI FILM VENTURES
IN THEATRES
AUGUST 2ND
VIJAY ANTONY
తుఫాన్
S.D.VIJAY MILTON
KAMAL BOHRA | D. LALITHAA | B PRADEEP | PANKAJ BOHRA
ANDHRA PRADESH & NIZAM THEATRICAL RIGHTS CONTROLLED BY: PADMAKAR CINEMAS


SVC RELEASE
అలనాటి
రామచంద్రుడు
IN CINEMAS
AUG 2nd


DHANUSH
MASSIVE
BLOCKBUSTER
KALANITHI MARAN
PRESENTS
DHANUSH
రాయన్
WRITTEN AND DIRECTED BY DHANUSH
AN A R RAHMAN MUSICAL


AUGUST
2ND
IN THEATERS
తిరగబడరసామీ...
MALKAPURAM SHIVAKUMAR
A S RAVIKUMAR CHOWDARY

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)





ఓవైపు సహచర షూటర్లు వరుస బెట్టి నిరాశపరుస్తున్నా.. యువ షూటర్ మను భాకర్ మాత్రం అంచనాలను నిలబెట్టుకుంది. తొలిరోజు పోటీల్లో ఆఖరున బరిలోకి దిగిన భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సూపర్ ప్రదర్శనతో పతక ఆశలను రేపింది. టోక్యో గేమ్స్‌లో చేదు అనుభవాన్ని అధిగమిస్తూనే.. 20 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డుకెక్కింది. మరో రెండు విభాగాల్లో మాత్రం ఇతర షూటర్ల ప్రదర్శన అర్హత రౌండ్లలోనే ముగిసింది.

మను అదరహో

10 మీ. ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు

నిరాశపర్చిన ఇతర షూటర్లు ● భాకర్ స్వర్ణ పోరు నేడు

పారిస్: ఒలింపిక్స్ తొలి రోజు షూటింగ్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మను భాకర్ మినహా తొలి రోజు శనివారం బరిలోకి దిగిన విభాగతా షూటర్లంతా గురి తప్పారు. మొదట 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో, ఆ తర్వాత 10మీ. పురుషుల ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లోనూ అంతా విఫలమయ్యారు. అయితే 22 ఏళ్ల భాకర్ మాత్రం కెరీర్‌లో తొలిసారి ఒలింపిక్ ఫైనల్‌కు చేరగలిగింది. సాయంత్రం ఆరంభమైన 10 మీ. మహిళల ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్స్‌లో 580.27 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. మేజర్ వెరోనికా (582.22, హంగెరీ), ఒహ్ యే జిన్ (580.20కొరియా) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. దీంతో 20 ఏళ్ల తర్వాత ఒలింపిక్ ఫైనల్‌కు చేరిన భారత మహిళా షూటర్‌గా మను నిలిచింది. 2004 ఏథెన్స్‌లో సుమ శిరూర్ 10మీ. ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. ఇక ఆరు సిరీస్‌ల పాటు జరిగిన అర్హత పోటీలో మను మొత్తంగా 60 షాట్లు సంధించగా వరుసగా 97, 97, 98, 96, 96, 96 పాయింట్లు సాధించింది. మరోవైపు మను సహచర షూటర్ రిథమ్ సంగ్వాన్ మాత్రం 15వ స్థానంలో నిలిచింది. టాప్-8 షూటర్లు మాత్రమే ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధిస్తారు.



సరబ్‌జోత్ అన్‌లక్కీ..



రమిత

షూటింగ్‌లో ముందుగా జరిగిన 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో రమిత జిందాల్-అర్జున్ బబుత జోడీ 628.70 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. అదే పోటీలో పాల్గొన్న సందీప్ సింగ్-ఎలవేనిల్ వలరివన్ జోడీ 626.30 పాయింట్లతో మరింత నిరాశపరుస్తూ 12వ స్థానంలో నిలిచి నిష్క్రమించక తప్పలేదు. అయితే 10మీ. ఎయిర్ పిస్టల్‌లో మాత్రం 22 ఏళ్ల సరబ్‌జోత్ సింగ్ తొమ్మిదో స్థానంలో నిలిచి కాస్తలో ఫైనల్ చాన్స్ చేజార్చుకున్నాడు. జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్‌తో సరబ్ 577 పాయింట్లతో సమంగా నిలిచాడు. కానీ సరబ్ కన్నా ప్రత్యర్థి కేవలం ఒక్క ఇన్నర్ టెన్స్‌ను సాధించడంతో నిరాశ తప్పలేదు. ఇదే పోటీలో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా 574 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచాడు.

తొలిరోజు భారత్ భళా

సాత్విక్ జోడీ, లక్ష్య ముందంజ



బ్యాడ్మింటన్

పారిస్: ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సాత్విక్ జోడీ శుభారంభం చేసింది. గ్రూప్-సిలో జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్ తొలి మ్యాచ్‌లో మూడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 21-17, 21-14తో ఫ్రాన్స్‌కు చెందిన లూకాస్ కోర్వీ-రోనన్ లబార్‌పై వరుస గేముల్లో సునాయాసంగా గెలిచింది. సోమవారం జరిగే రెండో గ్రూప్ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన మార్క్-మర్విన్‌తో సాత్విక్ జోడీ తలపడనుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగిన ఏస్ షట్లర్ లక్ష్య సేన్ బోణీ చేశాడు. పురుషుల సింగిల్స్ గ్రూప్-ఎల్‌లో జరిగిన మ్యాచ్‌లో సేన్ 21-8, 22-20తో టోక్యో సెమీఫైనలిస్ట్ కెవిన్ కార్డన్ (గ్వాటిమాల)పై వరుస గేముల్లో నెగ్గాడు. సోమవారం జరిగే రెండో గ్రూప్ మ్యాచ్‌లో జూలియన్ క్రెయిగ్ (బెల్జియం)తో సేన్ తలపడనున్నాడు. కాగా, మహిళల డబుల్స్ తొలిరౌండ్లో భారత జంట అశ్విని పొన్నప్ప-తనీషా 18-21, 10-21తో కొరియా ద్వయం కాంగ్-కిమ్ చేతిలో ఓటమిపాలైంది.

టీటీ: హర్మీత్ ముందంజ

టేబుల్ టెన్నిస్‌లో హర్మీత్ దేశాయ్ రెండో రౌండ్‌కు చేరుకొన్నాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో హర్మీత్ 4-0తో జైద్ అబూ యమన్ (జోర్డాన్)ను చిత్తు చేశాడు.

బోపన్న పోరు నేటికి వాయిదా

టెన్నిస్

రోహన్ బోపన్న-శ్రీరామ్ బాలాజీ పురుషుల టెన్నిస్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్ వర్షం కారణంగా ఆదివారానికి వాయిదా పడింది. ఫ్రాన్స్‌కు చెందిన మోన్‌ఫిల్స్-రోజర్ వస్సెలి జోడీతో బోపన్న ద్వయం తలపడనుంది.



రోయింగ్

రెపిచేజ్‌కు పన్వర్

రోయింగ్ పురుషుల సింగిల్ స్కల్ హీట్-1లో నాలుగో స్థానంలో నిలిచిన బల్‌రాజ్ పన్వర్ రెపిచేజ్‌కు అర్హత సాధించాడు. థామస్ మకింతోష్ (న్యూజిలాండ్), స్టెఫనోస్ ఎన్‌టౌస్‌కోస్ (గ్రీస్), అబ్దుల్‌ఖలేక్ ఎల్బనా (ఈజిప్ట్) తొలి మూడు స్థానాల్లో నిలిచి క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. రెపిచేజ్ ద్వారా పన్వర్.. సెమీస్ లేదా ఫైనల్‌కు చేరుకొనేందుకు రెండో అవకాశం దక్కుతుంది.

హాకీ: గెలుపుతో మొదలెట్టారు



చివరి నిమిషాల్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్‌తో ఒలింపిక్స్‌ను భారత హాకీ జట్టు విజయంతో ఆరంభించింది. గ్రూప్-బిలో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో న్యూజిలాండ్‌ను ఓడించింది. 59వ నిమిషంలో కివీస్ జట్టు ఫౌల్ చేయడంతో టీవీ ఇండియాకు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని హర్మన్ గోల్‌గా మలచి జట్టును గెలిపించాడు. మన్‌దీప్ సింగ్ (24వ), వివేక్ సాగర్ (34వ) చెరో గోల్ సాధించారు. న్యూజిలాండ్ తరఫున సామ్ లేన్ (8వ), సైమన్ ఛైల్డ్ (53వ) గోల్స్ చేశారు. గత క్రీడల్లో భారత్ కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.

పారిస్‌లో నేటి భారతం



బాక్సింగ్: మహిళల 50 కిలోల ప్రిలిమినరీ రౌండ్ - నిఖత్ జరీన్ x మ్యాక్సీ కరీనా లోట్జెర్ (జర్మనీ) రా. 12.05.

టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ (రెండో రౌండ్) - ఆకుల శ్రీజ x క్రిస్టీనా కాల్‌బెర్గ్ (స్వీడన్) (మ.12.15). సింగిల్స్ (రెండో రౌండ్) - మనికా బాత్రా x అన్నాహర్సే (బ్రిటన్) మ. 12.15. పురుషుల సింగిల్స్ (రెండో రౌండ్) - శరత్ కమల్ x డినీ కోజుల్ (స్లొవేనియా) మ. 3.

షూటింగ్: మహిళల 10 మీ., ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ - ఎలవెనిల్ వలరివాన్ (మ. 12.45). పురుషుల 10 మీ., ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ - సందీప్ x అర్జున్ (మ. 2.45).

రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ (రెపిచేజ్ 2) - బల్‌రాజ్ పన్వర్ (మ. 1.18).

బ్యాడ్మింటన్: మహిళల సింగిల్స్ (గ్రూప్ స్టేజ్) పీవీ సింధు x ఫాతిమా అబ్దుల్ రజాక్ (మాల్దీవులు) మ. 12.50. పురుషుల సింగిల్స్ (గ్రూప్ స్టేజ్) ప్రణయ్ x ఫాబియాన్ రోత్ (జర్మనీ) రా. 8.

స్విమ్మింగ్: పురుషుల 100 మీ., బ్యాక్‌స్ట్రోక్ (హీట్-2) శ్రీహరి నటరాజ్ (మ. 3.16). మహిళల 200 మీ., ఫ్రీస్టయిల్ (హీట్ 1) దిహిందీ దేశింగు (మ. 3.30).

ఆర్చరీ: మహిళల టీమ్ క్వార్టర్ ఫైనల్స్ - అంకిత భక్త్, భజన్ కౌర్, దీపిక కుమారి (సా. 5.45). సెమీఫైనల్స్ (రా. 7.17).

పతక ఈవెంట్లు

షూటింగ్: మహిళల 10 మీ., ఎయిర్ పిస్టల్ ఫైనల్ - మనుభాకర్ (మ 3.30).

ఆరంభ వేడుకలు అభాసుపాలు!

అభ్యంతరకర ప్రదర్శనలు

- కొన్ని అపశ్రుతులు
- పారిస్ క్రీడల ప్రారంభోత్సవంపై వివాదం



పారిస్: సంప్రదాయానికి భిన్నంగా..సెన్ నదిపై బోట్లమీద అథ్లెట్లు పరేడ్ చేయడం ద్వారా ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. 205 దేశాల క్రీడాకారులతోపాటు, ప్రత్యక్షంగా తిలకించిన లక్షలాది మందికి, విశవ్యాప్తంగా పరోక్షంగా వీక్షించిన కోట్లాదిమందికి ప్రారంభ కార్యక్రమం కొత్త అనుభూతి పంచింది. అయితే ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు వివాదం రేపాయి. అంతేకాకుండా..దక్షిణ కొరియా పేరును తప్పుగా పలకడం, ఒలింపిక్స్ జెండాను తలకిందులుగా ఎగురువేయడం వంటి వివాదాలూ చుట్టుముట్టాయి. సాంస్కృతిక కార్యక్రమాలపై నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆక్షేపణలు వ్యక్తంజేస్తున్నారు. ఇవి క్రైస్తవులను కించపరిచేలా ఉన్నాయని ధ్వజమెత్తుతున్నారు. శిలువకు ముందు ఏసు క్రీస్తు తన శిష్యులతో కలిసి తీసుకున్న చివరి భోజనాన్ని 'ద లాస్ట్ సప్పర్' పేరిట లియోనార్డో డావిన్సి అద్భుతంగా చిత్రించాడు. అయితే ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో 'లాస్ట్ సప్పర్' పేరిట నిర్వహించిన ప్రదర్శనలో క్రీస్తు స్థానంలో ఓ మహిళ శిరస్సుపై వెండి శిరస్త్రాణం ధరించింది. ఆమె చుట్టూ ట్రాన్స్‌జెండర్లు ఉండడం వివాదానికి కారణమైంది. అంతేకాదు.. క్రీస్తు ధరించే శిరస్త్రాణం ఆ మహిళ ధరించడాన్నీ ఆక్షేపించారు. అలాగే ఫ్రాన్స్ మాజీ రాణి మేరీ అంటోనెట్ శిరచ్ఛేదన ప్రదర్శనపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫ్రెంచ్ సింగర్ ఫిలిప్ కేటరిన్ ఇచ్చిన ప్రదర్శనపైనైతే తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గ్రీకు వైన్ దేవత 'డియనోసిస్' పేరిట ఇచ్చిన ప్రదర్శనలో..అతడు వంటి నిండా నీలిరంగు వేసుకొని, అక్కడక్కడా పండ్లు ధరించి ఓ పెద్ద పండ్ల పళ్లెంలో దాదాపు నగ్నంగా పడుకొని ఉండడం దుమారం రేపింది. ఇది గ్రీకు దేవతని అవమానించడమేనని నెటిజన్లు మండిపడుతున్నారు. కానీ కొందరు నెటిజన్లు కళాకారుల ప్రదర్శన వెనుక ఉద్దేశం మంచిదే అయినా..దానిని ప్రదర్శించిన విధానంలో లోపముందని అభిప్రాయపడ్డారు. మరోవైపు..మానవుల మధ్య జరిగే హింస ఎంత అసంబద్ధమైనదో హాస్యపూర్వకంగా ప్రదర్శించినట్టు నిర్వాహకులు వివరించారు.

వాళ్లు హైజాక్ చేశారు: కంగన



'లాస్ట్ సప్పర్' పేరిట నిర్వహించిన ప్రదర్శనను బాలీవుడ్ నటి కంగనా రనౌత్ తప్పుబట్టారు. 'నీలి రంగు వేసుకొని నగ్నంగా ఉన్న వ్యక్తి ఒకరు జీసస్‌గా చెప్పుకొని క్రైస్తవాన్ని పరిహసించాడు. ఒలింపిక్స్‌ను వామపక్షవాదులు పూర్తిగా హైజాక్ చేశారు. ఇది సిగ్గుచేటు' అని లోక్‌సభ ఎంపీ కంగన ఎక్స్‌లో దుయ్యబట్టారు.



ఒలింపిక్ టార్చ్‌తో కార్ల్ లూయిస్, నడాల్, సెరెనా



సౌత్ కొరియాకు బదులు నార్త్ కొరియా

అథ్లెట్ల పరేడ్ సందర్భంగా..ఆయా దేశాలను వ్యాఖ్యాతలు పరిచయం చేశారు. 'రిపబ్లిక్ ఆఫ్ కొరియా' పేరిట దక్షిణ కొరియాను పరిచయం చేయాలి. కానీ వ్యాఖ్యాత 'డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా'గా తప్పుగా పరిచయం చేశాడు. ఇది నార్త్ కొరియా పేరు. దాంతో దక్షిణ కొరియా క్రీడా మంత్రిత్వ శాఖ ఆగ్రహం ప్రకటించింది. ఈ విషయాన్ని ఫ్రెంచ్ ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని తమ దేశ విదేశాంగ శాఖకు దక్షిణ కొరియా క్రీడా శాఖ సూచించింది. కాగా..ఈ పొరపాటుపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ క్షమాపణలు తెలపింది. అలాగే.. ఐదు రింగ్‌లతో కూడిన ఒలింపిక్ జెండాను తలకిందులుగా ఎగుర వేయడం ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో చోటు చేసుకున్న మరో అపశ్రుతి.

అంతరిక్ష కేంద్రంలో 'ఒలింపిక్స్'

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనూ ఒలింపిక్ ప్రారంభం సంబరాలు నిర్వహించారు. భారత సంతతికి చెందిన సునితా విలియమ్స్ సహా ఆరుగురు నాసా వ్యోమగాములు ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న సంగతి తెలిసిందే. వీరంతా ఒలింపిక్ టార్చ్‌ను తమ మధ్య అందజేసుకున్నారు. జానెట్ ఎప్ నుంచి ప్రారంభించి బుచ్‌విల్‌మోర్, సునితా విలియమ్స్ ఒకరికొకరు జ్యోతిని అందించుకున్నారు. అంతేకాదు..ఒలింపిక్స్‌ను పురస్కరించుకొని వారు కొన్ని క్రీడాంశాలను ప్రదర్శించారు. సునిత జిమ్నాస్టిక్స్ చేయగా, బరాట్ డిస్క్‌ను విసిరాడు. చివరగా వ్యోమగాములంతా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. రెండు నిమిషాల ఈ వీడియోను నాసా విడుదలజేసింది.

వినువీధిలో ఒలింపిక్ జ్యోతి



పారిస్: బోట్లపై అథ్లెట్ల పరేడ్ నిర్వహించి ప్రత్యేకత చాటుకున్న పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు మరో వినూత్న ఆలోచన చేశారు. ఒలింపిక్ జ్యోతిని ఆకాశంలోకి పంపాలని వారు నిర్ణయించారు. ఈమేరకు ఒలింపిక్ జ్యోతిని ఓ గాజు పెట్టెలో ఉంచి దానిని ఓ బెలూన్‌కు అనుసంధానం చేశారు. సూర్యాస్తమయం తర్వాత టుయిలరీ గార్డెన్స్ నుంచి 60 మీ. పైగా ఎత్తులో నింగిలోకి ఒలింపిక్ జ్యోతి శనివారం రాత్రి చేరుకుంది. తెల్లవారుజామున రెండు గంటల వరకు ఇది వీక్షకులకు కనువిందు చేయనుంది. అనంతరం తిరిగి భూమి మీదకు వస్తుంది. ఉదయమంతా టుయిలరీ గార్డెన్స్‌లో జ్యోతిని ప్రేక్షకులు సందర్శించవచ్చు. ప్రతి రోజూ 10వేల మందికి ఉచితంగా ఒలింపిక్ జ్యోతిని దర్శించుకొనే అవకాశం కల్పించారు.

తొలి స్వర్ణం చైనా ఖాతాలో..



పారిస్ క్రీడల్లో మొదటి స్వర్ణాన్ని చైనా సొంతం చేసుకొంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో చైనా షూటర్లు హువాంగ్ యుటింగ్-షెంగ్ లిహావో విజయం సాధించారు. సౌత్ కొరియాకు చెందిన కియుంగ్ హయున్-పార్క్ హజున్ జంట రెండో స్థానంలో నిలిచింది. ఇక, తొలిరోజు పోటీల్లో ఆతిథ్య ఫ్రాన్స్ జట్టు రెండు పతకాలు దక్కించుకుంది. జూడో క్రీడాంశంలో ఓ రజతం, కాంస్యం సాధించింది. ఆ దేశానికి చెందిన లుకా మెకడ్జే రజతం, షిరిన్ బౌక్లీ కాంస్య పతకం అందుకున్నారు.



ఫేవరెట్ భారత్

శ్రీలంకతో ఆసియా కప్ ఫైనల్ నేడు

దంబుల్లా: ఆసియా కప్‌లో ఎదురులేని డిఫెండింగ్ చాంపియన్ భారత్ అమ్మాయిలు మరో టైటిల్‌పై గురిపెట్టారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంక జట్టును ఎదుర్కోనున్నారు. ఈసారి టోర్నీలో అద్భుత విజయాలు సాధిస్తూ వచ్చిన హర్మన్‌సేనను టైటిల్ ఫైట్‌లో హాట్ ఫేవరెట్‌గా అంచనా వేస్తున్నారు. టాపార్డర్ బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటుతుండడంతో భారత్‌ను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు శక్తికి మించి పని అవుతోంది. కాగా.. రెండేళ్ల కిందట జరిగిన ఫైనల్లోనూ శ్రీలంకను ఓడించి మనోళ్లు టైటిల్ అందుకోవడం విశేషం.

ఆ పోటీలు.. 16వేల కిలో మీటర్ల దూరంలో

పారిస్ ఒలింపిక్స్‌లో ఓ క్రీడా ఈవెంట్ మాత్రం ఆతిథ్య నగరానికి వేల కిలోమీటర్ల దూరంలో నిర్వహిస్తుండడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ఫింగ్ ఈవెంట్‌ను పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న ఫ్రెంచ్ పాలినేషియన్ ద్వీపం తాహితీలోని చిరుప్రాంతమైన టీహుపో తీరంలో నిర్వహిస్తున్నారు. ఇది క్రీడలకు ఆతిథ్యమిస్తున్న పారిస్‌కు ఏకంగా 15,715 కిలోల మీటర్ల దూరంలో ఉంది. ఒలింపిక్స్‌లో ఓ క్రీడను ఆతిథ్య నగరానికి ఇంత దూరంలో నిర్వహించడం 68 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం. సాధారణంగా సర్ఫింగ్ ఈవెంట్‌ను సముద్ర తీరంలోని అలలపై నిర్వహిస్తారు. అయితే పారిస్‌కు సమీపంలో సముద్రం లేదు. దీంతో ఫ్రాన్స్‌లోనే భాగమైన టీహుపో తీరంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

'టాప్'షోతో బోణీ

తొలి టీ20లో శ్రీలంకపై భారత్ ఘనవిజయం

1 టీ20ల్లో శ్రీలంకపై పవర్‌ప్లేలో ఎక్కువ పరుగులు (74) చేయడం భారతకిదే తొలిసారి.

పల్లెకెలె: కొత్త కోచ్.. కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో బరిలోకి దిగిన టీమిండియా శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించింది. టాపార్డర్‌లో సూర్యకుమార్ (58), పంత్ (49), జైస్వాల్ (40), గిల్ (34) లంక బౌలర్లను చెడుగుడు ఆడేయగా.. ఆ తర్వాత భారత బౌలర్లు కీలక సమయంలో చెలరేగి ఆతిథ్య జట్టును కట్టడి చేశారు. దీంతో శనివారం జరిగిన తొలి టీ20లో 43 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే మూడు టీ20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. పేసర్ పథిరనకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంక 19.2 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు నిస్సాంక (79), కుశాల్ మెండిస్ (45) మెరుపు ఆరంభంతో తొలి వికెట్‌కు 84 పరుగులు జోడించారు. నిస్సాంక క్రీజులో ఉన్నంత సేపు లంక విజయంపై ధీమాతోనే ఉంది. 14 ఓవర్లలో 140 పరుగులు సాధించిన వేళ.. నిస్సాంకను స్పిన్నర్ అక్షర్ అవుట్ చేయడంతో ఇక కోలుకోలేక పోయింది. భారత బౌలర్లు ఒక్కసారిగా పట్టు బిగించడంతో చివరి 9 వికెట్లు 30 పరుగుల వ్యవధిలోనే నేలకూలాయి. పరాగ్ ఐదు పరుగులకే మూడు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్, అక్షర్ రెండేసి వికెట్లు సాధించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

మెరుపు ఆరంభంతో..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్‌లో టాప్-4 బ్యాటర్లు అదుర్స్ అనిపించారు. ఓపెనర్లు జైస్వాల్, గిల్‌తోపాటు కెప్టెన్ సూర్యకుమార్ ఫటాఫట్ ఆటతీరుతో చెలరేగారు. ఇక ఆరంభంలో నెమ్మదిగా ఆడిన పంత్ చివర్లో తడాఖా చూపాడు. దీంతో భారత్ సునాయాసంగా 200 దాటేసింది. అటు లంక పేసర్ పథిరన డెత్ ఓవర్లలో 4 వికెట్లతో కాస్త కట్టడి చేయగలిగాడు. ఇన్నింగ్స్ తొలి బంతినే జైస్వాల్ ఫోర్‌గా మల్చగా.. అదే ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో 13 పరుగులు వచ్చాయి. ఇక మూడో ఓవర్‌లో జైస్వాల్ 6,4.. తర్వాతి ఓవర్‌లో గిల్ 4,4తో నాలుగు ఓవర్లలో స్కోరు 50కి చేరింది. అయితే ఆరో ఓవర్‌లో గిల్ 4,4,6తో పదును చూపినా చివరి బంతికి మదుశంకకు చిక్కాడు. దీంతో తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే ఏడో ఓవర్ తొలి బంతికే జైస్వాల్ కూడా స్టంపౌట్ అయ్యాడు. కానీ సూర్య రాకతో లంక బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. ఎనిమిదో ఓవర్‌లో తను కళ్లుచెదిరే షాట్లతో 6,4,4 బాది 17 రన్స్ అందించాడు. 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన కెప్టెన్ కాసేపటికే పేసర్ పథిరనకు చిక్కాడు. ఇక సూర్య ఉన్నంతసేపు నిదానంగా ఆడిన పంత్ 16వ ఓవర్‌లో 6,4తో జోరు చూపాడు. 19వ ఓవర్‌లోనూ రెండు ఫోర్లు బాదినా.. పథిరన అతడితో పాటు పరాగ్ (7)ను అవుట్ చేశాడు. అప్పటికే 200 రన్స్ దాటిన స్కోరుకు చివరి ఓవర్‌లో అక్షర్ (10 నాటౌట్) 10 రన్స్ అందించాడు.



సూర్యకుమార్ (58)

2 టీ20ల్లో తన రెండో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ (22 బంతుల్లో) సాధించిన సూర్యకుమార్. గతంలో దక్షిణాఫ్రికాపై 18 బంతుల్లోనే పూర్తి చేశాడు.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (స్టంప్) కుశాల్ (బి) హసరంగ 40; గిల్ (సి) ఫెర్నాండో (బి) మదుశంక 34; సూర్యకుమార్ (ఎల్బీ) పథిరన 58; పంత్ (బి) పథిరన 49; హార్దిక్ (బి) పథిరన 9; పరాగ్ (ఎల్బీ) పథిరన 7; రింకూ (బి) ఫెర్నాండో 1; అక్షర్ (నాటౌట్) 10; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 213/7. వికెట్ల పతనం:** 1-74, 2-74, 3-150, 4-176, 5-192, 6-201, 7-206. **బౌలింగ్:** మదుశంక 3-0-45-1; ఫెర్నాండో 4-0-47-1; తీక్షణ 4-0-44-0; హసరంగ 4-0-28-1; కమిందు 1-0-9-0; పథిరన 4-0-40-4.

శ్రీలంక: నిస్సాంక (బి) అక్షర్ 79; కుశాల్ (సి) జైస్వాల్ (బి) అర్ష్‌దీప్ 45; పెరీరా (సి) బిష్ణోయ్ (బి) అక్షర్ 20; కమిందు (బి) పరాగ్ 12; అసలంక (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 0; షనక (రనౌట్) 0; హసరంగ (సి) పరాగ్ (బి) అర్ష్‌దీప్ 2; తీక్షణ (బి) పరాగ్ 2; పథిరన (సి) అక్షర్ (బి) సిరాజ్ 6; ఫెర్నాండో (నాటౌట్) 0; మదుశంక (బి) పరాగ్ 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.2 ఓవర్లలో 170 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-84, 2-140, 3-149, 4-158, 5-160, 6-161, 7-163, 8-170, 9-170, 10-170. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-24-2; సిరాజ్ 3-0-23-1; అక్షర్ 4-0-38-2; బిష్ణోయ్ 4-0-37-1; హార్దిక్ 4-0-41-0; పరాగ్ 1.2-0-5-3.



అలనాటి కథ

ఒకప్పటి హైదరాబాద్ క్రికెట్

క్రికెట్ ఇప్పుడు మన 'జాతీయ క్రీడ'లాగా మారిపోయింది కానీ ఒకప్పుడు దీనిని రాజకుటుంబీకులు మాత్రమే ఆడేవారు. హైదరాబాద్‌లో క్రికెట్ ప్రాచుర్యంలోకి రావటానికి మా నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్, నవాబ్ మొయిన్ ఉద్ దౌలా కారణం. స్వాతంత్ర్యం రాక ముందు వీరు క్రికెట్‌కు ఇచ్చిన ప్రోత్సాహం ఆ తర్వాతి కాలంలో అనేక మంది గొప్ప క్రీడాకారులు తయారవటానికి కారణమయింది.

క్రికెట్ ఆంగ్లేయుల ఆట. బ్రిటిష్ మిలటరీ రెజిమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో ఆర్మీ అధికారులు క్రికెట్ ఆడుతూ ఉండేవారు. ఫుట్‌బాల్, వాలీబాల్ మాదిరిగా దీనిని రెజిమెంట్స్ ఉన్న ప్రాంతాల్లో ఆడటానికి వీలుండదు కాబట్టి కొన్ని కాలేజీ గ్రౌండ్స్‌ను, పెరేడ్ గ్రౌండ్స్‌ను ఎంపిక చేసుకొని వాటిలో ఆడేవారు. ఇలా సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్, జింఖానా క్లబ్ గ్రౌండ్స్ మొదలైన వాటిని ఎంపిక చేసుకున్నారు. అయితే క్రికెట్ ఖరీదైన ఆట. బ్యాట్స్ ప్యాడ్స్ గ్లోవ్స్, ఆట మధ్యలో డ్రింక్స్, స్నాక్స్, ఆటగాళ్లకు రవాణా సదుపాయాలు... ఇలా ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల కొందరు అధికారులు రాజ కుటుంబీకులను విరాళాల కోసం సంప్రదించారు. అప్పటికి పోలో ఒకటే రాజకుటుంబీకులు ఆడే ఆటగా ఉండేది. క్రికెట్‌లో ఉన్న ఆకర్షణను గుర్తించిన నాన్న ధన్‌రాజ్‌గిర్ వంటి వారు క్రికెట్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లలో దేశంలోని అనేక మంది యువరాజులు, ప్రముఖ క్రికెటర్లు ఆడేవారు. నాన్న ఏర్పాటు చేసిన 'ధన్‌రాజ్‌గిర్ ఎలెవన్' టీమ్‌లో పాటియాలా యువరాజు ముస్తాక్, సి.కె.నాయుడు, దేవధర్, విజయనగరం యువరాజు



వంటి వారు ఆడేవారు. టీమ్‌లు మధ్య పోటీ కోసం నవాబ్ మొయిన్ ఉద్ దౌలా... 'బషీర్‌బాగ్ కప్' నిర్వహించారు. ఈ కప్‌ను పూర్తి బంగారంతో తయారు చేసేవారు. మూడుసార్లు గెలిచిన టీమ్ ఈ కప్‌ను తమ వద్దే ఉంచుకోవచ్చు. దీనితో ఆటగాళ్లు ప్రతిష్ఠాత్మకమైన ఈ కప్పును పొందటానికి ప్రయత్నించేవారు. ధన్‌రాజ్ ఎలెవన్ మూడుసార్లు వరుసగా ఈ కప్పు గెలుచుకుంది. మ్యాచ్‌లు పోటాపోటీగా జరుగుతూ ఉండటంతో ప్రేక్షకులు రావటం మొదలుపెట్టారు. దాంతో హైదరాబాద్‌లో క్రికెట్ సందడి బాగా పెరిగింది. ఒక దశలో ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యమైన ఆటగాళ్లు వచ్చి ఆడుతున్నప్పుడు, అప్పటి ప్రభుత్వం సెలవు కూడా ప్రకటించేది. ఇక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆటగాళ్లతో జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్ కూడా కళకళలాడుతూ ఉండేది. టైగర్ పటౌడి, సి.కె.నాయుడు వంటివారు నాన్నకు మంచి స్నేహితులు. సి.కె.నాయుడు మా ఇంటికి వచ్చినప్పుడు సరదాగా నాతో షటిల్ బ్యాట్‌తో క్రికెట్ ఆడేవారు. ఆ తర్వాతి కాలంలో హైదరాబాద్... క్రికెట్‌కు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారిపోయింది. క్రికెట్‌కు కావాల్సిన గ్రౌండ్స్, ఆఫీసులు వెలిసాయి. ఫతేమైదాన్ వద్ద ఉన్న క్రికెట్ అసోషియేషన్ ఆఫీసు ఎప్పుడూ సందడిగా ఉండేది. ఇప్పటితో పోలిస్తే అప్పటి క్రీడాకారులకు ఎక్కువ డబ్బులు వచ్చేవి కావు. కానీ ఇప్పటి లాగే అప్పుడు కూడా వారి పట్ల ప్రజల్లో క్రేజ్ మాత్రం ఉండేది.

● రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



నోరు జారి.. ఆనక సారీతో సరి

ప్రత్యర్థులను ఇరుకున పెట్టేందుకు రాజకీయ నాయకులు... చీప్ పబ్లిసిటీ కోసం కొంత మంది సినిమావాళ్లు... కథానాయికలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా కోలీవుడ్‌లో హీరోయిన్లపై బజారు భాషను ఉపయోగిస్తూ వార్తల్లో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. కథానాయికలపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ, వారిని దుర్భాషలాడే సంస్కృతి అక్కడ క్రమంగా పెరుగుతోంది.

కొన్నేళ్లుగా ఏదో ఒక సందర్భంలో హీరోయిన్లను లక్ష్యంగా చేసుకొని వివాదాలు రాజేసే ప్రయత్నం తమిళ పరిశ్రమలో నిరాటంకంగా కొనసాగుతోంది. కొంతమంది స్వార్థపరులకు తమిళ నాయిక ఈజీ టార్గెట్‌గా మారుతోంది. ఈ తరహా ధోరణి అటు బాలీవుడ్‌లో కానీ ఇటు సౌతిండియాలోని మరో చిత్ర పరిశ్రమలోగానీ కనిపించదు.

తమన్నా పేరును వాడుకొని...

తమన్నా పాట ఉంటే చాలు సినిమా హిట్ అవుతుందంటూ తమిళ నటుడు, దర్శకుడు పార్తీబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్ పరిశ్రమలో దుమారం రేపాయి. అలా అనడంలో ఆయన అసలు లక్ష్యం మాత్రం రజనీకాంత్ నటించిన 'జైలర్', ఖుష్బూ భర్త సుందర్ తెరకెక్కించిన 'బాక్' చిత్రాలు. వాటి విజయాన్ని తక్కువ చేసి చూపించే క్రమంలో ఆయన



అలా మాట్లాడారు. కానీ అందుకు తమన్నా పేరును అస్త్రంగా వాడుకోవడాన్ని పరిశ్రమ తప్పు పట్టింది. కేవలం ఆమె కురుచ దుస్తుల్లో అందాల ప్రదర్శనే ఆ సినిమాలను ఒడ్డున పడేసిందని అర్థం వచ్చేలా మాట్లాడడంపై పరిశ్రమ వర్గాలు అభ్యంతరం చెప్పడంతో చివరకు పార్తీబన్ అందరికీ క్షమాపణలు చెప్పాల్సి వచ్చింది.

నయనతార లక్ష్యంగా...

సినీ రంగంలోని దిగ్గజాలే కాదు... వర్ధమాన నటీనటులు, దర్శకులు సైతం హీరోయిన్లపై నోరు పారేసుకుంటున్నారు. కథానాయికల వ్యక్తిగత జీవితాన్ని బజారుకీడ్చే పని పెట్టుకుంటున్నారు. తమిళ సినీ, రాజకీయ వర్గాలకు లక్ష్యంగా మారారు నయనతార. ఆమెపై పలు సందర్భాల్లో అక్కడి సినీ రాజకీయ ప్రముఖులుగా భావించే కురుచ బుద్ధి నాయకులు కించపరిచే వ్యాఖ్యలు చేశారు. సీనియర్ నటుడు, బీజేపీ నాయకుడు రాధారవి నయనతారకూ, సీఎం స్టాలిన్ కుమారుడు, హీరో ఉదయనిధికి అక్రమ సంబంధం అంటగట్టారు. నయనతారతో ఉదయనిధి సహజీవనం చేస్తున్నారని 2021లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చెప్పాడు. వాళ్ల ఎఫైర్ గురించి నిలదీయడం వల్లే డీఎంకే నుంచి తనను బహిష్కరించారని చెప్పారు. ఆ ఎన్నికల్లోనే ఆయన కమల్‌హాసన్‌పైనా తన వ్యాఖ్యలతో పేట్రేగారు. ప్రధాని మోదీకి, కమల్‌హాసన్‌కు పోలిక లేదన్నారు. మోదీ దేశాన్ని కాపాడితే, కమల్ కట్టుకున్న భార్యలను కాపాడుకోలేక పోయాన్నారు. ముగ్గురు మహిళల జీవితాలను రోడ్డుపాలు చేశాడని విమర్శించారు.

హన్సికపై ఆరోపణలు...

హన్సిక నటించిన 'పార్టనర్' చిత్రంలో రోబో శంకర్ కీలకపాత్ర పోషించారు. ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో హీరోయిన్ హన్సికపై ఆమె ఎదురుగానే మీడియా సమక్షంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు రోబో శంకర్. 'షూటింగ్‌లో దర్శకుడు ఎంత బతిమాలినా ఆమె నా కాలు తాకేందుకు ఇష్టపడలేదు. నన్ను ముట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదు. ఆమె ప్రవర్తనకు యూనిట్ అంతా విస్తుపోయింది' అని చెప్పాడు. అలాంటిదేం జరగలేదని ఆ తర్వాత అతడు క్షమాపణలు చెప్పాడు.

డబుల్ మీనింగ్ డైలాగ్‌తో...

త్రిషను బెడ్‌రూమ్‌కు తీసుకెళ్దామనుకున్నాను అంటూ డబుల్ మీనింగ్ డైలాగ్‌లతో ఆ మధ్య వార్తల్లో నిలిచారు సీనియర్ నటుడు మన్సూర్ అలీఖాన్. 'నా కెరీర్‌లో ఎన్నో రేప్ సీన్లు చేశాను. 'లియో'లో త్రిషను బెడ్‌రూమ్‌కి తీసుకెళ్దామనుకున్నాను. కానీ రేప్ సీన్ లేకపోవడం నన్ను బాధించింది' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు విలన్‌గా ఓ వెలుగు వెలిగిన మన్సూర్ ప్రభ క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఆ నేపథ్యంలో 'లియో' సినిమాలో అప్రాధాన్యమైన పాత్ర పోషించాల్సి వస్తుందనే ఆక్రోశం, హీరోను, దర్శకుణ్ణి ఏమీ అనలేని పరిస్థితిలో ఆయన త్రిషపై చిల్లర వ్యాఖ్యలకు దిగాడనేది కోలీవుడ్ టాక్. తద్వారా జనాల దృష్టిని ఆకర్షించాలనే అతని ప్రయత్నం నెరవేరింది. కానీ ఒక మహిళ వ్యక్తిత్వ హననానికి పాల్పడేందుకు అతను ప్రయత్నించడాన్ని జనాలు ఛీ కొట్టారు. చిత్రపరిశ్రమ నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, కోర్టు మొట్టికాయలు వేయడంతో మన్సూర్ మొక్కుబడిగా క్షమాపణలు చెప్పి వివాదాన్ని ముగించాడు.

ధనుష్‌తో మీనా పెళ్లి?

2022లో మీనా భర్త విద్యాసాగర్ అనారోగ్యంతో కన్నుమూశారు. మీనాకు యావత్ చిత్రపరిశ్రమ అండగా నిలిచింది. నాలుగు ఓదార్పు మాటలు చెప్పింది. తర్వాత క్రమంగా ఆ బాధ నుంచి బయటపడి మీనా సినిమాలు చేస్తున్నారు. 'కూతురే నా లోకం. మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశం లేద'ని మీనా పలు సందర్భాల్లో చెప్పారు. కానీ అక్కడి మీడియా మాత్రం మీనాతో ఎవరెవరినో ముడిపెడుతూ వార్తలు వడ్డిస్తోంది. దానిక్కావలసిన ముడి సరకును అక్కడి సినిమావాళ్లే అందిస్తున్నారు. మీనా జూలైలో ధనుష్‌ను పెళ్లాడబోతోందంటూ బీ రంగనాథన్ అనే నటుడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. 'ఇద్దరూ వయసులో ఉన్నారు, పైగా తోడు లేదు, పెళ్లి చేసుకుంటే తప్పేంటి? చేసుకోకుండా కలిసి ఉన్నా తప్పులేదు' అన్నాడు. అతని వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారడంతో అలాంటిదేం లేదని మీనా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ●


ఈ వారమే విడుదల — ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఎ గుడ్ గర్ల్స్ గైడ్ టు మర్డర్	వెబ్‌సిరీస్	ఆగస్టు 01
అన్‌స్టేబుల్ 2	వెబ్‌సిరీస్	ఆగస్టు 01
మోడ్రన్ మాస్టర్స్	రాజమౌళి డాక్యుమెంటరీ	ఆగస్టు 02
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
నో వే అవుట్	కొరియన్ సిరీస్	జూలై 31
కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్	తెలుగు డబ్బింగ్	ఆగస్టు 02
సోనీ లివ్		
బృంద	తెలుగు సిరీస్	ఆగస్టు 02
జియో సినిమా		
డ్యూన్ 2	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 01
ఘుడ్‌చడీ	హిందీ చిత్రం	ఆగస్టు 01
టారో	హాలీవుడ్ మూవీ	ఆగస్టు 03
ఆపిల్ టీవీ ప్లస్		
ఉమెన్ ఇన్ బ్లూ	వెబ్‌సిరీస్	జూలై 31





సినిమా బాహుబలి కథ



'బాహుబలి' సిరీస్ చిత్రాలతో తెలుగు సినిమాను జాతీయ స్థాయిలో మేటిగా నిలిపి దర్శకుడిగా పేరు ప్రతిష్ఠలు ఆర్జించారు రాజమౌళి. 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో భారత పతాకను రెపరెపలాడించాడు. ఆ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ దక్కడంతో దర్శకుడిగా ఆయన పేరు మార్మోగింది. దేశంలో పాపులర్ డైరెక్టర్స్ అత్యధిక పారితోషికం అందుకునే దర్శకుల్లో ఆయనది అగ్రస్థానం. ఈ నేపథ్యంలో రాజమౌళిపై 'మోడ్రన్ మాస్టర్స్' అనే డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ కన్నా దర్శకత్వంలో సమీర్ నాయక్, దీపక్ సెగల్ నిర్మించారు. ఇటీవలే ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు రాజమౌళిపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు. 'మోడ్రన్ మాస్టర్స్' ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవనుంది. ●

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/7chVoy9లో చదవండి.

డాక్టర్ రెడ్డీస్ షేర్ల విభజన

ఒక షేరు ఐదు షేర్లుగా... అమెరికన్ డిపాజిటరీ షేర్లు సైతం



హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ షేర్లను 1:5 నిష్పత్తిలో విభజించనున్నట్లు శనివారం ప్రకటించింది. ప్రస్తుతం రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూపాయి ముఖ విలువ కలిగిన ఐదు షేర్లుగా విభజించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కంపెనీ సమాచారం అందించింది. షేర్ల విభజనకు రికార్డు తేదీని తర్వాత వెల్లడిస్తామని సంస్థ పేర్కొంది. అంతేకాదు, ప్రస్తుతం ప్రతి అమెరికన్ డిపాజిటరీ షేరు (ఏడీఆర్) కూడా ఒక ఈక్విటీ షేరుతో సమానమని.. విభజన ఫలితంగా ఏడీఆర్‌లు సైతం ఈక్విటీ షేర్లకు సమానంగా పెరుగుతాయని కంపెనీ స్పష్టం చేసింది. డాక్టర్ రెడ్డీస్ తన షేర్లను విభజించడం ఇది రెండోసారి. 2001 అక్టోబరులో కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.5 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా విభజించింది. శుక్రవారం డాక్టర్ రెడ్డీస్ షేరు బీఎస్ఈలో 0.55 శాతం పెరుగుదలతో రూ.6,892 వద్ద ముగిసింది.

క్యూ1 లాభం రూ.1,392 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి డాక్టర్ రెడ్డీస్ రూ.1,392 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి గడించిన రూ.1,403 కోట్ల లాభంతో పోలిస్తే 0.7 శాతం తగ్గినప్పటికీ, మార్కెట్ అంచనాలను మించి నమోదైంది. కంపెనీ ఆదాయం 14 శాతం పెరిగి రూ.7,673 కోట్లకు చేరుకుంది. ఇప్పటివరకు కంపెనీ ఆర్జించిన అత్యధిక త్రైమాసికాదాయం ఇదే. 2023-24లో ఇదే సమయానికి ఆదాయం రూ.6,738 కోట్లుగా ఉంది. పన్ను భారం 24 శాతం నుంచి 26 శాతానికి పెరగడం లాభాలను ప్రభావితం చేసింది. కాగా, ఉత్తర అమెరికాతోపాటు భారత మార్కెట్లో జనరిక్ ఔషధాల విక్రయాలు పెరగడం ఆదాయ వృద్ధికి దోహదపడింది.

స్విస్ యూనిట్లోకి 50 కోట్ల పౌండ్లు

స్విట్జర్లాండ్ అనుబంధ విభాగమైన 'డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ'లో 50 కోట్ల పౌండ్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. స్విస్ అనుబంధ విభాగం ఈ నిధులను నికోటినెల్, ఇతర బ్రాండ్ల కొనుగోలుకు ఉపయోగించుకోనుంది.

> కొత్త ఆర్థిక సంవత్సరానికి కంపెనీ శుభారంభం చేసింది. జనరిక్ ఔషధాల వ్యాపారం కంపెనీ వృద్ధి, లాభదాయకతను ముందుకు నడిపించాయి. ఒకవైపు మా కీలక వ్యాపారాలను బలోపేతం చేస్తూనే మరోవైపు వ్యాపార విలువను పెంచేందుకు బయోలాజిక్స్, కన్స్యూమర్ హెల్త్‌కేర్, ఆవిష్కరణల్లో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టాం.
>
> - జీవీ ప్రసాద్, డాక్టర్ రెడ్డీస్ సహ చైర్మన్, ఎండీ

మరిన్ని ముఖ్యాంశాలు..

- మొత్తం ఆదాయంలో గ్లోబల్ జనరిక్స్ విక్రయాల వాటా 90 శాతంగా నమోదైంది. ఈ క్యూ1లో గ్లోబల్ జనరిక్స్ ద్వారా రాబడి 15 శాతం పెరిగి రూ.6,886 కోట్లకు చేరుకుంది. ఫార్మాస్యూటికల్ సేవలు, యాక్టివ్ ఇంగ్రెడియెంట్స్ ద్వారా రెవెన్యూ 14 శాతం వృద్ధితో రూ.770 కోట్లుగా నమోదైంది.
- గ్లోబల్ జనరిక్స్ ఆదాయాన్ని మార్కెట్ల వారీగా పరిశీలిస్తే, ఉత్తర అమెరికా నుంచి రెవెన్యూ 20 శాతం వృద్ధితో రూ.3,846 కోట్లుగా నమోదైంది. విక్రయాలు పుంజుకోవడం, మూడు కొత్త ఉత్పత్తుల విడుదల ఇందుకు కలిసివచ్చాయి. యూరప్ మార్కెట్ రెవెన్యూ 4 శాతం పెరిగి రూ.527 కోట్లుగా, భారత మార్కెట్ నుంచి రాబడి 15 శాతం పుంజుకొని రూ.1,325 కోట్లుగా నమోదయ్యాయి. వర్ధమాన మార్కెట్ల నుంచి రెవెన్యూ 3 శాతం పెరిగి రూ.1,188 కోట్లకు చేరుకుంది.
- ఈ ఆర్థిక సంవత్సరానికి కంపెనీ భారత మార్కెట్ నుంచి రెండంకెల స్థాయి ఆదాయ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. బేస్ బిజినెస్ ఇందుకు దోహదపడగలదని భావిస్తోంది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ దేశీయ మార్కెట్లో 13 కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది.

పీఎన్‌బీ రికార్డు లాభం

క్యూ-1లో రూ.3,252 కోట్లు

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) జూన్ త్రైమాసికానికి రూ.3,252 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. బ్యాంక్ చరిత్రలో ఇప్పటివరకిదే అత్యధిక త్రైమాసిక లాభం. మొండిబాకీలు మరింత తగ్గడంతోపాటు వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయల్ అన్నా రు. గత ఏడాదిలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.1,255 కోట్లుగా నమోదైంది. కాగా, గడిచిన మూడు నెలల్లో పీఎన్‌బీ మొత్తం ఆదాయం రూ.32,166 కోట్లకు పెరిగింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి రాబడి రూ.28,579 కోట్లుగా ఉంది. ఏడాది క్రితంతో పోలిస్తే, బ్యాంక్ వడ్డీ ఆదాయం కూడా రూ.21,145 కోట్ల నుంచి రూ.28,556 కోట్లకు ఎగబాకింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.9,504 కోట్ల నుంచి రూ.10,476 కోట్లకు చేరుకుంది. మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) జూన్ చివరి నాటికి 7.73 శాతం నుంచి 4.98 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.98 శాతం నుంచి 0.60 శాతానికి జారుకున్నాయి. దీంతో మొండిబకాయిల కోసం కేటాయింపు సైతం రూ.4,374 కోట్ల స్థాయి నుంచి రూ.792 కోట్లకు తగ్గాయి. కంపెనీల దివాలా పరిష్కార కేసుల ద్వారా రూ.18,000 కోట్ల మేర మొండిబాకీలు వసూలు కావచ్చని బ్యాంక్ భావిస్తోంది. గడిచిన మూడు నెలల్లో రూ.1,755 కోట్ల విలువైన రుణాలు మొండి పద్దులుగా మారాయని బ్యాంక్ వెల్లడించింది. కాగా, రూ.3,249 కోట్ల మొండి బాకీలను వసూలు చేయగలిగినట్లు తెలిపింది. వచ్చే మార్చి నాటికి గ్రాస్ ఎన్‌పీఏలను 4 శాతం దిగువకు, నికర ఎన్‌పీఏలను 0.5 శాతం దిగువకు కట్టడి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గోయల్ తెలిపారు. ఈసారి రుణ వృద్ధి 11-12 శాతంగా, డిపాజిట్ల వృద్ధి 9-10 శాతంగా, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.9-3 శాతంగా నమోదుకావచ్చన్నారు.

5 కోట్లు దాటిన ఐటీ రిటర్న్‌లు

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను శాఖకు చెందిన ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై శనివారం వరకు దాఖలైన ఐటీ రిటర్న్‌ల సంఖ్య 5 కోట్లు దాటింది. గత ఏడాదితో పోల్చితే దాఖలైన రిటర్న్‌ల సంఖ్య 8 శాతం అధికమని ఐటీ శాఖ ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. ఒక్క శనివారంనాడే 28 లక్షలకు పైగా రిటర్న్‌లు దాఖలయ్యాయి. రిటర్న్‌ల దాఖలు సమయంలో ఎలాంటి అవరోధాలు లేకుండా సేవలందేలా చూడాలని టెక్నాలజీ భాగస్వామి ఇన్ఫోసిస్‌ను తమ శాఖ ఆదేశించగా అందుకు కంపెనీ హామీ ఇచ్చిందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దాఖలైన మొత్తం ఐటీఆర్‌ల సంఖ్య 8.61 కోట్లు.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం రూ.11,696 కోట్లు

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం జూన్ త్రైమాసికానికి వార్షిక ప్రాతిపదికన 9.96 శాతం వృద్ధితో రూ.11,695.84 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.10,636.12 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో బ్యాంక్ స్టాండలోన్ లాభం 14.62 శాతం వృద్ధితో రూ.11,059 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.45,998 కోట్లకు ఎగబాకింది. గత ఏడాది జూన్ త్రైమాసికాదాయం రూ.38,763 కోట్లుగా ఉంది. వ్యయాలు రూ.24,624 కోట్ల నుంచి రూ.29,973 కోట్లకు ఎగబాకాయి. ఈ క్యూ1లో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 7.3 శాతం పెరిగి రూ.19,552.9 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.36 శాతానికి తగ్గింది. ఎన్ఐఎం 4.40 శాతంగా ఉండగా.. గత ఏడాది జూన్ త్రైమాసికంలో 4.78 శాతంగా నమోదైంది. మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.15 శాతానికి (రూ.28,718.6) కోట్లకు తగ్గాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.43 శాతానికి (రూ.5,684.8 కోట్లు) పెరిగాయి. మొండిబకాయిల కోసం బ్యాంక్ రూ.1,332.2 కోట్ల కేటాయింపులు జరిపింది.

కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో విలీనానికి

సువెన్‌కు అనుమతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోహెన్స్ లైఫ్‌సైన్సెస్‌తో విలీనానికి సువెన్ లైఫ్ సైన్సెస్‌కు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల నుంచి అనుమతి లభించింది. శనివారం ఒక ప్రకటనలో సువెన్ లైఫ్ సైన్సెస్ ఈ విషయం వెల్లడించింది. ఇదిలా ఉండగా సువెన్ ఫార్మాస్యూటికల్స్, కోహెన్స్ లైఫ్‌సైన్సెస్ ఉమ్మడిగా ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు అందించాయి. గతంలో ప్రకటించిన ప్రకారం ఈ విలీనం పూర్తి కావడానికి 12 నుంచి 15 నెలల కాలం పడుతుంది. పీఈ సంస్థ యాడ్వెంట్ ప్రస్తుతం సువెన్ ఫార్మాలో 50.1 శాతం, కోహెన్స్‌లో నూరు శాతం వాటాలు కలిగి ఉంది. విలీనం అనంతరం ఉమ్మడి కంపెనీలో యాడ్వెంట్‌కు 66.7 శాతం వాటాలుంటాయి.

వచ్చేనెల 2 నుంచి ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ

ముంబై: విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ వచ్చేనెల 2న ప్రారంభమై 6న ముగియనుంది. ఈ ఐపీఓలో సందర్భంగా కంపెనీ మార్కెట్ విలువను 420-440 కోట్ల డాలర్ల (రూ.35,166-36,840 కోట్లు) స్థాయిలో లెక్కించే అవకాశం ఉంది. అలాగే, ఓలా ఎలక్ట్రిక్ ఈ ఏడాదిలో అతి పెద్ద ఐపీఓల్లో ఒకటి కానుంది. అంతేకాదు, భారత్‌లో ఐపీఓకు వస్తున్న తొలి ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ కూడా ఇదే కానుంది.

వస్తు సేవల పన్ను - బడ్జెట్ ప్రతిపాదనలు

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో వస్తు సేవల పన్ను చట్టానికి పలు సవరణలు ప్రతిపాదించారు. వీటిలో పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన కొన్ని ముఖ్య ప్రతిపాదనలు మీ కోసం...

ఇదీ GST



రాంబాబు గొండాల

మొదటిది ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ గడువుకు సంబంధించినది. ఒక వ్యాపారి తాను పొందిన వస్తు సేవలకు సంబంధించిన క్రెడిట్‌ను నిర్దిష్ట గడువు లోపు తీసుకోవాలి. నిజానికి ఈ నిర్దిష్ట గడువుకు సంబంధించిన నిబంధనకు ఇంతకు ముందు కూడా సవరణ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధన ప్రకారం ఇన్‌వాయిస్ ఏ ఆర్థిక సంవత్సరంలో పొందారో దాని తదుపరి ఆర్థిక సంవత్సరం నవంబరు 30 లోపు ఆ ఇన్‌వాయిస్‌కు సంబంధించిన ఐటీసీని రిటర్న్ దాఖలు చేయడం ద్వారా పొందాలి. అయితే జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తొలి రోజుల్లో చాలా మంది అవగాహన లేకపోవడం వల్ల అర్హత ఉన్నప్పటికీ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను నిర్దిష్ట గడువు లోగా పొందలేకపోయారు. అందుకే ఆ గడువు ముగిసిన తర్వాత తీసుకున్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లదంటూ పన్ను చెల్లింపుదారులకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది. ఈ ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత నిబంధనను ఈ బడ్జెట్లో సవరించారు. దీని ప్రకారం 2017-18 నుంచి 2020-21 సంవత్సరం వరకు అంటే మొదటి నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో పొందిన ఇన్‌వాయిస్‌లపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను 2021 నవంబరు 30 లోపు ఎప్పుడు తీసుకున్నా దానిని నిర్దిష్ట గడువు లోగా తీసుకున్నట్టుగానే పరిగణిస్తారు.

ఇక రెండోది కూడా ఐటీసీకి సంబంధించినదే. ఒక వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దయి తిరిగి పునరుద్ధరణ జరిగినప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు నాటికి ఉన్న ఇన్‌వాయిస్‌లపై తీసుకోకుండా మిగిలిపోయిన క్రెడిట్ ఏదైనా ఉంటే అలాంటి క్రెడిట్‌ను పునరుద్ధరణ అయిన తర్వాత కూడా పొందవచ్చు. అయితే రిజిస్ట్రేషన్ అమలులో ఉన్న సమయంలో సదరు క్రెడిట్ పొందడానికి గల నిర్దిష్ట గడువు మించి ఉండకూడదు. అంటే రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ జరిగే సమయానికి సదరు ఇన్‌వాయిస్‌ల మీద క్రెడిట్ పొందడానికి గల నిర్దిష్ట గడువు దాటినప్పటికీ క్రెడిట్ పొందవచ్చు. అయితే దీనికి కొన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

మరో ముఖ్యమైన సవరణ కూడా ఉంది. మోసపూరిత ఉల్లంఘనలు కాకుండా సాధారణ ఉల్లంఘనలు చోటు చేసుకున్న సమయంలో పన్ను చెల్లింపునకు సంబంధించి ఒక వ్యక్తికి నోటీసు లేదా ఆర్డర్ అందినప్పుడు సదరు వ్యక్తి ఆ పన్ను మొత్తాన్ని నిర్దిష్ట గడువు లోపు చెల్లించినప్పుడు దానికి సంబంధించిన వడ్డీ, పెనాల్టీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే సంబంధిత నోటీసు లేదా ఆర్డర్‌లో పన్నుతో పాటు వడ్డీ, పెనాల్టీ ఉన్నప్పటికీ పన్ను మాత్రం చెల్లిస్తే సరిపోతుంది. ఇది ఎంతో మందికి ఊరట కలిగించే అంశం. అయితే ఈ మినహాయింపు 2017 జూలై నుంచి 2020 మార్చి మధ్యలో వచ్చిన డిమాండ్లకు మాత్రమే వర్తిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	104
కర్నూలు	94	నెల్లూరు	104
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

ఆకతాయిల వేధింపులపై పవన్ సీరియస్

- మహిళలను వేధిస్తున్నారని వెంకటగిరి వాసుల ఫిర్యాదు
- వెంటనే తిరుపతి ఎస్పీకి డిప్యూటీ సీఎం ఫోన్
- ఆకతాయిలను పట్టుకుని.. కేసు నమోదు


జనసేన కార్యాలయంలో ప్రజలు చేసిన ఫిర్యాదులపై అధికారులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యువతులను, మహిళలను కొందరు ఆకతాయిలు వేధిస్తున్నారన్న ఫిర్యాదుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్‌గా స్పందించారు. వెంటనే వారిని కట్టడి చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వెంటనే స్పందించిన తిరుపతి పోలీసులు.. ఆ ఆకతాయిలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. వివరాలివీ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనసేన కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి పెట్టారు. శనివారం ఉదయం జనసేన కార్యాలయంలోనే ఫిర్యాదుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన కార్యాలయ సిబ్బందితో కలిసి స్వయంగా ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా చదివారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ శాఖలపై వచ్చిన అర్జీలతో పాటు ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను, ఎదురవుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. తన శాఖల పరిధిలోని ప్రతి అంశాన్నీ అధికారులతో మాట్లాడి నిర్దేశిత వ్యవధిలో పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు, ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించారు. కాగా, తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలియజేసిన సమస్య పవన్‌ను కదిలించింది. కొందరు యువకులు ప్రమాదకరంగా బైక్స్ నడుపుతూ విద్యార్థినులను, యువతులను, మహిళలను వేధిస్తున్నారని, వృద్ధులను భయపడుతున్నారని లేఖ రాశారు. యువతుల ఫొటోలు తీసి ఇంటర్‌నెట్‌లో ఉంచి, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలు పెట్టడం, ఇళ్లపై రాళ్లు వేసి భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తున్నారని వాపోయారు. సదరు యువకుల వివరాలు, బైక్స్‌పై ఫీట్‌లు చేస్తున్న ఫొటోలను, నంబర్లను సైతం తమ ఫిర్యాదుకు జత చేశారు. ఒక మహిళా ఎస్సైను కూడా వేధించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే స్పందించిన పవన్.. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. మహిళలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన పోలీసు అధికారులు హుటాహుటిన వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీకి వెళ్లి ఆకతాయిల వివరాలు ఆరా తీశారు. బైక్స్‌పై మితిమీరిన వేగంతో ప్రమాదకరంగా సంచరిస్తూ వేధిస్తున్న పలువురి పట్టుకుని కేసులు నమోదు చేసి బైండోవర్ చేశారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం

- జగనన్న గోరుముద్ద పేరు మార్చిన కూటమి ప్రభుత్వం
- కలాం స్ఫూర్తితో విద్యా పథకాలకు కొత్త పేర్లు... ఎక్స్‌లో మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో పలు పథకాల పేర్లు మారుస్తున్నట్లు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. జగనన్న అమ్మఒడి పేరును తల్లికి వందనంగా మార్చారు. జగనన్న విద్యా కానుక పథకాన్ని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర అని, జగనన్న గోరుముద్దను డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం అని, మన బడి - నాడు నేడును మన బడి - మన భవిష్యత్తు అని, స్వేచ్ఛ పథకాన్ని బాలికా రక్ష అని, జగనన్న ఆణిముత్యాలను అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం అని మారుస్తున్నట్లు శనివారం ఎక్స్‌లో వివరించారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టించిన విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తామన్నారు. విద్యాలయాలను రాజకీయాలకు అతీతంగా సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దుతామన్నారు. అందులో భాగంగానే గత ప్రభుత్వం అప్పటి సీఎం పేరుతో పెట్టిన పథకాల పేర్లకు స్వస్తి పలుకుతున్నామన్నారు. విద్యా రంగంలో విశేష సేవలు అందించిన భరతమాత ముద్దుబిడ్డల పేర్లు పెట్టామన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో పథకాలకు కొత్త పేర్లు పెట్టినట్లు తెలిపారు.

పోలవరానికి 12,500 కోట్లు

త్వరగా ఇవ్వండి

కేంద్ర జలశక్తి మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి


కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలవరానికి సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. శనివారం, ఇక్కడ శ్రమశక్తి భవన్‌లో కేంద్రమంత్రితో భేటీ అయిన చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై కూలంకషంగా చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన పోలవరం ప్రాజెక్టు మొదటి దశకు అవసరమైన రూ.12,500 కోట్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం వెంటనే ఆమోదించేలా చూడాలని కోరినట్లు చెప్పారు. నవంబర్లో పనులు ప్రారంభించాలనుకుంటున్నామని, ఆ మేరకు నిధులివ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించడానికి ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచినట్లు తెలిపారు. 'కొత్త వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. దాని నిర్మాణానికి అనుగుణంగా యంత్రాలను తరలించాల్సి ఉంటుందని, ఇదే విషయంపై రాష్ట్ర కేబినెట్‌లో కూడా చర్చించామని, కేబినెట్ నోట్‌ను కేంద్ర మంత్రికి అందించినట్లు చెప్పారు. పోలవరంపై నిధులు ఖర్చు చేసేందుకు ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఆమోదం తెలిపిందని, ఇప్పుడది కేంద్ర కేబినెట్ ముందుకు వెళ్లాల్సి ఉందని వివరించారు. 'పోలవరం ప్రాజెక్టులో ముందు డయాఫ్రం వాల్ కొత్తది నిర్మించాలి. ఆ తర్వాత ఎర్త్ కం రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించాలి. కాఫర్ డ్యాంలు కొంత తగ్గించి.. సీపేజ్ అంతా ఎత్తిపోస్తూ.. వాల్ పూర్తి చేయాల్సి ఉంటుంది. రెండు సీజన్ల కంటే ముందే.. దీనిని కట్టేస్తే ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు వెంటనే చేపట్టవచ్చు. ప్రాజెక్టులో తొలిదశ, మలిదశ అనేవి లేవు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం ఒక్కటే మా లక్ష్యం. చేపట్టాల్సిన పనుల్లో ముందు ఏవి పూర్తి చేయాలనేందుకే దశలుగా పేర్కొంటున్నాం. ప్రాజెక్టు పనులపై మూడు నెలల్లో ఒక నిర్ణయం తీసుకుని పనులు చేపట్టకపోతే.. మరో సీజన్ కూడా కోల్పోయే అవకాశం ఉంది. వరద తగ్గిన వెంటనే పనులు మొదలు పెడితే పనులు కొలిక్కి రావడానికి రెండు సీజన్లు పడుతుంది' అని ఆందోళన వ్యక్తంచేశారు.

జగన్ పాలనలో సర్వనాశనం

విభజన చట్టంలో అంశాలన్నీ అమలు చేస్తున్న దశలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చిందని.. ఇప్పుడు విభజన నాటి పరిస్థితి కంటే రాష్ట్రం ఇంకా దిగజారిపోయిందని చంద్రబాబు తెలిపారు. అప్పులు చేయడం, తలసరి ఆదాయం తగ్గిపోవడం, పోలవరం నాశనం, అమరావతి నాశనం, పరిశ్రమలు పారిపోవడం వంటివన్నీ జరిగాయని చెప్పారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ పథకాల్లో గత ఐదేళ్లలో ఏపీ అనేక రాష్ట్రాల కంటే వెనుకబడిందని, చివరి నుంచి మూడో స్థానంలో ఉందని తెలిపారు. కేంద్రం ఇచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని, కేంద్రంలో ఏ శాఖ దగ్గరకు వెళ్లినా.. రాష్ట్రం వెనుకబడిన గణాంకాలే చూపిస్తున్నారని అన్నారు. 'గడచిన ఐదేళ్లలో విభజన కంటే ఎక్కువ అధ్వాన స్థితికి ఏపీ పడిపోయింది. తలసరి ఆదాయం పడిపోయింది. రాష్ట్ర విభజన వల్ల, జగన్ విధ్వంస పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయినందునే పునర్నిర్మాణం కోసం సహాయం అడుగుతున్నాం. విభజన నుంచి తేరుకుని రాష్ట్రాన్ని మేం బాగు చేస్తున్న సమయంలో ప్రజలు ఆయన(జగన్)కు అవకాశం ఇచ్చారు. మొత్తం నాశనం చేశాడు. ఆయన ఐదేళ్ల పాలన చూసి మాకు చరిత్రాత్మక విజయాన్ని ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను మాకు అప్పగించారు. ఇప్పుడు ఏ శాఖకు వెళ్లినా.. గత ప్రభుత్వ నిర్వాకాలపై మమ్మల్ని అడుగుతున్నారు. జరిగిన తప్పిదాలకు వైసీపీ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

కేంద్రం కొత్తగా ఇచ్చింది లేదు..

- ఏపీకి ఇచ్చినవాటిపై రాజకీయమా?
- కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు సరికాదు
- ప్రస్తుత పరిస్థితికి ఆ పార్టీ కూడా కారణం: సీఎం

ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో చేసిన సాయంపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను సీఎం చంద్రబాబు తప్పుపట్టారు. తమ రాష్ట్రానికి ఇచ్చిన వాటిపై రాజకీయం చేయడం సరికాదన్నారు. 'రాష్ట్రానికి రావలసిన పాత బకాయిలే అడుగుతున్నాం తప్ప.. కొత్తగా ఇచ్చింది ఏమీ లేదు. విభజన నష్టం కంటే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. విభజన చట్టంలో ఉన్న అమరావతి, పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పెట్టుబడులు ఉన్నాయి. ప్రత్యేక హోదా ఇస్తామని విభజన చట్టం చేసే సమయంలో కాంగ్రెస్ చెప్పింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం.. విభజన చట్టంలో చెప్పిన అన్నింటినీ చేయాలని అడిగాం.. అదే చేశారు. ఏపీ పరిస్థితికి కాంగ్రెస్‌ది కూడా బాధ్యత' అని వ్యాఖ్యానించారు. విభజన సమయంలో ఆర్థిక పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పానని.. తెలంగాణకు, ఆంధ్రకు తలసరి ఆదాయంలో సుమారు రూ.30 వేలు తేడా ఉందని, దాన్ని సరిదిద్దడం కోసమే విభజన చట్టంలో అన్ని అంశాలు చేర్చారని వెల్లడించారు.

జస్టిస్ ఎన్వీ రమణతో చంద్రబాబు భేటీ

శనివారం సాయంత్రం వరకు నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు... అనంతరం జలశక్తి మంత్రి పాటిల్‌తో భేటీ అయ్యారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర పరిస్థితులపై చర్చించారు. ఎన్టీఆర్ హయాం నుంచి తమ అనుభవాలను కూడా జ్ఞప్తికి తెచ్చుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా జస్టిస్ రమణ కుటుంబ సభ్యులతోనూ ముఖ్యమంత్రి ముచ్చటించారు.


జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు

పదేళ్లలో ఏపీ అగ్రగామి

(మొదటి పేజీ తరువాయి)

గత కొంతకాలంగా తాను చేస్తున్న వినూత్న ప్రతిపాదన పీ-4 గురించి చంద్రబాబు ప్రస్తావించారు. దీన్ని జాతీయ స్థాయిలో అమలు చేయాలని కోరినప్పుడు సమావేశంలో సానుకూల ప్రతిస్పందన లభించింది. ఇప్పటి వరకూ అమలు చేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) వల్ల వచ్చే లాభాలేమిటో దేశానికి తెలుసని, కానీ ఇందులో ప్రజల భాగస్వామ్యం ఉండేలా నాలుగో 'పీ' కూడా చేరితేనే పేదరిక నిర్మూలన సాధ్యమని వివరించారు. ప్రధాని మోదీ ప్రతిపాదించిన సున్నా పేదరికం లక్ష్యాన్ని సాధించాలంటే పీ-4 అమలు చేయాలని తెలిపారు. సాంకేతికతను పేదల అభ్యున్నతికి ఉపయోగిస్తే అద్భుత ఫలితాలు ఉంటాయని చెప్పారు. నదుల అనుసంధానానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గతంలో స్వర్ణ చతుర్భుజి ద్వారా రహదారుల అనుసంధానం చేసి ఫలితాలు సాధించామని, ఇప్పుడు నదుల అనుసంధానం దేశానికి చారిత్రక అవసరమని స్పష్టం చేశారు. నదుల అనుసంధానంపై జాతీయ స్థాయిలో రోడ్ మ్యాప్‌ను రూపొందించాలని సూచించారు. పట్టిసీమ ద్వారా నదుల అనుసంధానం ఫలితాలను ఏపీ అనుభవిస్తోందని చంద్రబాబు వివరించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా వైద్య సదుపాయాలు అందించాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అధిక జనాభా దేశ బలహీనత కాదని, బలమని తెలిపారు. యువత మన దేశానికున్న అతిపెద్ద వనరుగా అభివర్ణించారు. యువతను సరిగ్గా వినియోగించుకుంటే అద్భుతాలు సాధించవచ్చన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల జీడీపీ సాధించడం ఏమంత కష్టం కాదని, మన దేశ సంపదను సక్రమంగా వినియోగించుకుంటే 50 ట్రిలియన్ డాలర్ల జీడీపీని సాధించడం అసాధ్యం కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. నీతిఆయోగ్ సమావేశం అనంతరం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సమావేశంలో దాదాపు పది అంశాలు ప్రస్తావించానని, ఏపీలో ఉన్న అవకాశాలను వివరించానని చెప్పారు. పోలవరం, అమరావతికి తోడ్పాటు అందిస్తున్నందుకు, విభజన హామీలను త్వరితగతిన పరిష్కరిస్తున్నందుకు కేంద్రానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మీలా జగన్ ఎప్పుడూ మాట్లాడలేదు: వేమిరెడ్డి

శనివారం రాత్రి ఎంపీలతో చంద్రబాబు విందు సమావేశం సరదాగా, ఛలోక్తుల మధ్య సాగింది. జగన్ సీఎంగా ఉన్న సమయంలో తామెప్పుడూ ఈ విధంగా కలసి కూర్చొని భోజనం చేయలేదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జగన్‌ను కలుసుకోవడమే కష్టంగా ఉండేదని చెప్పారు. "మీరు ఢిల్లీ వచ్చిన ప్రతిసారీ మీతో కూర్చుని భోజనం చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మీరు మా నియోజకవర్గం గురించి, పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాల గురించి అడగడం మాకెంతో ప్రోత్సాహకరంగా ఉంది' అని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబు స్పందిస్తూ... 'ఢిల్లీ అంటే నాకు మీరే కదా, ఇక్కడ మీరే రాష్ట్రానికి కళ్లు, చెవులు' అని అన్నారు. ప్రతి ఎంపీతోనూ ఆయన పార్లమెంట్ సమావేశాల గురించి చర్చించారు. ఎంపీలు అందరూ అల్పాహారం తీసుకోవడం చూసి.. 'డైటింగ్ చేస్తున్నారా?' అని ఛలోక్తి విసిరారు. 'ఇదీ మంచిదే.. తక్కువ తినాలి.. ఎక్కువ పనిచేయాలి' అని నవ్వుతూ అన్నారు. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాలు అధునాతనంగా అభివృద్ధి జరిగేలా చూడాలని తన పక్కనే కూర్చున్న పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకి చంద్రబాబు సూచించారు.

కుట్రతోనే నిప్పు

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనంపై సర్కారుకు సిసోడియా ప్రాథమిక నివేదిక



అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): "మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై, కుట్రపన్ని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని తగులబెట్టారు. వేలాది ఎకరాల అసైన్డ్, చుక్కల భూములను అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పద్ధతుల్లో నిషేధ జాబితా నుంచి తొలగించారు. ఇప్పుడు అవి బయటకు రాకూడదనే ఉద్దేశపూర్వకంగా రికార్డులు తగలబెట్టే పేరిట ఆఫీసుకు నిప్పుపెట్టారు" అని రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ ఆర్.పి. సిసోడియా సర్కారుకు నివేదించారు. మదనపల్లె పర్యటన తర్వాత అమరావతి వచ్చిన సిసోడియా శనివారమే ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను సమర్పించారు. ఈ ఘటనలో ప్రధాన కుట్రదారులుగా భావిస్తున్న మదనపల్లె మాజీ ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్ మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అలవిమాలిన అసలత్వం, అవినీతి, వైసీపీ నేతలతో అంటకాగి అడ్డగోలుగా భూములు ధారాదత్తం చేసినందుకు ప్రస్తుత మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడనున్నాయి దీంతోపాటు వారిపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని సిసోడియా సిఫారసు చేశారు. ఆఫీసు దహనం కేసులో వారిని ప్రధాన దోషులుగా చేర్చి, క్రిమినల్ కేసులు పెట్టి విచారణ చేయాలని కోరారు. మరోవైపు ఈ కుట్రలో సూత్రధారులు, పాత్రధారులుగా మురళి, గౌతమ్, పెద్దిరెడ్డి పీఏ తుకారాం, పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి వ్యవహరించారని ప్రాథమిక విచారణలో తేలినట్లు ఆయన సర్కారుకు నివేదించారు. ఆఫీసుకు నిప్పుపెట్టడానికి ముందే, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ 7 లీటర్ల షెల్ ఇంజన్ ఆయిల్‌ను తెప్పించుకొని కార్యాలయంలోని తన అల్మారాలో అందుబాటులో ఉంచుకున్నారని పేర్కొన్నారు. ఈ నెల 21న మురళి, హరిప్రసాద్, గౌతమ్, పెద్దిరెడ్డి మనుషులు సమావేశమయ్యారని, అదేరోజు రాత్రి 10 గంటల వరకూ గౌతమ్ ఆఫీసులోనే ఉన్నారని, 11.30 తర్వాత రికార్డు రూమ్‌కు నిప్పుపెట్టారని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. మంటలు త్వరగా అంటుకొని ఎక్కువ నష్టం జరిగేలా కెమికల్ ఏజెంట్లను కూడా వాడారని వివరించారు.

74వేల ఎకరాలు ఫ్రీహోల్డ్

మదనపల్లె డివిజన్ నుంచి అసైన్డ్ భూములను 22(ఏ) నుంచి తీసి పూర్తి హక్కులు కల్పించాలని తహసిల్దార్‌లు 79,107 ఎకరాలకు ప్రతిపాదనలు ఇచ్చారు. ఇందులో కలెక్టర్ 74,374 ఎకరాలను నిషేధ జాబితా నుంచి తొలగించారు. అందులో 2003 తర్వాత అసైన్ చేసిన భూములు కూడా ఉన్నాయని సిసోడియా తన నివేదికలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేలాది ఎకరాల భూమిని నిషేధ జాబితా నుంచి తొలగించాలని తహసిల్దార్లు ప్రతిపాదనలు ఇచ్చారని, వాటిని సరైన పరిశీలన చేయకుండానే ఆమోదించారని తేల్చారు. వివాదంలో ఉన్నవి, కోర్టులో ఉన్నవి, ప్రభుత్వ భూములు ఇంకా చట్టసవరణకు ముందు కేటాయించిన భూములను కూడా నిషేధ జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదనలు ఇచ్చారని ప్రభుత్వానికి నివేదించారు. కొన్ని కేసుల్లో తహసిల్దార్లు ఇచ్చిన నివేదికలను ఆర్డీఓ కార్యాలయంలో అడ్డగోలుగా ఫోర్జరీకి పాల్పడి తప్పుడు నివేదికలుగా మార్చారని వివరించారు ఆ ఒక్క డివిజన్‌లోనే 14వేల ఎకరాల చుక్కల భూములను రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించిన ఫైళ్లను నిశిత పరిశీలన చేయాల్సి ఉంటుందని, సమగ్ర విచారణతోనే ఇది సాధ్యమని తన నివేదికలో వివరించారు. కాగా, ఆఫీసులో 2,400 ఫైళ్లకు నిప్పుపెట్టారని ఆయన పేర్కొన్నారు. మదనపల్లె ఘటన నేపథ్యంలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, విశాఖ ఉమ్మడి జిల్లాల్లోని భూముల ఫైళ్లను కూడా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాత్రి 11:30 ప్రాంతంలో ఘటన

'మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఆఫీసు లోపల 7, వెలుపల 3 సీసీ కెమెరాలు ఉన్నాయి. జూలై 10 నుంచి అవి పనిచేయలేదు. జూలై 21వ తేదీ రాత్రి 11, 11:30 గంటల మధ్య ఘటన జరిగింది. ఫర్నీచర్, కంప్యూటర్లు, వేలాది ఫైళ్లు దహనమయ్యాయి. ఇవన్నీ 22ఏ, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్లు, చుక్కల భూములకు సంబంధించినవి. 17 నిమిషాల్లో ఘటనా స్థలికి ఫైరింజన్లు చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటల్లో కాలిపోకుండా 700 ఫైళ్లను కాపాడారు. ఘటనా స్థలంలో ఫోరెన్సిక్ ఆధారాలను పోలీసులు సేకరించారు. పోలీసుల అదుపులో 10 మంది ఉన్నారు. విచారణకు 36 మందిని పిలిపించారు. ఈ కేసుతో చాలా దగ్గర సంబంధం ఉన్న 11 మంది నుంచి స్టేట్‌మెంట్లు నమోదు చేశారు' అని సిసోడియా తన నివేదికలో పేర్కొన్నారు.

అల్మారాలో రూ.1.5 లక్షల నగదు

'21వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటలకు గౌతమ్ ఆఫీసుకు వచ్చారు. కొన్ని ఫైళ్లు పరిష్కరించాల్సిందిగా ఆర్డీవో హరిప్రసాద్ గౌతమ్‌ను ఆదేశించారు. గౌతమ్ చెక్క అల్మారాలో 1.5 లక్షల నగదు ఉంది. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఫైళ్లు పరిష్కరించేందుకు టి.కృష్ణనాయుడు అనే వ్యక్తి ఈ నగదు ఇచ్చారు. గౌతమ్ 15 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి ఏడు 22ఏ ఫైళ్లను క్లియర్ చేసే ప్రక్రియ చేపట్టారు. మదనపల్లె మండలంలో 6 గ్రామాలు, నిమ్మనపల్లె మండలంలో ఓ గ్రామానికి సంబంధించినవి. ఒక్కో డీల్‌కు లక్ష రూపాయలు ఇచ్చేలా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డితో డీల్ కుదుర్చుకున్నారు. పెద్దిరెడ్డి పీఏ తుకారం గౌతమ్‌ను మాధవరెడ్డికి పరిచయం చేశారు' అని నివేదికలో రాశారు.

ఆ రాత్రి ఆఫీసులో గౌతమ్

'సంఘటన జరిగిన రోజు నైట్ డ్యూటీలో ఉన్న వీఆర్ఏ రమణయ్య (56) సాయంత్రం 5:45 గంటలకు ఆఫీసుకు వచ్చారు. మాజీ ఆర్డీవో మురళి సాయంత్రం 6గంటలకు గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. ఆ సమయంలో సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ ఆఫీసులో ఉన్నారు. ఆర్డీవో, ఇతర అధికారులు వెళ్లాక గౌతమ్ ఒక్కరే ఆఫీసులో ఉన్నారు. రమణయ్య సమీపంలోని కుమార్తె ఇంటికి భోజనానికి వెళ్లి రాత్రి 8:30 గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికీ గౌతమ్ కంప్యూటర్‌తో పనిచేస్తున్నారు. రాత్రి 10 గంటల సమయంలో రమణయ్య నిద్రపోయారు. గౌతమ్ ఎంత సమయానికి ఆఫీసు నుంచి వెళ్లారో ఆయనకు తెలియదు. 11:30 గంటల సమయంలో మంటల శబ్దానికి రమణయ్య నిద్ర లేచారు. పెద్ద ఎత్తున అగ్నికీలలు చెలరేగినట్టు గమనించారు. దాదాపు 8 అడుగుల ఎత్తులో మంటలు ఎగిశాయి. ఆయన వెంటనే ఆఫీసు నుంచి బయటకు వచ్చి సమీపంలోని ఆర్డీవో నివాసానికి వెళ్లారు. అక్కడ వాచ్‌మెన్ రెడ్డెప్ప లేకపోవడంతో రమణయ్య తన పై అధికారిణి, డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి సమాచారం అందించారు' అని నివేదికలో రాశారు.

నివేదికలో ప్రాథమిక నిర్ధారణలు...

- ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదని నిర్ధారణ అయింది.
- ప్రాథమికంగా ఇందులో బయటి వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు అనిపించడం లేదు.
- సీసీ కెమెరాల మరమ్మతులు చేయకపోవడం, విలువైన రికార్డులు ఉంచిన కార్యాలయంలో దోమల కాయిల్స్ కాల్చడానికి అనుమతించడం, కార్యాలయంలో ఇంజన్ ఆయిల్ ఉంచడానికి సీనియర్ అసిస్టెంట్‌కు అనుమతి ఇవ్వడం వంటివి సంబంధిత అధికారుల పూర్తి నిర్లక్ష్యానికి, కర్తవ్య ఉల్లంఘనకు నిదర్శనం.
- దహన తీవ్రతను బట్టి మంటలు వేగంగా వ్యాపించడానికి రసాయనాలు ఉపయోగించినట్లు తెలుస్తోంది.
- కార్యాలయంలో భూమికి సంబంధించిన ఫైళ్ల ప్రాసెసింగ్‌లో భారీ అవకతవకలు జరిగాయి. చుక్కల భూములు, డి-పట్టా భూములు, 22ఏ(ఐ) డీనోటిఫికేషన్‌కు సంబంధించి పలు ప్రతిపాదనలు అక్రమంగా ప్రాసెస్ అయినట్లు తెలుస్తోంది.
- సాక్ష్యాలను నాశనం చేయడానికే భూ సంబంధిత రికార్డులను ఉద్దేశపూర్వకంగా ప్రణాళిక ప్రకారం తగులబెట్టినట్లు తెలుస్తోంది.
- మాజీ ఆర్డీవో మురళి, తుకారాం (పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పీఏ), మాధవరెడ్డి (పెద్దిరెడ్డికి సన్నిహితుడు, అనుచరుడు) ఆదేశాల మేరకు గౌతమ్ ఈ పని చేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీన్ని సీఐడీ అధికారులు పక్కా ఆధారాలతో రుజువు చేయాల్సిన అవసరం ఉంది.
- మాజీ ఆర్డీవో మురళి తప్పుడు నివేదికలు సృష్టించడం, ఫోర్జరీ సంతకాలు చేయడం, 22ఏ కింద పెద్ద మొత్తంలో భూములు మళ్లించడం, డి-పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేయడం, ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా చుక్కల భూములను క్రమబద్ధీకరించడం వంటి నేరపూరిత కుట్రలకు పాల్పడ్డారు.
- ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్.. నేరపూరిత నిర్లక్ష్యం, భూ వ్యవహారాల్లో అవినీతి, చిత్తశుద్ధి లోపించడం, కిందిస్థాయి అధికారులపై పర్యవేక్షణ కొరవడటం వంటి నేరాలకు పాల్పడ్డారు.
- గౌతమ్ నేరపూరిత కుట్ర, నకిలీ రికార్డులు సృష్టించడం వంటి నేరాలకు పాల్పడ్డారు.

తీసుకోవాల్సిన చర్యలు

- మొత్తం 700 ఫైళ్లను పరిశీలించి, అవకతవకలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలి.
- ఎమ్మార్వోలు, కలెక్టర్ కార్యాలయం నుంచి వివరాలు తీసుకొని మిగిలిన ఫైళ్లను మళ్లీ తయారు చేయాలి.
- సీనియర్ అసిస్టెంట్ గౌతమ్, మాజీ ఆర్డీవో మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి. వారిపై ఉన్న క్రిమినల్ కేసుతో పాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి.
- డివిజన్‌లో ఫ్రీహోల్డ్‌గా ఉన్న భూములన్నింటినీ క్షుణ్ణంగా పునఃపరిశీలన చేయాలి.

అబ్దుల్ కలాం ఇప్పుడు గుర్తొచ్చారా!

- నెటిజన్ల ట్రోలింగ్‌కు దొరికిపోయిన జగన్

అమరావతి, జులై 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి శనివారం మరోసారి నెటిజన్ల ట్రోలింగ్‌కు దొరికిపోయారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ జగన్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్‌పై అనేకమంది నెటిజన్లు విరుచుకుపడ్డారు. అబ్దుల్ కలాం ఇప్పుడు గుర్తుకువచ్చారా? అధికారంలో ఉన్నప్పుడు ఆయన పట్ల వ్యవహరించిన తీరు గుర్తులేదా? అంటూ వారు విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతిభ అవార్డులకు ఉన్న అబ్దుల్ కలాం పేరు తొలగించి వైఎస్ఆర్ పేరు పెట్టినప్పుడు కలాం దేశం గర్వించే శాస్త్రవేత్త అని గుర్తుకురాలేదా? అని కొందరు నిలదీశారు. విశాఖ నగరంలో అబ్దుల్ కలాం వ్యూ పాయింట్ అని పర్యాటక ఆకర్షణలో భాగంగా పేరు పెడితే దానిని వీకేసీ వైఎస్ఆర్ వ్యూ పాయింట్ అని పేరు పెట్టినప్పుడు కలాం గొప్పతనం ఎక్కడికిపోయిందని మరి కొందరు ప్రశ్నించారు. ఇటువంటి చర్యలకు పాల్పడ్డ జగన్‌కు అబ్దుల్ కలాం పేరెత్తే అర్హత లేదని కొందరు వ్యాఖ్యానించారు.

పోలీసుల అదుపులో మాధవరెడ్డి సన్నిహితులు!

- రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగితో పాటు మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్
- మిథున్‌రెడ్డి పీఆర్వోకు పిలుపు
- మరికొందరి కోసం గాలింపు
- నేడో రేపో ఓ మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు
- ఫైళ్ల దహనం కేసులో దూకుడు

రాయచోటి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత ఘటనలో పోలీసులు జోరు పెంచారు. ఐదు రోజుల పాటు ముమ్మరంగా విచారించిన పోలీసులు శనివారం తెల్లవారుజాము నుంచి నిందితులు, అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు రైస్‌మిల్లు మాధవరెడ్డికి సన్నిహితులైన ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, ఎంపీ మిథున్ రెడ్డి పీఆర్వోను విచారణకు పిలిపించారు. దీంతో గత ఐదేళ్లుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అండ చూసుకుని పలు భూఆక్రమణలకు, దౌర్జన్యాలకు పాల్పడిన పలువురు వైసీపీ నాయకులు ఊర్లొదిలి తలో దిక్కుకు పారిపోతున్నారు. పోలీసుల అదుపులో ఉన్న ఆర్డీవోలు ఇచ్చిన సమాచారం మేరకు.. ఒకటి రెండు రోజుల్లో వైసీపీకి చెందిన ఓ తాజా మాజీ ఎమ్మెల్యేను విచారణకు పిలిపించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు శనివారం తెల్లవారుజామున మాధవరెడ్డికి సన్నిహితుడైన మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటచలపతిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గత ఐదేళ్లలో తాము చేసిన అక్రమాలు వెలుగులోకి రాకూడదనే పెద్దిరెడ్డి అనుచరులు ఫైళ్లను కాల్చేశారనే అనుమానాలు ఉన్నాయి. దర్యాప్తు అధికారులు సైతం ఈ ఆరోపణలను దాదాపుగా ధ్రువీకరించారు. పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడైన మాధవరెడ్డిపైన పోలీసులు గురి పెట్టారు. ప్రస్తుతం మాధవరెడ్డి పరారీలో ఉండడంతో ఆయనతో సన్నిహిత సంబంధాలున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇందులో భాగంగానే జింకా వెంకటచలపతిని అదుపులోకి తీసుకున్నారు. తట్టివారిపల్లె బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్న మిథున్‌రెడ్డి అనుచరుడు బాబ్జాన్ కోసం పోలీసులు శనివారం తెల్లవారుజామున ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. ఆయన అందుబాటులో లేనట్లు తెలిసింది. ఎంపీ మిథున్‌రెడ్డికి పీఆర్వోగా పనిచేస్తున్న అక్కులప్పకు పోలీసులు ఫోన్ చేసి విచారణకు సహకరించాలని సూచించారు. డీఎస్పీ ఎదుట హాజరై విచారణకు తాను సహకరిస్తానని ఆయన చెప్పినట్లు తెలిసింది. ఆయన ప్రస్తుతం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఏపీయూడబ్ల్యూజే డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. పోలీసులు మొదట మదనపల్లె పట్టణం మిట్టపల్లెలో అక్కులప్ప తండ్రి నివాసం ఉంటున్న ఇంటిని సోదాలు చేశారు. అక్కులప్ప ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది. మాధవరెడ్డికి సన్నిహితంగా ఉండే రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి క్రిష్టారెడ్డిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

విచారణకు తాజా మాజీ ఎమ్మెల్యే?

మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో వైసీపీకి చెందిన తాజా మాజీ ఎమ్మెల్యేను కూడా ఒకటి రెండు రోజుల్లో విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన నియోజకవర్గ పరిధిలోని కొన్ని మండలాల్లో 22ఏ ఫైళ్లు కొన్ని నిబంధనలకు విరుద్ధంగా, మరికొన్ని చాలా వేగంగా క్లియర్ అయినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న ఆర్డీవో మురళిని పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో మాజీ ఎమ్మెల్యే గురించి బయటపడినట్టు సమాచారం. దీంతో మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఆర్డీవో హరిప్రసాద్ దగ్గర నుంచి కూడా పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ సమాచారంతోనే పలువురు వైసీపీ నాయకులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం.

బెంగళూరు ఎయిర్‌పోర్టులో.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టు!



తిరుపతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు, మొన్నటి ఎన్నికల్లో చంద్రగిరి వైసీపీ అభ్యర్థి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అరెస్టయ్యారు. తండ్రి భాస్కరరెడ్డి, తమ్ముడు హర్షిత్‌తో కలసి దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా శనివారం రాత్రి బెంగళూరు దేవనహళ్లి ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పులివర్తి నానిపై హత్యాయత్నం కేసులో మోహిత్‌రెడ్డి నిందితుడిగా ఉన్న నేపథ్యంలో మోహిత్‌పై ఆంధ్ర సిట్ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. బోర్డింగ్ పాస్ చెక్ చేసే సమయంలో ఇమిగ్రేషన్ అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఆయనతో పాటు దుబాయ్ వెళ్లాల్సిన భాస్కర రెడ్డి, హర్షిత్‌రెడ్డి కూడా ప్రయాణం విరమించుకుని మోహిత్ వెంటే ఉన్నారు. అధికారులతో భాస్కరరెడ్డి వాదనకు దిగడంతో తండ్రీకొడుకులు ముగ్గురినీ విమానాశ్రయంలోనే నిర్బంధించారు. మోహిత్‌రెడ్డిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచిన అనంతరం ఏపీ పోలీసులకు అప్పగించనున్నారు. తిరుపతి నుంచి ఈస్ట్ డీఎస్పీ రవిమనోహరాచారి, ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ మురళీమోహన్.. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఏఆర్ పోలీసు బలగాలతో బెంగళూరు వెళ్లారు. మోహిత్‌ను అదుపులోకి తీసుకుని వీరు ఆదివారం వేకువజామున తిరుపతి చేరుకునే అవకాశముంది. ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో న్యాయమూర్తి ఇంటివద్ద హాజరుపరుస్తారని అంటున్నారు. ఈ నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో పోలీసు బలగాలు పెద్దఎత్తున మోహరించాయి. చెవిరెడ్డి నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

దుబాయ్ పారిపోయే యత్నమా?

ఎన్నికల్లో చంద్రగిరి పులివర్తి నానిపై కౌంటింగ్ కేంద్రమైన తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద హత్యాయత్నం జరిగింది. దీనిపై ఈసీ తీవ్రంగా స్పందించి దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసింది. ఈ కేసులో మోహిత్‌రెడ్డి నిందితుడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అరెస్టు నుంచి తప్పించుకునేందుకు దుబాయ్ పారిపోయేందుకు ప్రయత్నించి దొరికిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మోహిత్ తన స్నేహితుడి పెళ్లికి హాజరయ్యేందుకు దుబాయ్ వెళ్లాలనుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు. శనివారం బెంగళూరు నుంచి ఎమిరేట్స్ ఫ్లైట్‌లో తండ్రి, తమ్ముడితో పాటు దుబాయ్‌కు టికెట్లు బుక్ చేసుకున్నారు. రాత్రి 8 గంటలకు ఆ విమానం ఎక్కాల్సి ఉండగా ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఆదివారం ఉదయం పెళ్లికి హాజరై అదే రోజు రాత్రి 11.10 గంటల ఫ్లైట్‌కు తిరిగి బెంగళూరుకు ఫ్లైట్‌లో బయల్దేరేలా టికెట్లు బుక్ చేసుకున్నట్లు మోహిత్ సన్నిహితులు అంటున్నారు. సోమవారం బెంగుళూరు నుంచి తిరుపతి వచ్చి.. మంగళవారం నియోజకవర్గంలోని 1,800 మంది కార్యకర్తలతో షిర్డీ వెళ్లేందుకు ప్రత్యేక రైలు కూడా బుక్ చేశారని చెబుతున్నారు.



భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవల లావోస్‌లో పర్యటించినప్పుడు అయోధ్యలోని బాలరాముడి స్మారక స్టాంపును అక్కడ ఆవిష్కరించారు. భారత్, లావోస్ ఇరు దేశాలు సంయుక్తంగా ఈ స్టాంపును విడుదల చేశాయి. రామ్‌లల్లా విగ్రహంతో రూపొందించిన మొట్టమొదటి స్టాంపు ఇదే కావడం గమనార్హం.

రాష్ట్రాల స్థాయిలో నదుల గ్రిడ్

- జలవనరుల సమర్థ వినియోగానికి ఏర్పాటు
- వ్యక్తిని కేంద్రంగా తీసుకుని పేదరికనిర్మూలన
- గ్రామస్థాయి వికసిత్ భారత్ లక్ష్యానికి ఇదే ప్రాతిపదిక
- విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీ పడండి!
- రాష్ట్రాల సహకారంతోనే 2047 నాటికి వికసిత్ భారత్
- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోదీ



నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): జల వనరుల సమర్థ వినియోగానికి నీతి ఆయోగ్ వేదికగా ప్రధాని మోదీ అత్యంత కీలక సూచన చేశారు. ప్రతి రాష్ట్రం వారి స్థాయిలో నదుల గ్రిడ్‌ను ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. నదీ జలాలపై దేశంలోని పలు రాష్ట్రాల మధ్య తీవ్ర స్థాయి వివాదాలున్న నేపథ్యంలో ప్రధాని ఈ సూచన చేయడం గమనార్హం. శనివారం రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన 9వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ప్రధాని ప్రసంగించారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ప్రతి భారతీయుడూ కలలు కంటున్నాడని, ఇందులో రాష్ట్రాలు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని.. సహకార సమాఖ్య విధానం ద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని చెప్పారు. శాంతిభద్రతలు, సుపరిపాలన, మౌలిక సదుపాయాలు దీనికి అత్యంత కీలకమని వివరించారు. దేశంలో పేదరికం నిర్మూలనకు ప్రధాని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి వికసిత్ భారత్ లక్ష్యానికి ఇదే ప్రాతిపదిక కావాలని.. దీనిని ఓ కార్యక్రమంలా కాకుండా వ్యక్తి కేంద్రంగా చేపడదామని రాష్ట్రాలను కోరారు. పేదరికాన్ని తగ్గించడం కాదు, పేదరికమే లేని దేశంగా మారేలా కృషి చేయాలన్నారు. కింది స్థాయిలో పేదరికాన్ని నిర్మూలించినపుడే దేశంలో గొప్ప పరివర్తన జరుగుతుందని వ్యాఖ్యానించారు. కాగా, కేంద్రం, రాష్ట్రాలు సమష్టిగా కృషి చేస్తేనే దేశం అగ్రగామిగా ఎదుగుతుందన్నారు. ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లా 2047 నాటికి అభివృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు.

అవకాశాలకు తగ్గట్లు విధానాలు

వివిధ రంగాల్లో ఏర్పడిన అవకాశాలను ఉపయోగించుకుని వినూత్న విధానాలను రూపొందించాలని మోదీ కోరారు. వాటిని అమలుచేసేలా కూడా చూడాలని అన్నారు. జనాభా నిర్వహణ ప్రణాళికలను రూపొందించాలని కోరారు. వృద్ధుల సంఖ్య పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకుని జనాభా నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ అధికారుల సామర్థ్యాన్ని పెంచాలని, ఇందుకోసం సామర్థ్య నిర్మాణ కమిషన్‌తో కలిసి పనిచేయాలని రాష్ట్రాలకు నిర్దేశించారు. దేశం నిపుణులైన మానవ వనరుల కోసం ఎదురు చూస్తోందన్నారు. "వ్యవసాయంలో ఉత్పాదకత పెరగాలి. రైతులకు మార్కెట్‌తో అనుసంధానం కల్పించాలి. తక్కువ వ్యయంతో వెంటనే ఫలితాలు సాధించేలా చూడాలి. నేల సారం పెరిగే సహజ పద్ధతులను పాటించాలి. పంట ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లభించేలా చూడాలి" అని కోరారు.



పెట్టుబడుల వాతావరణాన్ని కల్పించాలి

పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని రాష్ట్రాలను కోరిన ప్రధాని.. అవసరమైన విధానాన్ని రూపొందించాలని నీతి ఆయోగ్‌ను ఆదేశించారు. ఇందులో పెట్టుబడులకు అవసరమైన ప్రణాళికలు ఉండాలని నిర్దేశించారు. నీతి ఆయోగ్ రూపొందించిన ఆకాంక్షపూరిత జిల్లాల కార్యక్రమాన్ని మోదీ ప్రశంసించారు. గత పదేళ్లగా భారత దేశం స్థిరంగా అభివృద్ధి చెందుతోందని, పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా పనిచేసి మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేలా చేయాలని లక్ష్యం పెట్టుకున్నారని చెప్పారు. సమావేశానికి 26 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరయ్యారు. కొన్ని రాష్ట్రాలు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించేందుకు తమ వ్యూహాలను సమర్పించాయి. బిహార్ సీఎం నీతీశ్ కుమార్ అసెంబ్లీ సమావేశాలు ఉండడంతో నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకాలేదు.

బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో మోదీ భేటీ

న్యూఢిల్లీ, జూలై 27: బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శనివారం భేటీ అయ్యారు. 'ముఖ్యమంత్రి పరిషద్' పేరుతో బీజేపీ నిర్దిష్ట కాల వ్యవధిలో ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తుంటుంది. కీలకమైన పథకాలను సమీక్షించడంతో పాటు, మంచి పాలన విధానాలను పాటించడం, కేంద్ర సంక్షేమ పథకాలను అమలు చేయడం వంటి అంశాలపై చర్చలు జరుపుతారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు బీజేపీ సీఎంల భేటీని ఏర్పాటు చేసింది.

నీతిఆయోగ్ సమావేశం నుంచి మమత వాకౌట్



న్యూఢిల్లీ, జూలై 27: కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమ బెంగాల్‌కు నిధుల కేటాయింపులో వివక్ష, రాష్ట్ర విభజన ప్రయత్నాలపై నిలదీస్తానంటూ నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన ఆ రాష్ట్ర సీఎం మమత మధ్యలోనే వాకౌట్ చేశారు. తాను మాట్లాడుతుండగా మధ్యలోనే మైక్ ఆపివేయడాన్ని నిరసిస్తూ బాయ్‌కాట్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకు 20 నిమిషాలు, గోవా, అసోం, ఛత్తీస్‌గఢ్ సీఎంలకు 15 నిమిషాల వరకు కేటాయించారని.. తనకు మాత్రం 5నిమిషాలకే మైక్ బంద్ చేశారని మమత ఆక్షేపించారు. ఇది అవమానకరమని ఇంకెపుడూ నీతి ఆయోగ్ భేటీకి రానని ప్రకటించారు. ఆ వెంటనే కోల్‌కతాకు వెళ్లిపోయారు. ప్రతిపక్ష పార్టీల నుంచి నీతి ఆయోగ్‌కు హాజరైన ఏకైక సీఎం తానేనని, కనీసం 30 నిమిషాల సమయం ఇవ్వాల్సిందని అన్నారు. మమత నిర్ణయాన్ని తమిళనాడు సీఎం స్టాలిన్ సమర్థించారు. కాగా 5 నిమిషాలే కేటాయించారన్న మమత ఆరోపణలను నిర్మలా సీతారామన్ ఖండించారు. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ కూడా మమత ఆరోపణల్లో నిజం లేదని తెలిపింది. ఆమెకు కేటాయించిన సమయం అయిపోయినట్లు మాత్రమే గడియారం చూపిందంది. ప్రతిసీఎంకు 7 నిమిషాల సమయం ఇచ్చామని నీతి ఆయోగ్ సీఈవో సుబ్రమణియన్ చెప్పారు.

మిమ్మల్ని రాష్ట్రం నుంచే బహిష్కరించారు!

ఆ విషయం గుర్తుందా?

- మీలాంటి వ్యక్తి దేశానికి హోం శాఖ మంత్రా?
- అమిత్ షాపై శరద్ పవార్ మాటకు మాట



న్యూఢిల్లీ, జూలై 27: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, ఎన్సీపీ(ఎస్పీ) నేత, సీనియర్ నాయకుడు శరద్ పవార్‌ల మధ్య రాజకీయం వేడెక్కింది. ఇటీవల మహారాష్ట్రలోని పూణేలో జరిగిన బీజేపీ సదస్సులో శరద్ పవార్‌ను ఉద్దేశించి 'అవినీతి చక్రవర్తి' అని షా వ్యాఖ్యానించారు. "ప్రతిపక్షాలు అవినీతి గురించి మాట్లాడుతున్నాయి. అసలు దేశ రాజకీయాల్లో అతిపెద్ద అవినీతి చక్రవర్తి ఎవరైనా ఉంటే ఆయన శరద్ పవారే" అని విమర్శలు గుప్పించారు. దీనికి కౌంటర్‌గా తాజాగా స్పందించిన పవార్.. "మిమ్మల్ని గుజరాత్ నుంచి బహిష్కరించిన విషయం గుర్తుందా? లేక మరిచిపోయారా? మీలాంటి వ్యక్తి దేశానికి హోం శాఖ మంత్రిగా ఉండడం దురదృష్టకరం" అని నిప్పులు చెరిగారు. "ప్రస్తుతం ఈ దేశానికి హోం మంత్రిగా ఉన్న వ్యక్తి గుజరాత్‌లో చట్టాన్ని దుర్వినియోగం చేశారన్న కారణంగా సుప్రీంకోర్టు ఆయనకు రాష్ట్ర బహిష్కారం విధించింది. దీనిని బట్టి మనం ఎటు వెళ్తున్నామో, ఈ దేశం ఎవరి చేతుల్లో ఉందో ఆలోచించుకోవాలి" అని పవార్ వ్యాఖ్యానించారు. సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును విచారించిన సుప్రీం కోర్టు 2010లో అమిత్ షాపై రాష్ట్ర బహిష్కరణ విధించింది. కానీ, తర్వాత ఆయన నిర్దోషి అని తేల్చింది.

ఐఎస్ఎస్‌కు వెళ్లనున్న గగన్‌యాన్ వ్యోమగామి

న్యూఢిల్లీ, జూలై 27: భారత తొలి మానవ సహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్' కోసం శిక్షణ పొందుతున్న నలుగురు వ్యోమగాముల్లో ఒకరు.. త్వరలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్‌కు) వెళ్లనున్నారని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. నాసాకు అనుబంధంగా పని చేస్తున్న ఆక్సియోమ్ స్పేస్ అనే సంస్థతో ఇస్రో ఈ మేరకు ఒప్పందం చేసుకుందని, దాంట్లో భాగంగా ఐఎస్ఎస్ పర్యటన జరగనుందన్నారు. లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు.

పెరుగుతున్న తల, మెడ క్యాన్సర్లు

- భారత్‌లో 26% కేసులు ఇవే: నివేదిక

న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోని కేన్సర్ రోగుల్లో దాదాపు 26% మందికి తల, మెడలో కణితులు ఉన్నాయని, ఇలాంటి కేసుల సంఖ్య పెరుగుతోందని ఒక అధ్యయనం వెల్లడించింది. ఢిల్లీకి చెందిన కేన్సర్ ముక్త్ భారత్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ మార్చి 1 నుంచి జూన్ 30 వరకూ తన హెల్ప్‌లైన్ నంబర్‌కు వచ్చిన కాల్ డేటాను క్రోడీకరించి అధ్యయనం నిర్వహించింది. దేశవ్యాప్తంగా 1,869 మంది రోగులపై నిర్వహించిన ఈ సర్వే ఫలితాలను శనివారం ప్రపంచ తల, మెడ కేన్సర్ దినం సందర్భంగా విడుదల చేసింది. పొగాకు వినియోగంతో పాటు హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ల కారణంగా దేశంలో తల, మెడ కేన్సర్ కేసులు, ప్రత్యేకంగా యువకుల్లో బాగా పెరుగుతున్నాయని కేన్సర్ ముక్త్ భారత్ ప్రచారానికి నేతృత్వం వహిస్తున్న సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ ఆశిశ్ గుప్తా తెలిపారు. కేన్సర్ ముక్త్ భారత్ ప్రచారంలో భాగంగా జాతీయ స్థాయిలో ఉచిత హెల్ప్‌లైన్ 93-555-20202ను ఇటీవలే ప్రారంభించారు. సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకూ పనిచేసే ఈ నంబర్‌కు కేన్సర్ రోగులు కాల్ చేసి ప్రముఖ అంకాలజిస్టులతో నేరుగా మాట్లాడవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రకు 50,474 కోట్లు

- కోల్పోయిన కళ మళ్లీ వస్తోంది
- ఢిల్లీలో జగన్ ధర్నా రాజకీయ డ్రామా
- అసెంబ్లీకి వెళ్లకపోవడం సరికాదు: కేంద్ర మంత్రి మురుగన్



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మురుగన్

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ50,474 కోట్లు కేటాయించినట్లు కేంద్ర సమాచార ప్రసార, పాడి పరిశ్రమ, ఫిషరీస్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. దీని వల్ల.. కోల్పోయిన కళను రాష్ట్రం మళ్లీ సాధిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. శనివారం విజయవాడలోని ఒక హోటల్లో మేధావులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర బీజేపీ నేతలు పాతూరి నాగభూషణం, లంకా దినకర్, యామినీ శర్మ, షేక్ బాజీ, శ్రీరామ్ తదితరులతో కలిసి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళుర్పించారు. అనంతరం మురుగన్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని లేని రాష్ట్రంలో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, అన్నపూర్ణగా పేరొందిన రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరానికి రూ.12 వేల కోట్లు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, రైల్వే ప్రాజెక్టులు, టూరిజం అభివృద్ధి, రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు కలిపి మొత్తం రూ.50 వేల కోట్లకు పైగా మోదీ ప్రభుత్వం కేటాయించిందన్నారు.'రాయలసీమ, ఉత్తరాంధ్ర లాంటి జిల్లాల్లో 8.2శాతం ఎకానమీ వృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉంది. విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లకు ప్రాధాన్యం లభించింది. స్టార్టప్ కంపెనీలకు అనువుగా ఉన్న ఏపీ.. కేంద్ర సహకారంతో తయారీ సంస్థల హబ్‌గా మారబోతోంది. ఇక్కడి ఆక్వా రైతుల కోసం రొయ్యల బ్రీడింగ్ కేంద్రాలు అభివృద్ధి చేయబోతున్నాం. కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వృద్ధికి, ఏపీ అభివృద్ధికి దోహదపడేలా ఉంది' అని వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఢిల్లీలో జగన్ చేసింది కేవలం రాజకీయ డ్రామా అని మురుగన్ ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో దారుణమైన ఓటమితో దిక్కుతోచని స్థితిలో ఉన్న వైసీపీ అధ్యక్షుడు.. దానిని జీర్ణించుకోలేక నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. చట్టసభల్లో పది శాతం సీట్లు ఉంటేనే ప్రధాన ప్రతిపక్ష హోదా వస్తుందని స్పష్టం చేశారు. ప్రజలిచ్చిన తీర్పును రాజకీయ పార్టీలు గౌరవించాల్సిందేనని, నిస్సహాయ స్థితిలో ఉన్న పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి వెళ్లకపోవడం సరికాదన్నారు. వైద్య విద్యలో అడ్మిషన్ల కోసం 'నీట్' అవసరం లేదంటూ తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందని, జాతీయ స్థాయిలో సత్తా చూపగలిగిన తమిళ విద్యార్థులకు అన్యాయం చేయడమేనని చెప్పారు.

రాజధాని లేదనే నిధులు: అథావలే

మెదక్, జూలై 27: ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకపోవడం వల్లే బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించామని కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథావలే చెప్పారు. తెలంగాణలోని మెదక్‌లో శనివారం కేంద్ర బడ్జెట్‌పై అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనన్నారు. తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేశంలోని 85 శాతం మంది పేదల కోసం అది పని చేస్తోందన్నారు. మోదీ ప్రభుత్వానికి ఎలాంటి ఢోకాలేదని.. ఐదేళ్లు కొనసాగుతుందని తెలిపారు.

కేంద్రమంత్రి మురుగన్‌తో పరిశ్రమల సమాఖ్య ప్రతినిధుల భేటీ

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి లోగనాథన్ మురుగన్‌తో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) ప్రతినిధులు శనివారం విజయవాడలో భేటీ అయ్యారు. వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై విశ్లేషణ కోసం మురుగన్ వివిధ రంగాలకు చెందిన మేధావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలో ప్రతినిధి బృందం ఏపీ ఆర్థికాభివృద్ధి కోసం రూపొందించిన రోడ్ మ్యాప్‌ను సమర్పించింది. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఎంఎస్ఎంఈ ప్రొక్యూర్‌మెంట్, ఈ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు, పీఎం గతిశక్తి పథకం, విమానాశ్రయాలు వాటి కనెక్టివిటీ, ఓడరేవులు, పబ్లిక్ సెక్టార్ ఆఫీసుల ఎస్టాబ్లిష్‌మెంట్, మెడ్‌టెక్, పీసీపీఐఆర్ జోన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం డెవలప్‌మెంట్ తదితర రంగాల అభివృద్ధిపై చర్చించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సూర్యనారాయణను బహిష్కరిస్తున్నాం

» ఏపీజీఈఏ ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు

విజయవాడ (ధర్నాచౌక్), జూలై 27 : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుళ్ల నాగసాయిలను సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్‌రావు తెలిపారు. కేఆర్ అరాచకం, స్వార్థ ప్రయోజనాలు, కుట్రలు, కుతంత్రాలు భరించలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా డి.శ్రీకాంత్ రాజును ఎన్నుకున్నట్టు చెప్పారు. సంఘం విరాళాలు, యూనియన్‌కు చెందిన డైరీ సొమ్మును నాగసాయితో తన సొంత అకౌంట్‌లో జమ చేయించుకున్నారని శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇన్నాళ్లు సంఘాన్ని అభివృద్ధి చేస్తున్నాడని అనుకున్నాం కాని, దాని మాటున స్వార్థ ప్రయోజనాల కోసం తమను వాడుకుంటున్న సూర్యనారాయణ నైజాన్ని పసిగట్టలేకపోయామన్నారు. త్వరలోనే వేలాది మందితో మహాజన సభను నగరంలో నిర్వహించి అన్ని తీర్మానాలు మార్పులు చేర్పులు ప్రకటిస్తామన్నారు.

డీలర్లను తిరిగి నియమించాలి: డీలర్ల సంఘం

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాజకీయ కారణాలతో నిర్దాక్షిణ్యంగా తొలగించిన రేషన్ డీలర్లను ప్రస్తుత ప్రభుత్వం తిరిగి నియమించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సమాఖ్య అధ్యక్షుడు దివి లీలామాధవరావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక గ్రామాలలో వైసీపీ కార్యకర్తలకు రేషన్ షాపులు ఇప్పించడం కోసం గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాల పేరుతో అక్రమ నియామకాలు చేసిందని ఆయన ఆరోపించారు. అంతకుముందే ఆహార భద్రత చట్టం నిబంధనల ప్రకారం నియామకాలు పొందిన పర్మినెంట్ డీలర్లను తొలగించడం చట్టవిరుద్ధమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు అపహరించి అత్తారింటికి..!

» ఆత్మకూరులో ఘటన



బస్సును అపహరించిన దర్గయ్య

ఆత్మకూరు/పగిడ్యాల, జూలై 27: అత్తారింటికి వెళ్లేందుకు ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సునే అపహరించాడు. ఈ ఘటన శనివారం నంద్యాల జిల్లా ఆత్మకూరులో చోటుచేసుకుంది. ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురానికి చెందిన దర్గయ్యకు పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రికి చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. అయితే ఆమె కొంతకాలంగా పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారు జామున భార్యా పిల్లలు గుర్తుకు రావడంతో అత్తారింటికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. గ్రామం నుంచి రాత్రికే ఆత్మకూరుకు వచ్చాడు. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో రాత్రి పట్టణ శివార్లలోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో పడుకున్నాడు. ఉదయం లేచాక.. అక్కడే పార్కింగ్ చేసిన ఆర్టీసీ అద్దె బస్సులోకి వెళ్లాడు. ఎవరూ లేకపోవడం, బస్సు తాళాలు కూడా బస్సుకే ఉండడంతో డ్రైవింగ్ చేసుకుంటూ ముచ్చుమర్రికి తీసుకెళ్లాడు. అయితే ఆర్టీసీ బస్సు మాయం కావడంతో యజమాని హరికృష్ణ ఆందోళనకు గురయ్యాడు. చివరికి బస్సు ముచ్చుమర్రికి చేరిందని తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అక్కడి పోలీసులు ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకుని ఆత్మకూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ.. దర్గయ్యను స్టేషన్‌కు పిలిపించి మందలించారు. అయితే దర్గయ్యకు మానసిక స్థితి సరిగా లేదని, అందుకే ఆర్టీసీ బస్సును తీసుకెళ్లినట్లు తెలిసింది.

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

కర్నూలు, జూలై 27: కర్నూలు నగర శివారు జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలలో కార్తీక్ నాయుడు (19) అనే విద్యార్థి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పార్వతీపురం మన్యం జిల్లా జీయమ్మ వలస మండలం కుడుమ గ్రామానికి చెందిన కార్తీక్ నాయుడు స్థానిక ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఈసీఈ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. ప్రాంగణంలోని కలాం వసతి గృహంలో ఉంటున్నాడు. సెలవులకు ఇంటికి వెళ్లిన కార్తీక్ తిరిగి కళాశాలకు వచ్చాడు. శనివారం సాయంత్రం హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో 9వ అంతస్థు నుంచి కిందకు దూకాడు. వెంటనే కళాశాల ప్రాంగణంలో ఉన్న అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని వద్ద ఓ సూసైడ్ నోటు పోలీసులకు లభించింది. అందులో 'జీవితంలో సెటిల్ అవుతాననే నమ్మకం రోజురోజుకూ సన్నగిల్లుతోందని, ఒంటరి జీవితం గడపడం ఇష్టం లేదని' రాశాడు. సారీ నాన్నా, అమ్మా, చెల్లీ.. అని రాశాడు.

మర్యాదపూర్వక కలయిక



విజయవాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) నేతలు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును శనివారం కలిశారు. ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఎలాంటి దాడులు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సంఘ నేతలు ఫారూఖ్ షుబ్లి, వాహిద్, మౌలా నా హుస్సేన్, ఇఫ్తేఖార్ అహ్మద్, అబ్దుల్ గఫూర్, అన్వర్ పాల్గొన్నారు.

అమెరికా పోలీసుల పేరుతో చీటింగ్

అజిత్‌సింగ్‌నగర్, జూలై 27 : అమెరికా పోలీసుల పేరుతో ఓ మహిళను మోసగించి డబ్బులు వసూలు చేసిన ఉదంతంపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న బి. శ్రీదేవి కుమారుడు చదువు నిమిత్తం అమెరికాలో ఉంటున్నాడు. ఈనెల 23న తనని తాను అమెరికా పోలీసుగా పరిచయం చేసుకుంటూ ఓ అజ్ఞాత వ్యక్తి శ్రీదేవికి ఫోన్ చేశాడు. అమెరికాలో ఉన్న కొడుకు ఓ యువతిని వేధించిన కేసులో ఇరుక్కున్నాడని రూ. 74 వేలు చెల్లిస్తే బెయిల్ మంజూరు చేసి పంపిస్తామని లేదంటే జైలుకు తీసుకెళ్లిపోతాడని బెదిరించాడు. దీంతో మహిళ భయపడి అజ్ఞాత వ్యక్తి చెప్పిన అకౌంట్‌కు రూ. 74 వేలు గూగుల్‌పే చేసింది. ఈ విషయమై అమెరికాలో ఉన్న కొడుకును సంప్రదించగా తనపై ఏ కేసు అవలేదని చెప్పాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్నల్ శివకుమార్ మృతికి నలంద యాజమాన్యం సంతాపం



గవర్నర్‌పేట, జూలై 27: నలంద విద్యానికేతన్ ఫౌండర్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ కల్నల్ శివకుమార్ మృతి పట్ల నలంద విద్యానికేతన్ యాజమాన్యం ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. నలంద కుటుంబ సభ్యులు శివకుమార్‌ను ఎల్లవేళలా స్మరించుకుంటారని, ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ దూరం కావని నలంద విద్యాసంస్థల చైర్మన్ ఏ. విజయబాబు శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. నలంద విద్యానికేతన్ స్థాపించిన నాటి నుంచి 2003 వరకు వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా సేవలు అందించిన కల్నల్ శివకుమార్ మృతి తీవ్ర బాధను మిగిల్చిందని స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అన్నారు.

గద్దెను సత్కరించిన బుద్దా వెంకన్న



వన్‌టౌన్, జూలై 27 : తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శనివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌కు దుశ్శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందచేసి వెంకన్న సత్కరించారు.

ఓటాన్ బడ్జెట్ ఆర్థిక దివాళాకు నిదర్శనం

ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు

ధర్నాచౌక్, జూలై 27: ఎన్నికల ముందు పెట్టి ఓటాన్ బడ్జెట్ ఎన్నికల తర్వాత పెట్టడమంటే రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసినట్టేనని ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ మొత్తం ఆర్థిక దివాళాకి రూ. 6 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిన జగన్‌దా ? కొత్తగా వచ్చిన ప్రభుత్వానిదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం కట్టుబడి ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పౌర, రాజకీయ పక్షాలను పిలిచి సంక్షేమ, అభివృద్ధితో కూడిన ఆర్థిక విధానాన్ని రూపొందించాలన్నారు. ఫోరమ్ సభ్యుడు రాజశేఖర్‌రావు, చార్టర్డ్ అకౌంటెంట్ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



అమ్మవారికి సారె తీసుకు వచ్చిన మహిళా భక్త బృందాలు

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు సారె

వన్‌టౌన్, జూలై 27: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా సారె సమర్పణ భక్తిశ్రద్ధతో కొనసాగుతున్నాయి. శనివారం వందలాది మంది భక్తులు సారె సమర్పించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం బృందం 500 మంది, బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన 125 మంది, దుర్గాభవానీ భక్త బృందం 80 మంది, వెంకటేశ్వరరావు భక్త బృందం 75 మంది, విజయవాడ పటమట కోదండ రామాలయం నుంచి 100 మంది, గుడివాడ నుంచి పాలడుగు శ్రీనివాసరావు బృందం 150 మంది, వి. కృష్ణకుమారి బృందం 60 మంది, నవదుర్గ దీక్షా పీఠం నుంచి 80 మంది ఇలా మొత్తం 24 బృందాలు అమ్మవారికి సారె సమర్పించుకున్నారు.

అన్నవితరణకు విరాళం.. గొల్లపూడికి చెందిన బి దయయంతి పేరిట దుర్గగుడిలో అన్న వితరణ చేసేందుకు ట్రిబుల్ ఎస్ కాలనీలోని రాయల్ ఒపేరా అపార్ట్‌మెంట్ నివాసి బీ. శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులు శనివారం రూ. 1,01,116 విరాళాన్ని అందచేశారు. ఆలయంలో అధికారుల ద్వారా విరాళాన్ని దేవస్థానానికి అప్పగించారు. అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందచేశారు

పశ్చిమ ఎమ్మెల్యే మనిషినంటూ దుర్గగుడిలో హల్ చల్

- పదుల సంఖ్యలో అంతరాలయ దర్శనాలు
- ఉద్యోగులను బెదిరిస్తున్న వైనం

పశ్చిమ ఎమ్మెల్యే మనిషినంటూ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఓ వ్యక్తి హల్‌చల్ చేస్తున్నాడు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో తన వెంట వచ్చిన వారికి దగ్గరి మార్గంలో అంతరాలయంలో అమ్మవారి దర్శనం కల్పిస్తున్నాడు. వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యక్తి వైసీపీ నుంచి బీజేపీలో చేరాడు. బీజేపీ గెలిచిన వెంటనే అతగాడు దుర్గగుడిలో అడ్డదోవ దర్శనాలపై దృష్టి పెట్టాడు. దీనిని ప్రశ్నించిన ఉద్యోగులను బెదిరించడంతో పాటు తాను ధర్మకర్తల మండలి సభ్యుడను అవుతానని, ఆ తరువాత కాబోయే చైర్మన్‌ను అంటూ చెప్పుకుంటున్నాడు. బుల్లెట్‌పై నేరుగా మహామండపం సమాచారశాఖ వద్దకు వచ్చి అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేస్తున్నాడు. అడ్డుకుంటున్న సెక్యూరిటీ సిబ్బందిని బెదిరిస్తున్నాడు. మరోవైపు తన వెంట వచ్చిన వారిని లిఫ్ట్‌లో తీసుకువెళుతున్నాడు. అంతరాలయంలోకి వారిని తీసుకువెళ్లి దర్శనం చేయిస్తున్నాడు. తన వెంట వచ్చిన వారికి శేషవస్త్రాలు, ప్రసాదాలు ఇవ్వాలని కూడా ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మూడురోజుల క్రితం స్కానింగ్ పాయింట్ వద్ద ఏఈవో అడ్డుకోగా ఆయనతో గొడవపడ్డాడు. శనివారం 40 మందిని తీసుకువెళుతుండగా గేట్ వద్ద సిబ్బంది నిలిపివేయడంతో వారితో గొడవపడ్డాడు. ఇతని వ్యవహార శైలిపై ఆలయంలో సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .

మోదీ,చంద్రబాబు వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు



వన్‌టౌన్, జూలై 27: ప్రధాని మోదీ, రాష్ట్ర సీఎం చంద్రబాబు వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎన్‌టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోటు బడ్జెట్‌లో ఉన్న రా ష్ట్రాన్ని గట్టెక్కించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. కేంద్రం సాయం కోసం చంద్రబాబుతో పాటు మం త్రులు, ఎంపీలు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో విజయవాడ రైల్వే స్టేషన్, గన్నవరం ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రాబోవు 50 ఏళ్లలో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇందుకు అనుగుణంగా విజయవాడ రైల్వే స్టేషన్‌ను, అమరావతి రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మం త్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌లో తెలిపారన్నారు. మహానాడురోడ్డు నుంచి నిడమానూరు వరకు ఆరు కిలోమీటర్ల ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈనెలాఖరు కల్లా డీపీఆర్‌ను సిద్ధం చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. జగన్ శవరాజకీయాలు డ్రామా రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. తన ఉనికి కోసం ఢిల్లీలో ధర్నా చేశాడని, ఆ ధర్నాకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తప్ప మరెవరూ హాజరు కాలేదన్నారు. జగన్ అసెంబ్లీకి రాకుండా రాష్ట్రంలో 36 హత్యలు జరిగినట్లు చేస్తున్న ప్రచారాన్ని మానుకోవాలని, ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని, నెలకో పథకాన్ని అమలు చేస్తారని తెలిపారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మంత్రి లోకేశ్ ఇంకా రెడ్ బుక్ ఓపెన్ చేయలేదని, తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జగన్‌రెడ్డి పారిపోయిన పిల్లి : నాగుల్ మీరా

విద్యాధరపురం. జూలై 27: జగన్‌రెడ్డి పారిపోయిన పిల్లి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగు ల్ మీరా విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ చేసిన పాపాలు, కుంభకోణాలు దారుణాలను అసెంబ్లీలో చెప్పడానికి 15 గంటల సమయం కూడా సరిపోలేదన్నారు. జగన్ పాపాల చిట్టాలను చంద్రబాబు ఎక్కడ బయట పెడతాడోనని పులివెందుల పులి అని చెప్పుకుంటున్న జగన్‌రెడ్డి పిల్లిలా పారిపోయాడన్నారు. అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేక తప్పించుకుని ఢిల్లీ పారిపోయాడని విమర్శించారు.

ప్రజలు ఛీ కొట్టినా జగన్‌కు బుద్ధి రాలేదు

విద్యాధరపురం : జగన్‌రెడ్డిని ప్రజలు ఛీ కొట్టినా ఇంకా అతనికి బుద్ధి రాలేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దిరెడ్డి, మిధున్‌రెడ్డిలు చాలా మంచివారని ఎమ్మెల్యే జగన్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రజా సమస్యలు చెప్పడానికి మంచి వేదిక అయిన అసెంబ్లీకి రాకుండా జగన్ కుంటి సాకులు వెతుక్కుంటున్నాడన్నారు. అసెంబ్లీకి రాలేకపోతూ ముఖం చాటేస్తున్న జగన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా కోసం కోర్టును ఆశ్రయిస్తానని చెప్పడాన్ని బట్టి చూస్తే అతని పిచ్చి పరాకాష్టకు చేరిందనిపిస్తోందన్నారు. జగన్ తాను చేసిన తప్పులను ఒప్పుకుని శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి కృషి స్ఫూర్తిదాయకం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె, డాక్టర్ జి. సమరం, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

మొగల్రాజపురం, జూలై 27 : పర్యావరణ పరిరక్షణ తన బాధ్యతగా భావించి వీజీఆర్ డయాబెటిక్ హాస్పటల్ అధినేత డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఒక ఉద్యమంలా చేస్తున్న మొక్కలు పంపిణీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొనియాడారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నాటేందుకు వెయ్యి మొక్కలను రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, ప్రముఖ డాక్టర్ జి. సమరంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, మానవ అవసరాల రీత్యా జరుగుతున్న పారిశ్రామికీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వల్ల భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. మొక్కలు నాటి సంరక్షించడం ఒక్కటే మార్గమని చెప్పారు. మొక్కలు నాటడంతో ఆగకుండా వాటిని సంరక్షించి వృక్షాలుగా పెరిగే వరకు చూస్తే ఆ మొక్కలు అందించిన వారి ఆశయాన్ని కొనసాగించిన వారవుతారని అన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ సమరం మాట్లాడుతూ గాలిలో కాలుష్యాన్ని అడ్డుకోవాలంటే మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారం అని చెప్పారు. వీజీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన వంతుగా పది మొక్కలు నాటి వాటిని సంరక్షించి కాపాడాలన్నారు. తన వంతుగా ఇది ఒక ఉద్యమంలా చేస్తూ విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేస్తూ ఇప్పటి వరకు 80 వేల మొక్కలను గ్రామాలకు, పాఠశాలలకు, కళాశాలలకు రోడ్ల పక్కన వివిధ సంస్థల ద్వారా అందించి నాటిస్తున్నామని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా మొక్కలను పంపిణీ చేస్తూ పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఇళ్ల రవి, ఆసుపత్రి తరపున డాక్టర్ తనూజ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



టీవీఎస్ అపాచీ ఆర్టీఆర్ 160 4వీ, 2వీ మోటారు సైకిల్స్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్న సంస్థ ప్రతినిధులు

మార్కెట్‌లోకి అపాచీ ఆర్టీఆర్ 160 4వీ, 2వీ సరికొత్త మోడల్స్

లబ్బీపేట, జూలై 27 : ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ తన అపాచీ ఆర్టీఆర్ 160 4వీ, 2వీ మోటార్ సైకిల్‌లోని లేటెస్ట్ అల్ న్యూ ఫుల్ బ్లాక్ వర్షన్‌ను నగరంలోని కాసా టీవీఎస్ షోరూంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ బైక్ ధర ఎక్స్ షోరూం రూ.1.19లక్షలుగా సంస్థ నిర్ణేశించిందని, భారత్‌లో ద్విచక్రవాహనాలను విడుదల చేస్తున్న సంస్థల్లో టీవీఎస్ అగ్రగామిగా ఉందని తెలిపారు. ఈ సంస్థ నుంచి అపాచీ మోడల్ ఎంతో విజయం సాధించడంతో పాటు ప్రీమియం మోటార్ సైకిల్స్ అమ్మకాల్లో కూడా మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఆర్టీఆర్ 160 4వీ డ్రమ్ వేరియంట్ 145కేజీల బరువుంటే, 160 2వీ వేరియంట్ 137కేజీల బరువుంటుందని, 160 4వీ మోటారు సైకిల్లో ఆల్ న్యూ బ్లాక్ మోడల్ 159.7సీసీ సింగిల్ సిలిండర్ ఆయిల్ కూల్డ్ ఇంజిన్‌ను కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ సరికొత్త అపాచీ మోటారు సైకిల్ 5స్పీడ్ స్టాండర్డ్ గేర్ బాక్స్ వ్యవస్థతో పనిచేస్తుందని తెలిపారు. ఏరియా సర్వీస్ మేనేజర్ రోనాల్డ్, ఏరియా టీవీ ఎస్ క్రెడిట్ సర్వీసెస్ మేనేజర్ సురేష్, అనిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ధర్నాచౌక్, జూలై 27: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చల్లపల్లిబంగ్లా వద్ద ఉన్న అసోసియేషన్ హాల్ ఆవరణలో ఆదివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

పటమట సబ్ రిజిస్ట్రార్‌గా ఆరిఫ్, గాంధీనగర్‌లో చైతన్య బాధ్యతల స్వీకారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పటమట సబ్ రిజిస్ట్రార్‌గా ఐజీ కార్యాలయం నుంచి ప్రత్యేకంగా నియమితులైన ఆరిఫ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఆరిఫ్‌కు చైతన్య బాధ్యతలు అప్పగించారు. చైతన్య రిలీవ్ అయిన వెంటనే ఆరిఫ్ బాధ్యతలు స్వీకరించారు. చైతన్య డిప్యూటేషన్ రద్దు కావటంతో ఆయన తిరిగి గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిపోర్టు చేసి అక్కడ ఆయన బాధ్యతలు స్వీకరించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్సు, జూలై 27 : ఉమ్మడి కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో కోలాహలంగా జిల్లా చాంపియన్‌షిప్ పోటీలు రెండోరోజు సాగాయి. శనివారం 400 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఆదివారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానోత్సవానికి మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్లు అసోసియేషన్ జిల్లాసెక్రటరీ పర్వా శ్రీనివాసరావు తెలిపారు.

కేడీసీఏ ప్రమాణాల పరిశీలన

విజయవాడ స్పోర్ట్సు, జూలై 27 : ఇందిరాగాంధీ స్టేడియంలోని ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోచింగ్‌లో క్రీడా ప్రమాణాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శనివారం పరిశీలించారు. కేడీసీఏ అసోసియేషన్ కార్యాలయాన్ని ఎంపీ సందర్శించారు. శివనాథ్‌ను అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కేడీసీఏ కోసం సొంత గ్రౌండ్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కేడీసీఏ వైస్ ప్రెసిడెంట్ బాజీ షరీఫ్, సెక్రటరీ రవీంద్ర చౌదరి, కోశాధికారి జీఎన్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌లు పాల్గొన్నారు.

జీఎస్టీ పరిమితిని తగ్గించండి

విజయవాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి) : హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వసూలు చేస్తున్న జీఎస్టీ పరిమితిని తగ్గించాలని ఫెడరేషన్ ఆఫ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ) కేంద్ర మంత్రి లోగనాథన్ మురుగన్‌కు విన్నవించారు. విజయవాడ పర్యటనకు వచ్చిన ఆయన హయత్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో శనివారం పాల్గొన్నారు. సంఘ నేతలు ఆర్వీ స్వామి, నాగరాజు, రఘువీర్, పూర్ణచంద్ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. రూ.1000 అద్దెను వసూలు చేసే హోటళ్లకు ఐదు శాతం జీఎస్టీని, రూ.7500 అద్దెను వసూలు చేసే హోటళ్లకు 12శాతం జీఎస్టీని వసూలు చేసే విధంగా కౌన్సిల్‌కు రిఫర్ చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్ ఆఫీసు ఏర్పాటుకు కృషి చేయాలి

- ఎంపీకి పెన్షనర్స్ ఆర్గనైజేషన్ వినతి



ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్స్

గవర్నర్‌పేట, జూలై 27 : రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్ ఆఫీసు, పోస్టల్ సీజీహెచ్ఎస్ కార్యాలయం ఏర్పాటు కాకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళి ఏపీలో ప్రత్యేకంగా ఈ రెండు కార్యాలయాలు ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ అండ్ స్టేట్ పెన్షనర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిసి వినతి పత్రం అందజేశారు. విభజన తరువాత కూడా నేటికీ హైదరాబాద్‌లోనే కొనసాగడం వల్ల ఏపీలోని కేంద్ర ప్రభు త్వ ఉద్యోగులు, పెన్షనర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సి రావడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురౌతున్నాయని వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీ చిన్ని విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కార్యాలయం విజయవాడలోనే ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె. వెంకటప్పయ్య, కార్యదర్శి టీవీ కృష్ణారావు, ఎన్. దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

అలరించిన భక్తప్రహ్లాద కూచిపూడి యక్షగానం

విజయవాడ కల్చరల్, జూలై 27 : బిస్మిల్లా ఖాన్ జాతీయ యువ పురస్కార గ్రహీత నాట్యాచార్య చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన భక్తప్రహ్లాద యక్షగాన కూచిపూడి ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం నెలవారి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా యక్షగానం ప్రదర్శించారు. హిరణ్య కశ్యపునిగా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, ప్రహ్లాదునిగా పి.తపస్వి, లీలావతిగా వి.పూర్ణలలిత, నరసింహ స్వామిగా వెంపటి సత్యప్రసాద్, ద్వారపాలకుడిగా డి.వర్షిత చక్కని అభినయంతో మెప్పించారు. సిద్ధార్థ అకాడమీ జనరల్ సెక్రటరీ ఎన్.లలిత్ ప్రసాద్, కళాపీఠం సెక్రటరీ బీవీఎస్ ప్రకాష్ కళాకారులను సత్కరించారు.



మైమరపించిన శశాంక్ గానం

విజయవాడ కల్చరల్, జూలై 27 : స్వరఝరి సంస్థ ఆధ్వర్యంలో స్వర తరంగిణి సంస్థ సౌజన్యంతో శనివారం సాయంత్రం సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో సంగీత కచేరీ నిర్వహించారు. మాంపాం ప్రబంధం ఆరాభిరాగంలో నకలగణ అధిప, హరి కాంభోజి రాగంలో దినమణి వంశ, బిలహరి రాగంలో పరిధానమిచ్చితే, తోడి రాఘవులు కొలువు మరే కదా..పంతువరాలి రాగంలో రాగం తానం పల్లవి అంశాలను గానం చేసి శశాంక్ మైమరిపించారు. నారాయణతే నమో నమో అనే కృతిని విజిల్‌తో ఆలపించి శ్రోతలను అచ్చెరువులను చేశారు. వీరి గాత్రానికి అంబటిపూడి కామాక్షి వయోలిన్‌పై, కుందుర్తి అరవింద్ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు. మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రయోజనకరం : రాజయ్య

మొగల్రాజపురం, జూలై 27: కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థలో వృద్ధి వేగం పెరగడానికి అనుకూలంగా ఉం దని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ మలినేని రాజయ్య చెప్పారు. మొగల్రాజపురం సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని చాంబర్ కార్యాలయంలో శనివారం బడ్జెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్‌డీలను ఆకర్షించడానికి, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెరగడానికి ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. గ్రీన్‌ఎనర్జీ , రైల్వే కారిడర్‌లు, అమరావతికి చేయూత, పోలవరంకు సహకారం వంటి వాటితో ఏపీపై కేంద్రం ప్రకటించిన వరాలను కొనియాడారు. ఆంధ్రా చాంబర్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాలడుగు లక్ష్మణరావు, ఇతర సభ్యులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



రాజధాని పనులపై కాంట్రాక్టర్లతో టెక్నికల్ కమిటీ సమావేశం రేపు

విజయవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ కమిటీ కాంట్రాక్టర్లతో సోమవారం సమావేశం కాబోతోంది. రాజధాని ప్రాంతంలో శుక్రవారం పనుల ప్రాథమిక పరిశీలన అనంతరం ఈ మేరకు కాంట్రాక్టర్లతో సమావేశం కావాలని నిర్ణయించా రు. శనివారం రాజధానిలో పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థల యాజమాన్యాలన్నింటికీ సీఆర్‌డీఏ అధికారులు లేఖలు పంపించారు. సోమవారం సీఆర్‌డీఏ కార్యాలయంలో కాంట్రాక్టర్లతో సమావేశం జరగనుంది. కాం ట్రాక్టు సంస్థలు టెక్నికల్ కమిటీకి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్‌కు యోగాసన స్పోర్ట్సు సత్కారం

పటమట, జూలై 27 : యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు జి. శంకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా శనివారం యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆయన్ని ఘనంగా సత్కరించింది. ఏపీ రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు భిక్షమయ్య గురూజీ ఆధ్వర్యంలో జరిగిన సభలో శంకర్‌ను సత్కరించారు. సెప్టెంబరులో జరిగే రాష్ట్ర యోగాసన స్పోర్ట్సు శ్రీకాకుళంలో జరిగే విధంగా జిల్లా కమిటీ సభ్యులతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ నిర్ణయం పట్ల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు ఏ రాధిక, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ పి.ప్రేమ్‌కుమార్, ఆఫీసు కార్యదర్శి డి.దుర్గారావు, ట్రెజరర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

బీజేఎల్పీ నేతగా విష్ణుకుమార్‌రాజు

▸ పార్టీ విప్‌గా ఆదినారాయణరెడ్డి



అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శాసనసభా పక్ష (బీజేఎల్పీ) నేతగా పి.విష్ణుకుమార్‌రాజు ఎంపికయ్యారు. సి.ఆదినారాయణరెడ్డిని పార్టీ విప్‌గా నియమించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారు. ఆయన 2014-19లోనూ ఐదేళ్లపాటు బీజేఎల్పీ నేతగా వ్యవహరించారు. టీడీపీ, జనసేన కూటమితో జట్టుకట్టిన బీజేపీ మొన్నటి ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయగా 8 మంది విజయం సాధించారు. వీరిలో విష్ణుకుమార్ నుంచి విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా గెలుపొందారు. ధర్మవరం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో అవకాశం లభించింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఆదినారాయణరెడ్డి బీజేపీ తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యేగా విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మీడియాతో మాట్లాడుతూ.. బీజేఎల్పీ నేతగా తనకు అధిష్ఠానం అప్పగించిన బాధ్యతను ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానని చెప్పారు. రాష్ట్రం గడిచిన ఐదేళ్లలో అన్ని విధాలా నాశనమైందని, కక్షపూరిత రాజకీయాలు తప్ప జగన్ ఏమీ చేయలేదని, ఆయన బాధితుల్లో తానూ ఒకడినని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పురోభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలివ్వాలి

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని దళిత పారిశ్రామికవేత్తలకు 2014-2019 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ఉదారంగా అందించిన సహకారాన్ని తిరిగి పునరుద్ధరించాలని, ఆనాటి పారిశ్రామిక విధానాలనే అమలు చేయాలని దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాల్, బి.రమేష్ తదితరులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అమలు చేసిన అస్తవ్యస్త పారిశ్రామిక విధానాల వల్ల దళిత పారిశ్రామికవేత్తలు అన్ని విధానాలుగా నష్టపోయారని వారు మంత్రికి వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల కీటక జనిత వ్యాధులు ప్రబలడం, నీరు కలుషితం కావడం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆరోగ్యశాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. శనివారం ఉదయం ఆరోగ్యశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎక్కడ అత్యవసర పరిస్థితులు నెలకొన్నా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందుకు డీఎంహెచ్‌వోలే పూర్తి బాధ్యత వహించాలని చెప్పారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్ అట్లాడ సిరి, డీహెచ్ఎస్ పద్మావతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ సెంటర్‌లోకి వరద

▸ విద్యార్థిని మృతి, మరో ఇద్దరు గల్లంతు

న్యూఢిల్లీ, జూలై 27: ఢిల్లీలో దారుణం జరిగింది. భారీ వర్షాలకు నగరంలోని ఓ సివిల్స్ కోచింగ్ సెంటర్ భవనం సెల్లార్‌ను వరద ముంచెత్తగా ఓ విద్యార్థిని మరణించింది. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ఢిల్లీ కరోల్ బాగ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. ఆ భవనం సెల్లార్‌లో సదరు కోచింగ్ సెంటర్ గ్రంథాలయం ఉంది. కొందరు విద్యార్థులు అక్కడ చదువుకుంటుండగా హఠాత్తుగా వరద పోటెత్తి సెల్లార్ పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ముగ్గురు విద్యార్థులు గల్లంతవ్వగా కాసేపటికి ఓ విద్యార్థిని మృతదేహం లభించింది.

ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తే రూ.50 లక్షలు!

▸ కొత్తగా సైన్యంలో చేరేవారికి రష్యా ఆఫర్

మాస్కో, జూలై 27: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం రెండేళ్లకు పైగా కొనసాగుతునే ఉంది. ఇప్పటికే ఇరు దేశాలూ భారీగా సైనిక బలగాలను నష్టపోయాయి. ఈ నేపథ్యంలో సైన్యాన్ని పెంచుకోవడానికి రష్యా ఆకర్షణీయమైన ఆఫర్ ప్రకటించింది. సైన్యంలో చేరే మాస్కో వాసులకు ఆ నగర మేయర్ సెర్గీ సోబ్యానిన్ భారీ ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రకటించారు. కొత్తగా సైనిక దళంలో చేరేవారికి ప్రారంభ చెల్లింపు కింద రూ.18 లక్షలు లభిస్తుందని మేయర్ కార్యాలయం తాజాగా ప్రకటించింది. దీంతో తొలి సంవత్సరంలో వారికి అందే మొత్తం రూ.50 లక్షలకు చేరుకుంది. అంతేకాకుండా యుద్ధంలో గాయపడినవారికి రూ.5లక్షల నుంచి రూ. 9.5 లక్షల వరకూ, యుద్ధంతో అమరులైన సైనికుల కుటుంబాలకు రూ.28.5 లక్షల వరకూ పరిహారం అందుతుంది. కొత్త చెల్లింపు విధానం తక్షణం అమల్లోకి వస్తుందని మేయర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో దేశ సగటు వేతనంతో పోలిస్తే మాస్కో కాంట్రాక్టు సైనికుల వార్షిక ఆదాయం ఏకంగా ఐదు రెట్లు పెరిగింది. ఇటువంటి అధిక చెల్లింపులు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయని, ఈ పరిస్థితి వేతన ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఐక్యరాజ్యసమితిలో రామకథా పారాయణం

▸ రామచరితమానస్‌ను గానం చేయనున్న మొరారి బాపు

వాషింగ్టన్, జూలై 27: తులసీదాసు రచించిన రామచరితమానస్‌ను వ్యాప్తి చేయడంలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మొరారి బాపు న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో రామకథా పారాయణం చేయనున్నారు. ఈ గ్రంథం మత, సాంస్కృతిక హద్దులను దాటి విశ్వవ్యాప్తమైన సందేశం ఇస్తుందని, నేటి సమాజానికి అవసరమైన సత్యం, ప్రేమ, కరుణ వంటి విశ్వజనీన విలువలను నేర్పుతుందని బాపు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో రామకథను పారాయణ చేయడం ఇదే తొలిసారని, తన కల సాకారమైందని తెలిపారు. యూఎన్ ప్రధాన కార్యాలయంలో వివిధ దేశాల ప్రతినిధుల డైనింగ్ రూమ్‌లో తొమ్మిది రోజుల పాటు ఆయన ఈ పారాయణం నిర్వహిస్తారు. 77 సంవత్సరాల వయసున్న మొరారి బాపు 65ఏళ్లకు పైగా రామకథను ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకూ శ్రీలంక, ఇండోనేషియా, దక్షిణాఫ్రికా, కెన్యా, బ్రిటన్, అమెరికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, జపాన్ సహా ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలు, పుణ్యక్షేత్రాల్లో ఆయన రామకథను పారాయణం చేశారు.

జనజీవనంలోకి ఇద్దరు మహిళా నక్సలైట్లు

▸ ఒకరిపై రూ.13 లక్షలు, మరొకరిపై రూ.8 లక్షల రివార్డు

గడ్చిరోలి/కబీర్‌ధామ్, జూలై 27: మహారాష్ట్రలో ఇద్దరు మహిళా నక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఒకరిపై రూ.13లక్షలు, మరొకరిపై రూ.8లక్షల రివార్డు ఉంది. మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ జోనల్ కమిటీలో క్రియాశీలక సభ్యురాలు, గోండియా-రాజ్‌నందగావ్-బాలాఘాట్ డివిజన్‌లో సెక్యూరిటీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డ హిడ్మే కోవసి అలియాస్ రణిత(22) శనివారం కబీర్‌ధామ్ జిల్లాలో లొంగిపోయారని పోలీసులు తెలిపారు. ఆమెపై గతంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు రూ.5లక్షల చొప్పున, మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.3లక్షల రివార్డు ప్రకటించాయన్నారు. రణిత 22 హింసాత్మక ఘటనల్లో నిందితురాలని పేర్కొన్నారు. మరోవైపు, గడ్చిరోలి డివిజన్‌లో మావోయిస్టులకు సరుకులు రవాణా చేసే 'టైలర్ టీమ్'కు కమాండర్‌గా పనిచేసిన రీనా అలియాస్ లలిత పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆమెపై మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.8లక్షల రివార్డు ప్రకటించింది. ఆమె హత్య, భద్రతా బలగాలపై కాల్పుల కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు.

తమిళనాట బడ్జెట్ సెగలు.. డీఎంకే ధర్నా

చెన్నై, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో తమిళనాడు వ్యాప్తంగా శనివారం ధర్నాలు జరిగాయి. బడ్జెట్‌లో రాష్ట్రానికంటూ ఎలాంటి కొత్త పథకాల ప్రస్తావనలుగానీ, రెండో దశ మెట్రోరైలు వంటి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులుగానీ లేకపోవటం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశాన్ని కూడా బహిష్కరించారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌ను నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నాలు, రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనలో స్టాలిన్ మినహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మేయర్లు, మునిసిపాలిటీల అధ్యక్షులు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు. చెన్నైలో నాలుగు చోట్ల జరిగిన ధర్నాల్లో ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, కళానిధి వీరాసామి, తూత్తుకుడిలో జరిగిన ఆందోళనలో ఎంపీ కనిమొళి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తమ పార్టీని గెలిపించలేదన్న ఆగ్రహంతో తమిళ ప్రజలపై కక్షగట్టిన బీజేపీ రాష్ట్రంలో ఇక వరుస పరాజయాలు తప్పవని స్టాలిన్ హెచ్చరించారు.

వలంటీర్లకు విధులేవీ?

▸ సచివాలయ ఉద్యోగులతోనే విజయవంతంగా పింఛన్ల పంపిణీ
▸ వచ్చే నెలా వారితోనే ఆ పనులు!
▸ పనిచేయకుండానే వలంటీర్లకు ఒక నెల జీతాలు
▸ మరో నెల జీతాలకూ బిల్లులు పెట్టిన అధికారులు
▸ ప్రతి నెలా వలంటీర్లకు 50 కోట్ల దాకా చెల్లింపులు
▸ జాబ్‌చార్టూ లేదు.. సచివాలయాలకు వెళ్లాలనే నిబంధనాలేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వలంటీర్లు (ఫైల్ ఫొటో)

సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ సజావుగా సాగుతోంది. ఈనెల ఒకటో తేదీన సచివాలయ ఉద్యోగులు సమర్థవంతంగా పింఛన్లు పంపిణీ చేయడంతో ఇక నుంచి వారితోనే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించవచ్చని, అందుకోసం అదనంగా సిబ్బంది అవసరం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, పనిచేయని వలంటీర్లకూ టీడీపీ కూటమి ప్రభుత్వం జీతాల బిల్లులు పెడుతుండటంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు వలంటీర్లు రాజీనామా చేయగా, చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తుందన్న ఆశతో మిగిలినవారు కొనసాగుతున్నారు. వారికి ప్రభుత్వం ఎలాంటి జాబ్ చార్ట్‌నూ అప్పగించలేదు. సచివాలయాలకు హాజరు కావాలన్న నిబంధనలు కూడా వారికి పెట్టలేదు. అయినా.. వారికి జీతాలు చెల్లించేందుకు అధికారులు బిల్లులు పెట్టారు. ఇప్పటికే పని చేయకుండానే ఒక నెల జీతం తీసుకున్నారు. మరో నెలకు కూడా వారికి జీతం బిల్లు పెడుతుండటంతో పనిచేయకుండానే టీడీపీ కూటమి సర్కార్ వైసీపీ కార్యకర్తలకు జీతాలు ఇస్తోందంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం గ్రామ, వార్డు సచివాలయాల్లో రెండున్నర లక్షల మంది వలంటీర్లు ఉండగా, ఎన్నికల సమయంలో వారిలో సగం మంది రాజీనామా చేసినట్లు చెప్తున్నారు. అంటే లక్ష మందికిపైగా పని లేకుండానే ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున నెలకు సుమారుగా రూ.50 కోట్ల దాకా వైసీపీ కార్యకర్తలకు జీతాలుగా చెల్లిస్తున్నారు.

గత ఐదేళ్లలో పింఛన్ల పంపిణీ విధులకే రూ.7,600 కోట్లు..

పింఛన్‌దారులకు మొదటి రోజునే సచివాలయ ఉద్యోగులు పింఛన్ అందించి వారి మన్ననలు పొందారు. జగన్ ప్రభుత్వం దీని కోసం వలంటీర్లను నియమించుకుని గత ఐదేళ్లలో రూ.7,600 కోట్లు ఖర్చు చేసింది. పింఛన్ల పంపిణీ తప్ప వలంటీర్లు ప్రజల కోసం ప్రత్యేకంగా పనిచేసిన దాఖలాల్లేవు. జగన్ ప్రభుత్వం అమలు చేసిన నగదు బదిలీ పథకాలన్నీ సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగాయి. మొబైల్‌లో యాప్‌లు పెట్టి ఫోన్ల ద్వారా డేటా సేకరించడం, పార్టీకి అనుకూలంగా పనిచేయడమే వలంటీర్ల విధులు. వలంటీర్లుగా సొంత పార్టీ కార్యకర్తలను నియమించుకుని వేల కోట్ల ప్రజాధనాన్ని వైసీపీ ప్రచారానికే వాడుకున్నారు. వలంటీర్లతో పాటు పలు ఎన్నికల ప్రచార కార్యక్రమాలు కూడా ప్రభుత్వ ఖర్చుతో చేయించుకున్నారు. తద్వారా ప్రజల సొమ్మును వైసీపీ ప్రభుత్వం యథేచ్ఛగా దుర్వినియోగం చేసింది. వలంటీర్లను కొనసాగిస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అయితే వారిని దేని కోసం వాడుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. వారు చేసే పింఛన్ పంపిణీని ఇప్పుడు సచివాలయ ఉద్యోగులే సమర్థవంతంగా చేపడుతున్నందున, ఈ కార్యక్రమం కోసం వలంటీర్లు అవసరం లేదంటున్నారు. అయితే, వలంటీర్లకు జీతాలు ఇస్తున్నందున వారినీ ఏదో పనికి ఉపయోగించుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సాధ్యమని నిరూపించేందుకే..

టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే రీతిలో అడుగులు ముందుకు వేస్తోంది. ఇప్పటికే ఐదు హామీలపై మొదటి సంతకాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి అమలుకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానమైన సామాజిక పింఛన్లు ఎన్టీఆర్ భరోసా హామీని అమలు చేశారు. సచివాలయ ఉద్యోగులతోనే పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేసి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్ల వల్లనే పింఛన్ పంపిణీ సజావుగా జరిగిందని, వారు లేకుండా పింఛన్లు ఇంటింటికెళ్లి ఇవ్వలేమని ఎన్నికల వేళ వైసీపీ నేతలు, ప్రభుత్వ పెద్దలు పెద్దఎత్తున ప్రచారం చేశారు. అధికారులు సైతం సచివాలయ ఉద్యోగులకు ఈ బాధ్యత అప్పచెప్పకుండా అకౌంట్లలో పింఛన్ వేసి పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టారు. 1.26 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు ఓ వైపు పింఛన్ పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ అప్పట్లో అధికారులు అంగీకరించలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులతోనే పకడ్బందీగా పింఛన్ల పంపిణీ చేపట్టవచ్చని నిరూపించేందుకు కూటమి సర్కార్ చర్యలు ప్రారంభించి విజయవంతం చేసింది.

తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ


▸ ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్రపతి భవన్
▸ ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మహారాష్ట్రకు..
▸ జిష్ణు దేవ్.. త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి
▸ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగానూ సేవలు
▸ రాజ కుటుంబ నేపథ్యం.. రామజన్మభూమి ఉద్యమంలో పాత్ర
▸ దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు



న్యూఢిల్లీ, జూలై 27: తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి అయిన ఈయన.. ప్రస్తుత ఇంచార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ స్థానంలో రానున్నారు. రాజ కుటుంబానికి చెందిన జిష్ణుదేవ్ 1957 ఆగస్టు 15న జన్మించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. 1990ల ప్రారంభంలో బీజేపీలో చేరారు. అయోధ్య రామ జన్మభూమి ఉద్యమంలో పాల్గొన్నారు. 2018-23 మధ్య ఉప ముఖ్యమంత్రిగా, త్రిపుర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, తెలంగాణతో పాటు దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మరో మూడు రాష్ట్రాల గవర్నర్లను వేరే రాష్ట్రాలకు బదిలీ చేశారు. హరిబాబు కిషన్‌రావ్ బాగ్డే (రాజస్థాన్), ఓం ప్రకాశ్ మాథుర్ (సిక్కిం), సంతోష్ కుమార్ గాంగ్వార్ (జార్ఖండ్), రమెన్ దేకా (ఛత్తీస్‌గఢ్), సీహెచ్ విజయశంకర్ (మేఘాలయ)లను గవర్నర్లుగా నియమించింది. కాగా, ప్రస్తుతం జార్ఖండ్ గవర్నర్‌గా తెలంగాణ అదనపు బాధ్యతలతో ఉన్న సీపీ రాధాకృష్ణన్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా పంపారు. అసోం గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను పంజాబ్ గవర్నర్‌గా, కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారు. సిక్కిం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను అసోం గవర్నర్‌గా పంపుతూ.. మణిపూర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

భారతీయుల పిల్లలకు 'గ్రీన్‌కార్డ్' దెబ్బ!

▸ యుక్తవయసులోకి వచ్చిన కారణంగా అమెరికాలో బహిష్కరణ ముప్పు
▸ చిక్కుల్లో లక్షల మంది యువతీ యువకులు



వాషింగ్టన్, జూలై 27: అమెరికాలోని భారత సంతతి యువత దేశ బహిష్కరణ సమస్యలో చిక్కుకున్నారు. గ్రీన్ కార్డుల కోసం దశాబ్దాలుగా వేచి ఉన్న వీరంతా ఇప్పటికీ కార్డులు రాకపోవడంతో ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దీంతో అధ్యక్షుడు జో బైడెన్ ఇప్పుడు చొరవ తీసుకుంటే తప్ప వీరి సమస్య పరిష్కారమయ్యేలా కనిపించడం లేదు. దాదాపు 2,50,000 మందికిపైగా యువతీ యువకులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్టు వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరినె జీన్ పీర్రే తెలిపారు. వీరందరికీ వయో పరిమితి(21 ఏళ్లు) నిండిపోయిందని, అమెరికా రికార్డుల ప్రకారం 'ఆధారపడి జీవించే స్థాయి'ని దాటిపోయారని తెలిపారు. అయితే.. ఈ విషయాన్ని తాము ముందుగానే గుర్తించి వీరికి వెసులుబాటు కల్పించేలా చట్టసభల్లో నిర్ణయం తీసుకునే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. కానీ, విపక్ష రిపబ్లికన్లు ఈ చర్యలను అడ్డుకుని, శాసన ప్రతిష్టంభనకు దారితీసేలా వ్యవహరించారని పేర్కొన్నారు. అయినప్పటికీ.. సంబంధిత యువతీ యువకులకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. "చట్టబద్ధంగా వలస వచ్చిన 2.5 లక్షల మంది యువతీ యువకుల్లో ఎక్కువ మంది భారత సంతతి వారే ఉన్నారు. వీరందరికీ 21 ఏళ్ల వయసు నిండిపోయింది. వీరిని 'డాక్యుమెంట్ డ్రీమర్స్'గా పేర్కొంటాం. తాత్కాలిక పనివీసాపై తమ తల్లిదండ్రులతో కలిసి వీరు అమెరికాకు చేరుకున్నారు" అని సెక్రటరీ పేర్కొన్నారు. "వీరికి మేలు చేసేందుకు ద్వైపాక్షిక ఒప్పందం చేసుకునేలా చట్టసభలో ఒక చర్చను చేపట్టాం. కానీ, రిపబ్లికన్‌లు అడ్డుపడ్డారు" అని వివరించారు. ఇదిలావుంటే, భారత సంతతిలో 12 లక్షల మంది(వీరిలో తల్లిదండ్రులపై ఆధారపడిన వారు కూడా ఉన్నారు) గ్రీన్‌కార్డ్ కోసం(ఈబీ-1, ఈబీ-2, ఈబీ-3) వేచి చూస్తున్నట్టు నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ(ఎన్ఎఫ్ఏపీ) పేర్కొంది. 21 ఏళ్ల వయసు నిండడానికి ముందే చట్టబద్ధమైన శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పుడు ఆ వయోపరిమితి నిండితే వారిని అనుమతించడం కుదరదని తెలిపింది. వీరంతా మరోసారి గ్రీన్‌కార్డ్ కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించింది.

వారికి రక్షణ కల్పించండి!

వయో పరిమితి మీరిపోయిన భారత సంతతి యువతీ యువకులకు తక్షణమే రక్షణ కల్పించాలని వలస విధానం, పౌరసత్వంపై ఏర్పాటైన జ్యుడీషియరీ ఉపసంఘం చైర్మన్, చట్టసభ సభ్యుడు అలెక్స్ పదిల్లా అధ్యక్షుడు జో బైడెన్‌కు విన్నవించారు. అలెక్స్ నేతృత్వంలో 43 మంది చట్టసభ సభ్యులు జూన్ 13నే ఈ సమస్యను అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లారు. "వీరంతా మన దేశంలో పెరిగిన వారే. ఇక్కడే చదువుకున్నారు. మన స్కూళ్లలోనే ఆడిపాడారు. గ్రాడ్యుయేషన్ పట్టాలు సైతం అందుకున్నారు. ఇలాంటి వారిని గ్రీన్ కార్డు లేదన్న కారణంగా దేశం నుంచి పంపిచేయడం భావ్యంకాదు. గ్రీన్‌కార్డు కోసం వారి కుటుంబాలు దశాబ్దాలుగా నిరీక్షించాయి. కాబట్టి చొరవ తీసుకుని వారికి రక్షణ కల్పించండి" అని చట్టసభ సభ్యులు అధ్యక్షుడికి రాసిన లేఖలో విన్నవించారు.

జయం నాదే!

▸ అమెరికా 'అధ్యక్ష' అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన కమలా హ్యారిస్
▸ డెమొక్రాటిక్ అభ్యర్థినిగా డిక్లరేషన్‌పై సంతకాలు
▸ ఆగస్టు 1న అధికారిక ప్రకటన
▸ కమలకు భారీగా పెరిగిన మద్దతు
▸ ట్రంప్‌తో అంతరం ఒక్క శాతమే!
▸ న్యూయార్క్ టైమ్స్ సర్వేలో వెల్లడి



వాషింగ్టన్, జూలై 27: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తనదే విజయమని ఆ దేశ ఉపాధ్యక్షురాలు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిని కమలా దేవి హ్యారిస్ (59) ధీమా వ్యక్తం చేశారు. ఆఫ్రికన్-భారత సంతతికి చెందిన ఈమె.. తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించారు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థినిగా లాంఛనంగా డిక్లరేషన్ ఫాంపై సంతకాలు చేశారు. నవంబరు 5న జరిగే ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్(78)పై కచ్చితంగా గెలుస్తానని.. ప్రతి ఓటూ సాధించడం కీలకమని.. లక్ష్య సాధనకు కఠినంగా శ్రమిస్తానని ఆమె ఆ తర్వాత 'ఎక్స్'లో తెలిపారు. అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల బరి నుంచి వైదొలగి ఆమె అభ్యర్థిత్వాన్ని సమర్థించిన సంగతి తెలిసిందే. ఆమె విజయావకాశాలపై తొలుత సందేహం వ్యక్తం చేసిన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఆయన భార్య మిచెల్ ఒబామాతో పాటు పలువురు ప్రముఖులు, డెమొక్రాటిక్ దాతలు ఆమెకే మద్దతు ప్రకటించారు. అధ్యక్ష ఎన్నిక బరిలో డెమొక్రాటిక్ పార్టీ నుంచి ఇప్పటివరకు వేరెవరూ తాము పోటీచేస్తున్నట్లు ప్రకటించలేదు. 50 రాష్ట్రాలకుగాను 40కిపైగా రాష్ట్రాల్లో పార్టీ ప్రతినిధులు ఆమెకు మద్దతిస్తున్నారు. పార్టీ జాతీయ కమిటీ ఆగస్టు 1న కమల అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తుంది. 7లోపు తన ఉపాధ్యక్ష అభ్యర్థిని ఆమె ఎంపిక చేసుకోవాలి. తదనంతరం ఆగస్టు 19 నుంచి షికాగోలో మొదలయ్యే పార్టీ జాతీయ కన్వెన్షన్‌లో వారి అభ్యర్థిత్వాలను ధ్రువీకరిస్తారు. అధ్యక్ష ఎన్నికల్లో కమల గెలిస్తే తొలి భారతీయ అమెరికన్‌గా, మొదటి ఆసియావాసిగా, తొలి నల్లజాతి మహిళగా, తొలి జమైకా సంతతి వ్యక్తిగా రికార్డు సృష్టిస్తారు. ఆమె తల్లి శ్యామలా గోపాలన్ భారతీయురాలు. చెన్నై నుంచి అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. తండ్రి డొనాల్డ్ హ్యారిస్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్. జమైకా నుంచి వలస వచ్చారు.

ట్రంప్ 48.. కమల 47%

బైడెన్ డెమొక్రాటిక్ అభ్యర్థిగా పోటీలో ఉన్నప్పుడు ట్రంప్ విజయం నల్లేరుపై బండి నడకేనని అన్ని సర్వేలూ పేర్కొన్నాయి. ఇప్పుడు ఆయన స్థానంలో కమలా హ్యారిస్ పోటీకి దిగడంతో ట్రంప్‌కు, ఆమెకు మధ్య ఉన్న అంతరం బాగా తగ్గిపోయిందని.. తేడా ఒక్క శాతమేనని ఓ సర్వే సంస్థ ప్రకటించింది. తాజా అభిప్రాయ సేకరణలో ట్రంప్‌కు 48 శాతం మంది మద్దతివ్వగా.. హ్యారిస్‌కు 47 శాతం మంది దన్నుగా నిలిచారని 'న్యూయార్క్ టైమ్స్-సియెనా కాలేజ్ పోల్' శనివారం వెల్లడించింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ మద్దతుదారులైన ఓటర్లలో 70 శాతం మంది ఆమెకు మద్దతిచ్చినట్లు తెలిపింది.

కమలపై ట్రంప్, వాన్స్ వ్యక్తిగత దాడి..

కమలా హ్యారిస్‌పై ట్రంప్, ఆయన ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ వ్యక్తిగత దాడికి దిగారు. ఆమె యూదు వ్యతిరేకిని వివాహమాడారని, ఇజ్రాయెల్‌కు ఆమె బద్ధ వ్యతిరేకి అని.. అధ్యక్షురాలైనా ఈ వైఖరి మారదని ట్రంప్ ఓ ప్రచార సభలో చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు అమెరికన్ కాంగ్రెస్‌లో చేసిన ప్రసంగాన్ని ఉద్దేశపూర్వకంగా ఆమె గైర్హాజరయ్యారని ఆరోపించారు. అయితే ఇది సత్యదూరమని.. ముందుగా ఖరారైన కార్యక్రమానికి వెళ్లాల్సి రావడంతో ఆమె రాలేకపోయారని డెమొక్రాటిక్ పార్టీ వర్గాలు తెలిపాయి.

వచ్చేనెల ఉక్రెయిన్ పర్యటనకు మోదీ!

న్యూఢిల్లీ, జూలై 27: వచ్చేనెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 23 లేదా 24 తేదీన మోదీ కీవ్ వెళ్తారని, ఆ దేశ అధ్యక్షుడు జెలన్‌స్కీతో భేటీ అవుతారని సమాచారం. ఆ తర్వాత ఆయన పోలాండ్ పర్యటనకు వెళ్తారని తెలిసింది. 2022లో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక మోదీ ఉక్రెయిన్‌కు వెళ్లడం ఇదే తొలిసారి. కాగా, ఈనెల 8న మోదీ రెండు రోజుల పర్యటనకు రష్యా వెళ్లి, ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే.

కుమారుడు గూగుల్ సీఈవో అయినా..!

భారతీయులకు సంతృప్తి ఉండదు

ఇన్‌స్టాలో సుందర్ పిచయ్ పోస్టు వైరల్

న్యూఢిల్లీ, జూలై 27: సాధారణంగా ఏ దేశంలోనైనా తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తారు. భారతీయులకైతే తమ పిల్లల చదువు, ఉద్యోగం విషయంలో చాలా అంచనాలు ఉంటాయి. ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా ఇంకో ఏదో సాధించాలని ఆశిస్తారు. గూగుల్ సీఈవో సుందర్ పిచయ్ విషయంలో ఇదే జరిగింది. అంతర్జాతీయ ఐటీ దిగ్గజ కంపెనీ గూగుల్ సీఈవోగా భారతీయుడు పిచయ్ కావడం దేశంలో లక్షలాది యువతకు స్ఫూర్తిదాయకం. దేశం గర్వించే స్థాయికి సుందర్ పిచయ్ ఎదిగినా ఆయన తల్లిదండ్రులకు ఇంకా ఓ కోరిక ఉండేదట. తాను పీహెచ్‌డీ అందుకోవాలన్నది తన తల్లిదండ్రుల చిరకాల కోరికని ఆయనే స్వయంగా వెల్లడించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ మాజీ విద్యార్థి అయిన సుందర్ పిచయ్‌కు ఇటీవల ఆ విద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఈ విషయం వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన చేసిన పోస్టు నెటిజన్లను తెగ ఆకర్షిస్తోంది.

ఎమర్జెన్సీలో మినహా భేషుగ్గా పార్లమెంటు పనితీరు

రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 27: ఎమర్జెన్సీ సమయంలో మినహా మిగతా కాలమంతా పార్లమెంటు బాగానే పనిచేసిందని రాజ్యసభ చైర్‌పర్సన్ జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. పార్లమెంటు సభ్యులు దేశాభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించారని కొనియాడారు. ఎమర్జెన్సీ రోజులను 'బాధాకరమైన, చీకటి' కాలంగా అభివర్ణించారు. రాజ్యసభ కొత్త ఎంపీల పునశ్చరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగం మామూలు కాగితం ముక్క అయిపోయిందన్నారు. అంతర్గత భద్రతా చట్టం (మీసా) పేరుతో అమానుషంగా వ్యవహరించారని, నాయకులను జైళ్లలో నిర్బంధించారన్నారు. అప్పటి దారుణాలకు చలించిపోయిన లాలూప్రసాద్ యాదవ్ తన కుమార్తెకు 'మీసా' భారతి' అని పేరు పెట్టారని గుర్తుచేశారు. ప్రస్తుతం సభ్యులు రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటు సమావేశాల్లో అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమన్నారు.

ప్రాణాల మీదకు తెస్తోన్న విదేశీ విద్య

▸ ఐదేళ్లలో 633 మంది భారత విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ, జూలై 27 : విదేశాల్లో చదువుకొనేందుకు వెళ్లిన భారతీయ విద్యార్థులు దురదృష్టకర పరిస్థితుల్లో మృత్యువాత పడుతున్నారు. గత ఐదేళ్లలో 633 మంది విద్యార్థులు ఇలా 41 దేశాల్లో మరణించారు. ఈమేరకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ కేరళ ఎంపీ కొడికునిల్ సురేశ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా లోక్‌సభలో సమాచారం ఇచ్చారు. విదేశీ వ్యవహారాల శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం అత్యధికంగా కెనడాలో 172 మంది చనిపోయారు. తరువాతి స్థానంలో 108 మందితో యూఎస్(అమెరికా) ఉంది. యూకేలో 58, ఆస్ట్రేలియాలో 57, రష్యాలో 37, జర్మనీలో 24 మంది మృత్యువాత పడ్డారు. పాకిస్థాన్‌లో కూడా ఒక భారత విద్యార్థి మరణించారు. ఇలా విద్యార్థులు మృత్యువాత పడడానికి గల కారణాలు పరిశీలిస్తే... సహజ మరణాలు, ప్రమాదాలు, అత్యవసర వైద్యం అందకపోవడం, దాడులు కారణాలుగా ఉన్నాయి. 19 మంది విద్యార్థులు హింసాత్మక దాడుల్లో మరణించగా వారిలో అత్యధికంగా కెనడాలో 9 మంది, యూఎస్‌లో ఆరుగురు, ఆస్ట్రేలియా, యూకే, చైనా, కిర్గిజిస్థాన్‌లలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. భారత విద్యార్థులు ఇటువంటి ఘటనల్లో చిక్కుకున్నా, మరణించినా భారత రాయబార కార్యాలయాలు కచ్చితంగా స్పందించి తగిన సహాయం అందిస్తున్నాయని కేంద్రమంత్రి మురళీధరన్ స్పష్టం చేశారు. ఆయా దేశాల్లో సరైన విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులకు అవసరమైన మద్దతు, ఆహారం, ఆశ్రయం, వైద్యసహాయంతో పాటు వారు సురక్షితంగా స్వదేశానికి చేరుకొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 2024లో పరిశీలిస్తే... 13.3 లక్షల మంది భారత విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారని వెల్లడించారు. చదువు కోసం 2022లో 7.5 లక్షల మంది విదేశాలకు వెళ్లగా 2023లో 9.3 లక్షల మంది వెళ్లారు. అత్యధికంగా కెనడాలో 4,27,000 మంది చదువుతుండగా... యూఎస్‌లో 3,37,000 మంది, యూకేలో 1,85,000 మంది చదువుతున్నారు. ఉక్రెయిన్ దేశం యుద్ధంతో సతమతమవుతున్నా 2,510 మంది విద్యార్థులు ఇంకా అక్కడ చదువు కొనసాగిస్తూనే ఉన్నారు. విదేశాల్లో భారత విద్యార్థులు మృత్యువాత పడుతోన్న గణాంకాలను, కారణాలను పరిశీలిస్తే అక్కడ వారు ఎదుర్కొంటోన్న సమస్యలు, ముప్పు అర్థం చేసుకోవచ్చు. విదేశీ వ్యవహారాల శాఖ... మన విద్యార్థులు వాటిని ఎదుర్కొనేందుకు తగిన కార్యాచరణ చేపట్టడం, వారి సంక్షేమానికి తగిన ఏర్పాట్లు చేయడం ఎంతో అవసరం.

హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మొగ్గు

▸ పీపుల్స్ పల్స్ మూడ్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదిలో జరగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే విజయవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ మూడ్ సర్వే వెల్లడించింది. మొత్తం 90 స్థానాల్లో.. 44% ఓట్లతో కాంగ్రెస్ 43-48 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని ఆ సర్వే తెలిపింది. బీజేపీ 41శాతం ఓట్లతో 34-39 స్థానాలకే పరిమితమవుతుందని, ఇతరులు 3-8 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నేత, మాజీ సీఎం భూపేందర్‌సింగ్ హుడా వైపు 40% మంది మొగ్గు చూపారని, సిట్టింగ్ బీజేపీ సీఎం నయాబ్‌సింగ్ సైనీకి 30% మంది మద్దతు లభించిందని వివరించింది. శనివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో పీపుల్స్ పల్స్ డైరెక్టర్ దిలీప్‌రెడ్డి ఈ మేరకు సర్వే వివరాలను వెల్లడించారు.

పాక్ 'బ్యాట్' దళం దాడిలో భారత జవాను మృతి

▸ కెప్టెన్ సహా నలుగురికి గాయాలు.. సరిహద్దుల్లో భద్రత పెంపునకు కేంద్రం నిర్ణయం

శ్రీనగర్, జూలై 27: పాకిస్థాన్ ప్రత్యేక సైన్యంతోపాటు ఉగ్రవాదులతో కూడిన 'బోర్డర్ యాక్షన్ టీమ్' (బ్యాట్ దళం) భారత ఆర్మీ పోస్టుపై చేసిన అకస్మాత్తు దాడిలో ఓ జవాను మృతి చెందగా, కెప్టెన్ సహా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మూకశ్మీర్ కుప్వారా జిల్లాలోని కామకారి సెక్టర్ వద్ద శనివారం ఈ దాడి జరిగింది. నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఆర్మీ పోస్టుపై బ్యాట్ దళం ఒక్కసారిగా గ్రేనేడ్‌తో దాడి చేసి కాల్పులు జరిపింది. ఈ దాడిలో కెప్టెన్ సహా ఐదుగురు జవాన్లు గాయపడగా వారిని ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఓ జవాను ప్రాణాలు విడిచాడని, మరొకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బ్యాట్ దళం చేసిన దాడికి ప్రతిగా భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఓ పాక్ చొరబాటుదారుడు మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. కాగా, దోడాలో ఈ నెల 16న భారత సైన్యంపై దాడికి పాల్పడి నలుగురు సైనికుల మృతికి కారకులైన ముగ్గురు ఉగ్రవాదుల ఛాయాచిత్రాలను జమ్మూకశ్మీర్ పోలీసులు విడుదల చేశారు. వారిలో ఒక్కొక్కరి తలపై రూ. 5లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. మరోవైపు భారత్- పాక్ సరిహద్దు వెంబడి పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడ భద్రతను పెంచేందుకు కేంద్రం నిర్ణయించింది. ఒడిసాలోని మల్కాంగిరి నుంచి జమ్మూకశ్మీర్‌లోని కిశ్వార్, కథువా, రియాసీ వెంబడి సరిహద్దుల్లోకి 2 వేల మంది సరిహద్దు భద్రతా దళ సిబ్బందిని మోహరిస్తున్నట్లు పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 28 జూలై 2024

జేఎన్ఏఎఫ్ఏయూలో బీఆర్క్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- నాటా 2024 స్కోర్ ద్వారా బీఆర్క్ రెగ్యులర్ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ప్రైవేట్/మైనారిటీ/అన్ ఎయిడెడ్ ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 765 సీట్లు ఉన్నాయి. వీటిలో 550 కన్వీనర్ కోటా సీట్లు, 204 మేనేజ్‌మెంట్ కోటా సీట్లు, 5 జీఓఐ నామినీ సీట్లు, 6 ఐఆర్‌సీ సీట్లు ఉన్నాయి. స్థానికులకు 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఆర్క్ డిగ్రీ వ్యవధి అయిదేళ్లు.



కళాశాలలు-సీట్లు

- జేఎన్ఏఎఫ్ఏయూ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 45(రెగ్యులర్)+40(సెల్ఫ్ ఫైనాన్సింగ్)
- సీఎస్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, సికింద్రాబాద్- 120
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 120
- వైష్ణవీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, హైదరాబాద్- 80
- దక్కన్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 40
- జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సికింద్రాబాద్- 60
- జేబీఆర్ ఆర్కిటెక్చర్ కాలేజ్, మొయినాబాద్-80
- అరోరా-ఎస్ డిజైన్ అకాడమీ, హైదరాబాద్- 60
- అరోరా-ఎస్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్- 40
- అశోకా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్- 80

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్ట్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్/ఇంజనీరింగ్ గ్రాఫిక్స్/బిజినెస్ స్టడీస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తి చేసినవారు కూడా అర్హులే. ఏ కోర్సులోనైనా కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. నాటా 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్ తేదీలు:** ఆగస్టు 17, 18
- **ఫస్ట్ ఫేజ్‌లో ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 21
- **మిగిలిన సీట్ల వివరాలు వెల్లడి:** ఆగస్టు 24
- **సెకండ్ ఫేజ్ వెబ్ ఆప్షన్స్ తేదీలు:** ఆగస్టు 25, 26
- **సెకండ్ ఫేజ్‌లో ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 29
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 31
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in, http://barchadm.tsche.ac.in

జయశంకర్ వర్సిటీలో డిప్లొమా సెకండ్ కౌన్సెలింగ్

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్; మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నారు. సీట్ల వివరాలను కౌన్సెలింగ్ నాటికి వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. తెలంగాణ పాలిసెట్ 2024 అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్లు అలాట్ చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

అర్హత:

- మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు సబ్మిట్ చేసి ఉండాలి.
- మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనని అభ్యర్థులు, మొదటి ఫేజ్‌లో సీటు రానివారు, సీటు వచ్చినా కాలేజీ మారాలనుకునేవారు/కాలేజీలో రిపోర్ట్ చేయనివారు/అడ్మిషన్ క్యాన్సిల్ చేసుకున్నవారు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024 అగ్రికల్చర్ స్ట్రీమ్‌లో 447-27836 మధ్య ర్యాంక్‌లు వచ్చినవారు ఆగస్టు 2న; 28093-68151 మధ్య ర్యాంక్‌లు వచ్చినవారు ఆగస్టు 3న ఉదయం పది గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. జనరల్, ఫార్మర్, నాన్ ఫార్మర్ సహా ఈడబ్ల్యూఎస్, రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభ్యర్థులందరికీ ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ; పదోతరగతి/తత్సమాన కోర్సు సర్టిఫికెట్, తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు; నాన్ మున్సిపల్ ఏరియా స్టడీ సర్టిఫికెట్; టీసీ; రెసిడెన్షియల్ సర్టిఫికెట్(తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు మినహా); కుల ధ్రువీకరణ పత్రం; ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్.
- **వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in



ఐఎన్‌సీలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సహకారంతో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్వహిస్తున్న నేషనల్ కన్సార్షియం- పార్ట్ టైమ్ పీహెచ్‌డీ ఇన్ నర్సింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ చేసుకొన్న అయిదేళ్లలోపు ప్రోగ్రామ్ పూర్తిచేసుకోవచ్చు. థీసెస్ సబ్మిట్ చేయడానికి గరిష్ఠ వ్యవధి ఏడేళ్లు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు-సీట్లు: కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ 7, మెడికల్ సర్జికల్ నర్సింగ్ 9, ఓబీజీ నర్సింగ్ 4, పీడియాట్రిక్ నర్సింగ్ 4, సైకియాట్రిక్ నర్సింగ్ 6 సీట్లు చొప్పున మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

స్టడీ సెంటర్లు: ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్-ఢిల్లీ, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సీఎంసీ-లూథియానా, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సీఎంసీ-వెల్లూరు, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-హైదరాబాద్, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-తిరువనంతపురం, కాలేజ్ ఆఫ్ నర్సింగ్-ఎస్ఎస్‌కేఎం కోల్‌కతా, ఐఎన్ఈ-ముంబై, సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్-బెంగళూరు.

అర్హత: ఐఎన్‌సీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నర్సింగ్ విభాగంలో ఎంఫిల్/ఎమ్మెస్సీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు బోధన/క్లినికల్ రంగాల్లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. ఎమ్మెస్సీ(నర్సింగ్)లో కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది 90 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత సాధించాలంటే 54 మార్కులు రావాలి. ఎంఫిల్ అభ్యర్థులకు 5 మార్కులు, ప్రచురితమైన జర్నల్స్‌కు ఒక్కోదానికి 1 మార్కు చొప్పున గరిష్ఠంగా 5 మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్: పీహెచ్‌డీకి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ చేసుకొన్న అభ్యర్థులకు ఏడాది తరవాత ప్రీ పీహెచ్‌డీ ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే అభ్యర్థి పీహెచ్‌డీని ధ్రువీకరిస్తారు. ఈ పరీక్షలో రెండు పేపర్లు, సెమినార్/ రీసెర్చ్ టర్మ్ పేపర్(ఇంటర్నల్ అసెస్‌మెంట్), వైవా ఓస్ ఉంటాయి. ఒక్కోదానికి 100 మార్కులు కేటాయించారు. మొదటి రెండు పేపర్లను రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తుంది. ఒక్కో పేపర్‌కు పరీక్ష వ్యవధి 3 గంటలు. మొదటి పేపర్లో రీసెర్చ్ మెథడాలజీ, అప్లయిడ్ స్టాటిస్టిక్స్ అంశాల నుంచి; రెండో పేపర్లో నర్సింగ్ సైన్స్, థియరీ డెవలప్‌మెంట్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్దేశించిన సిలబస్ మేరకు ప్రశ్నలు ఉంటాయి. సెమినార్, వైవాలను నేషనల్ కన్సార్షియం నిర్వహిస్తుంది. పరీక్ష మొత్తమ్మీద 60 శాతం మార్కులు వస్తేనే అర్హత పొందినట్లు పరిగణిస్తారు. మొదటి ఏడాది 70 శాతం అటెండెన్స్ ఉంటేనే ఈ పరీక్షని రాయనిస్తారు. మొదటి ప్రయత్నంలో విఫలమైనవారికి రెండో అవకాశం ఇస్తారు. ఇందులో కూడా విఫలమైతే అభ్యర్థి ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌ను క్యాన్సిల్ చేస్తారు.

థీసెస్ సబ్మిషన్: అభ్యర్థులకు రీసెర్చ్ గైడ్‌ను ఎంచుకొనే సౌకర్యం ఉంది. పీహెచ్‌డీ కన్సార్షియం గుర్తించిన గైడ్‌ల లిస్టునుంచి వారి అర్హత, అనుభవం ఆధారంగా సెలెక్ట్ చేసుకోవచ్చు. ఈ సందర్భంలో అభ్యర్థులు తమ పరిశోధనాంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ తేదీ నుంచి కనీసం మూడేళ్ల తరవాత, కేటాయించిన గరిష్ఠ కాల వ్యవధికి మూడు నెలల లోపు అభ్యర్థులు థీసెస్ సబ్మిట్ చేయాలి. తరవాత పీహెచ్‌డీ ఎగ్జామినేషన్, వైవా ఉంటాయి. ఇవి పూర్తయిన వెంటనే అర్హులకు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.3000
- **ఐఎన్‌సీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ:** ఆగస్టు 16
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 23
- **దరఖాస్తు సబ్మిషన్ సెంటర్:** సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్- బెంగళూరు
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 22
- **పరీక్ష కేంద్రం:** ఐఎన్‌సీ-న్యూఢిల్లీ, ఆర్‌జీయూహెచ్ఎస్-బెంగళూరు
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 7
- **ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్స్:** నవంబరు 14
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** నవంబరు 28
- **వెబ్‌సైట్:** www.indiannursingcouncil.org



భారతీయ రైల్వే భారీ పోస్టులతో నోటిఫికేషన్ (సీఈఎన్ నెం. 03/2024) విడుదల చేసింది. ఈ ప్రకటన ద్వారా 7,951 జూనియర్ ఇంజనీర్, కెమికల్ సూపర్‌వైజర్ ఖాళీలు భర్తీ చేస్తారు. రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, గోరఖ్‌పూర్, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగిరి, తిరువనంతపురం

పోస్టుల వివరాలు

1. కెమికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్ అండ్ మెటలర్జికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్: 17 పోస్టులు(ఆర్ఆర్‌బీ గోరఖ్‌పూర్ మాత్రమే)
2. జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్: 7,934 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఇంజనీరింగ్), బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ), బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18-36 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల వయో సడలింపు ఉంటుంది.

ప్రారంభ వేతనం(నెలకు)

- జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్: రూ.35,400
- కెమికల్ సూపర్ వైజర్/రీసెర్చ్ అండ్ మెటలర్జికల్ సూపర్‌వైజర్/రీసెర్చ్: రూ.44,900

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2 కంప్యూటర్ బేస్డ్ టెస్టులు(సీబీటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

స్టేజ్-1 పరీక్ష విధానం: ప్రశ్న పత్రంలో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కును కేటాయించారు. మేథ్స్ నుంచి 30 ప్రశ్నలు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ నుంచి 25, జనరల్ అవేర్ నుంచి 15, జనరల్ సైన్స్ నుంచి 30 ప్రశ్నలు వస్తాయి. జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్-40, ఓబీసీ-30, ఎస్సీ-30, ఎస్టీ అభ్యర్థులు 25 శాతం కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఈ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను స్టేజ్-2 పరీక్షకు షార్ట్‌లిస్ట్ చేస్తారు.

స్టేజ్-2 పరీక్ష విధానం: పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 15 ప్రశ్నలు, ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ నుంచి 15, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ నుంచి 10, బేసిక్స్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ నుంచి 10, టెక్నికల్ ఎబిలిటీస్ నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు.జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఈడబ్ల్యూఎస్-40, ఓబీసీ-30, ఎస్సీ-30, ఎస్టీ అభ్యర్థులు 25 శాతం కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది.

దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ/ఎస్టీ/ఈఎస్ఎం/మహిళలు/ట్రాన్స్‌జెండర్లకు రూ.250.



ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం:** 2024 జూలై 30
- **ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు చివరి తేదీ:** 2024 ఆగస్టు 29
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 2024 ఆగస్టు 30 నుంచి 2024 సెప్టెంబరు 8 వరకు
- **వెబ్‌సైట్:** rrbsecunderabad.gov.in/

సిలబస్

స్టేజ్-1 పరీక్ష

మేథమెటిక్స్: నంబర్ సిస్టమ్స్, బోడమస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం అండ్ హెచ్‌సీఎం, రేషియో అండ్ ప్రొపర్షన్, పర్సంటేజెస్, మెన్సురేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, సింపుల్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగొనామెట్రీ, ఎలిమెంటరీ స్టాటిస్టిక్స్, స్క్వేర్ రూట్, ఏజ్ క్యాలిక్యులేషన్స్, క్యాలెండర్ అండ్ క్లాక్, పైప్స్ అండ్ సిస్టర్న్

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్: అనలాజిస్, ఆల్ఫాబెటికల్ అండ్ నంబర్ సిరీస్, కోడింగ్ అండ్ డీకోడింగ్, మేథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, సిల్లాగిజమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ సఫిషియెన్సీ, కన్‌క్లూజన్స్ అండ్ డెసిషన్ మేకింగ్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్- ఆర్గ్యుమెంట్స్ అండ్ అసంప్షన్స్

జనరల్ అవేర్‌నెస్: నాలెడ్జ్ ఆఫ్ కరెంట్ అఫైర్స్, ఇండియన్ జాగ్రఫీ, కల్చర్ అండ్ హిస్టరీ ఆఫ్ ఇండియా ఇన్‌క్లూడింగ్ ఫ్రీడమ్ స్ట్రగుల్, ఇండియన్ పాలిటీ అండ్ కాన్‌స్టిట్యూషన్, ఇండియన్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంటల్ ఇష్యూస్ కన్సర్నింగ్ ఇండియా అండ్ ద వరల్డ్, స్పోర్ట్స్, జనరల్ సైంటిఫిక్ అండ్ టెక్నలాజికల్ డెవలప్‌మెంట్స్.

జనరల్ సైన్స్: ఫిజిక్స్, కెమిస్ట్రీ అండ్ లైఫ్ సైన్సెస్(సీబీఎస్ఈ సిలబస్ పదో తరగతి వరకు)

లిటిల్స్



మీకు తెలుసా?


ఈ రోడ్డు ప్రపంచానికి డెడ్ ఎండ్ ఉత్తర ధ్రువం దగ్గర ఉన్న ఒక రహదారి. ప్రపంచంలోనే అత్యంత అందమైన, అద్భుతమైన రోడ్డు. దీని మీద ప్రయాణం చేస్తున్నంత సేపూ ఆకాశంలోకి, చందమామ దగ్గరికి వెళుతున్నట్టే ఉంటుంది. ఈ రోడ్డు నార్వేలోఉంది.ఇక్కడికి వస్తే, ప్రపంచయాత్ర ముగిసినట్టే. ఈ ఈ రోడ్డు పేరు 69 హైవేప్రపంచానికి డెడ్ ఎండ్‌చెప్పే రహదారిగా ఇది ఎంతో ప్రసిద్ధి చెందినది. భూమిపై ఇంత చివరి వరకూ వెళ్లే ఈ రోడ్డు ఇదొక్కటే. మంచుతో గడ్డ కట్టిన ఉత్తర ధ్రువప్రాంతంలో ఒక హైవే నిర్మించాలని 1909లో అనుకున్నారు. కానీ, దీని నిర్మాణం పూర్తి అయింది మాత్రం 1999లో. ధ్రువ ప్రాంతాల్లో ఈ రోడ్డు వేయడం అంత సులువైన పని ఏమీ కాదు.అందుకే ఈ రహదారిని ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా భావిస్తారు. ఇది నార్వేలోని ఓల్డర్ ఫోర్డ్‌ని, నార్త్ కాప్ ప్రాంతంతో కలుపుతుంది. శతబ్దాలనుండి ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా ఉన్న ప్రాంతాలను ఈ రోడ్డు యూరప్‌తో కలుపుతుంది.

ఈ హైవేపై ప్రయాణిస్తే, మంచి ప్రకృతి సౌందర్యాన్ని చూడవచ్చు. దారి పొడవునా, మంచు కొండలు, గుట్టలు. లోతైన లోయలు ఎత్తైన దేవదారు వృక్షాలు, రెయిన్ డీర్స్ ఇక్కడ కనువిందు చేస్తాయి. ఈ రోడ్డుపై కొన్ని చోట్ల ఒంటరిగా ప్రయాణించడానికి అనుమతి లేదు గుంపుగా ఉంటేనే అక్కడినుండి వెళ్లడానికి అనుమతి ఉంటుంది. వందల కిలో మీటర్ల పాటు, సముద్ర తీరంపైన ఈ రోడ్డుపై వెళుతుంటే, పక్కనే ఉన్న చిన్నచిన్న గ్రామాలు తీరం వెంట కట్టిన చిన్న పిచ్చుక గూళ్లలాగా కనిపిస్తాయి. ఈ డెడ్ ఎండ్ వద్ద ఒక సొరంగాన్ని నిర్మించారు. ఇది మెగెరొయాఅనే మరో ద్వీపాన్ని, కలుపుతుంది. ఈ హైవే అంతమయే ప్రాంతాన్ని నార్డికాప్ అంటారు. చలికాలంలో ఐతే ఇక్కడి వాతావరణం సంగతి చెప్పనవసరంలేదు ఎలాగూ ఉత్తర ధ్రువమంతా మంచుతో కప్పబడిపోతుంది. వేసవిలో సూర్యుడు అస్తమించడు, ఇక చలికాలం అంతా చీకటే ఉంటుంది. ఇక్కడ నివసించే వారికి మిగతా ప్రపంచంతో సంబంధం ఉండదు. వందల యేళ్లనుండి వారు అలాగే జీవిస్తున్నారు. వారంతా సముద్రంలోని చేపలు పీతలను పడుతూ జీవిస్తుంటారు. ఈ ప్రాంతం చేపలకు చాలా ప్రసిద్ధి. వందల యేళ్లనుండి అనేకులుచేపల వేటకు ఈ ప్రాంతానికి వచ్చేవారు. అట్లాంటిక్ సముద్రం ప్రశాంతంతగా ఉన్నపుడు, ఈ రోడ్డు మీద ప్రయాణం అందమైన అనుభూతిని కలిగిస్తుంది. నేరుగా సముద్రంలోకే వెళ్లిపోతున్నామా అనిపించి కొంచెం భయం కూడా వేస్తుంది.

10 తేడాలను గుర్తించండి?



దారి కనుక్కోండి



గాడిదలు ఎన్ని? కోళ్లు ఎని?



సరైన నీడలతో జత పరచండి



డైలీ సుడోకు - 369

		1	2	6	
4					
	5	3			
			6	5	
					6
	2	6	1		

సుడోకు - 368 సమాధానం

8	9	1	7	5	6	3	4	2
5	7	3	2	4	1	9	6	8
2	4	6	3	8	9	1	7	5
7	2	8	9	6	3	5	1	4
9	3	5	1	7	4	2	8	6
6	1	4	5	2	8	7	9	3
3	8	7	4	9	5	6	2	1
1	6	9	8	3	2	4	5	7
4	5	2	6	1	7	8	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.